


అంతా గందరగోళం

టీచర్ల హేతుబద్ధీకరణలో లోపించిన సమతుల్యం

ప్రాథమిక పాఠశాలలకు ఎస్జీటీల కేటాయింపులో విద్యాశాఖ అధికారులు తీవ్ర వివక్ష చూపుతున్నారు. మోడల్ ప్రైమరీ స్కూళ్లు, హైస్కూళ్లలోని ప్రాథమిక తరగతులకు ప్రతి పది మందికి ఒకరు చొప్పున టీచర్లను కేటాయించారు. అదే ఫౌండేషన్ స్కూళ్లు, బేసిక్ ప్రైమరీ స్కూళ్లలో విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రతి 30మందికి ఒక ఎస్జీటీని ఇవ్వడం ఎక్కడి హేతుబద్ధత అన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. హైస్కూళ్లలో అయితే మరీ విడ్డూరంగా పది మందికే ఇద్దరు టీచర్లను కేటాయించడంలోని ఔచిత్యాన్ని టీచర్లు ప్రశ్నిస్తున్నారు. ప్రాథమిక తరగతులు ఉన్న పాఠశాలలకు పేరు ఏదైనా విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా టీచర్లను కేటాయించాలని పిల్లల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

- కొన్ని ప్రాథమిక పాఠశాలలపై వివక్ష
- యూపీలకు ఎస్జీటీలే దిక్కు
- ప్రభుత్వ తీరుపై ఉపాధ్యాయుల గరంగరం



ప్రాథమిక పాఠశాల్లో చదువుతున్న 6, 7, 8 తరగతుల విద్యార్థులకు వచ్చే విద్యా సంవత్సరం నుంచి సెకండరీ గ్రేడ్ టీచర్లు మాత్రమే బోధించనున్నారు. ప్రస్తుతం యూపీ స్కూళ్లలో పనిచేస్తున్న స్కూలు అసిస్టెంట్లను మిగులు టీచర్లుగా గుర్తించి వారిని అవసరం ఉన్న హైస్కూళ్లకు సర్దుబాటు చేయనున్నారు. జిల్లాలోని 180 యూపీ స్కూళ్లు, 59 పాఠశాలలు హైస్కూళ్లుగా అప్‌గ్రేడ్ కాగా 57 యూపీ స్కూళ్లను యథాతథంగా కొనసాగించనున్నారు. మిగిలిన వాటిని బేసిక్ ప్రైమరీ, మోడల్ ప్రైమరీ స్కూళ్లుగా డౌన్‌గ్రేడ్ చేశారు.

యూపీలకు ఎస్జీటీలే దిక్కు

హైస్కూళ్లలో 6, 7, 8 తరతగతులకు స్కూలు అసిస్టెంట్లు బోధిస్తుండగా యూపీ స్కూళ్లలో మాత్రం ఎస్జీటీలే పాఠాలు చెప్పనున్నారు. అదే యూపీ స్కూళ్లకు అరకొరగా ఎస్జీటీలను కేటాయిస్తున్నారు. 1 నుంచి 10 మందికి ఒక ఎస్జీటీ, 11 నుంచి 30 మందికి ఇద్దరు, 31 నుంచి 140 మందికి నలుగురు, 141 నుంచి 175 మందికి ఐదుగురు ఎస్జీటీలను కేటాయిస్తున్నారు. 30 మందిలోపు పిల్లలు ఉన్న యూపీ స్కూళ్లను పరిగణనలోకి తీసుకుంటే ఇద్దరు ఎస్జీటీలు 6, 7, 8 తరగతులకు ఒక్కోదానిలో ఏడు సబ్జెక్టులు బోధించడం సాధ్యమా? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. విద్యార్థులకు నాణ్యమైన, గుణాత్మక విద్యను అందిస్తామంటున్న ప్రభుత్వ ప్రకటనకు, వాస్తవ పరిస్థితులకు పొంతన లేకుండా పోయింది.

ఒంగోలు విద్య, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణపై గందరగోళం నెలకొంది. వివాదాస్పద 117 జీవో అనంతరం పాఠశాలల పునర్వ్యవస్థీకరణ, టీచర్ల పునర్విభజన విషయంలో ఇంకా సందిగ్ధం కొనసాగుతోంది. పాఠశాల విద్యాశాఖ అధికారులు పూటకో నిర్ణయం తీసుకుంటూ ఇబ్బందికర పరిస్థితులను సృష్టిస్తున్నారు. పాఠశాలల ఏర్పాటు, టీచర్ల కేటాయింపులకు సంబంధించి ఇప్పటికి మూడుసార్లు నిబంధనలు మారిపోవడంతో ఈ ప్రక్రియ ఒక కొలిక్కి రాలేదు. విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ సోమవారం నుంచి ప్రారంభమైనప్పటికీ పాఠశాలలపై ఇంకా ఒక స్పష్టత కరువైంది. 117 జీవోను రద్దు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో సంబరపడిన టీచర్లకు అనంతరం జరుగుతున్న పరిణామాలు ఆందోళనకు గురిచేస్తున్నాయి. పాఠశాలలకు టీచర్లను కేటాయించడంలో హేతుబద్ధత లోపించిందని ఉపాధ్యాయ సంఘాల నేతలు మండిపడుతున్నారు. ప్రాథమిక స్థాయిలో 1 నుంచి 5 తరగతుల పాఠశాలలకు టీచర్ల కేటాయింపులో వివక్షను వేలెత్తి చూపుతున్నారు. యూపీ స్కూళ్లకు సెకండరీ గ్రేడ్‌ల కేటాయింపు పట్ల కూడా టీచర్లు భగ్గుమంటున్నారు. 3, 4, 5 తరగతులను తొలగిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం కొన్ని హైస్కూళ్లలో 1 నుంచి 10 తరగతులు నిర్వహించేందుకు పూనుకోవడాన్ని వ్యతిరేకిస్తున్నారు.

పోస్టుల కేటాయింపులో వివక్ష

ప్రాథమిక స్థాయిలో 1 నుంచి 5 తరగతుల విద్యార్థులకు వివిధ పేర్లతో ఏర్పాటు చేస్తున్న ప్రాథమిక పాఠశాలలకు టీచర్ల కేటాయింపులో హేతుబద్ధత పూర్తిగా లోపించింది. ప్రభుత్వ మానస పుత్రికగా ఏర్పాటవుతున్న మోడల్ ప్రైమరీ స్కూళ్లు, హైస్కూళ్లలో 1 నుంచి 5 తరగతులకు టీచర్ల కేటాయింపులో చూపిన శ్రద్ధ ఇతర పాఠశాలల పట్ల ప్రదర్శించకుండా వివక్ష చూపుతున్నారన్న విమర్శలు వస్తున్నాయి.

- 1, 2 తరగతులు ఉండే ఫౌండేషన్ స్కూళ్లకు 1 నుంచి 30 మంది పిల్లలు వరకు ఒక ఎస్జీటీ, 31 నుంచి 60 మందికి ఇద్దరు ఎస్జీటీలను కేటాయిస్తున్నారు.
- 1 నుంచి 5 తరగతుల విద్యార్థులు ఉండే బేసిక్ ప్రైమరీ స్కూళ్లకు 1 నుంచి 20 మంది వరకు 1 ఎస్జీటీ, 21 నుంచి 60

మిగతా 6వ పేజీలో

మెప్మాలో ఆర్పీల అవినీతిపై విచారణ

- బాధిత పొదుపు సభ్యులతో మాట్లాడిన ఐబీ స్పెషలిస్టు
- త్రిసభ్య కమిటీ ఏర్పాటుకు సిద్ధమైన పీడీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



కేశవస్వామిపేట పొదుపు సభ్యుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఐబీ స్పెషలిస్ట్ ఫణికుమారి

ఒంగోలు, కార్పొరేషన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)లో ఆర్పీల అవినీతి, పొదుపు సభ్యులను మోసం చేసి బోగస్ గ్రూపులతో రుణాలు తీసుకోవడంపై అధికారులు స్పందించారు. 'మళ్లీ బోగస్ రుణమోసం' శీర్షికన ఆంధ్రజ్యోతి శనివారం ప్రచురించిన కథనంపై ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీహరి ఆదేశాల మేరకు సంస్థాగత నిర్మాణం (ఐబీ) స్పెషలిస్ట్ ఫణికుమారి విచారణ ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక చెన్నకేశవస్వామిపేటకు చెందిన గ్రూపుల బాధ్యతలు చూసే ఆర్పీని, మోసపోయిన పొదుపు మహిళలను పిలిపించి విచారణ చేశారు. ఈ సందర్భంగా యానాది సామాజికవర్గానికి చెందిన పొదుపు మహిళలు తమకు జరిగిన అన్యాయాన్ని పీడీ ఎదుట వివరించారు. తమ పేరుతో రుణాలు తీసుకోవడంతో బ్యాంకర్లు ఒత్తిడి చేస్తున్నారని వివరించారు. అలాగే బెదిరింపులకు పాల్పడిన ఆర్పీని తమ గ్రూపు బాధ్యతల నుంచి తొలగించి, తమలో చదువుకున్న వారిలో ఒకరిని నియమించాలని కోరారు. దీనిపై రాతపూర్వకంగా పొదుపు సభ్యులు పీడీకి వివరించారు. బోగస్ గ్రూపుల పేరుతో నగరంలో భారీగా బ్యాంకుల నుంచి రుణాల పొందిన వాటిపైనా పీడీ లోతుగా విచారణ చేయించేందుకు సిద్ధమయ్యారు. అందుకోసం ముగ్గురు ఉద్యోగులతో త్రిసభ్య కమిటీని నియమించనున్నారు. బ్యాంకుల వారీగా ఈ మూడు నెలల్లో తీసుకున్న రుణాల వివరాలను సేకరించి నకిలీ గ్రూపులను గుర్తించనున్నట్లు తెలిసింది.



పశుపక్షాదుల కోసం .. నీటి తొట్టెలు, మూకుడులు

- ఒంగోలులో కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు
- ప్రారంభించిన కలెక్టర్ అన్సారియా

7

రేషన్ మాఫియా పాత్రే కీలకమా?

టీడీపీ నేత వీరయ్య హత్య కేసులో దొరికిన సూత్రధారులు

- పాత్రధారుల కోసం గాలింపు
- రాజకీయ పెద్దల అండపై ప్రత్యేక దర్యాప్తు



వీరయ్య హత్యకు గురైన గదిని పరిశీలిస్తున్న ఎస్పీ దామోదర్ (ఫైల్)

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ఒంగోలులో జరిగిన టీడీపీ నేత వీరయ్యచౌదరి హత్యలో రేషన్ మాఫియా పాత్ర కీలకంగా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. తదనుగుణంగా దర్యాప్తును ముమ్మరం చేశారు. హంతకులకు మండల, నియోజకవర్గస్థాయిలోని రాజకీయ నాయకుల అండ ఎంత మేరకు ఉందన్న విషయంపై విచారణ చేపట్టారు. దీంతో ఈ హత్య కేసు మరికొన్ని మలుపులు కూడా తిరగవచ్చని భావిస్తున్నారు. ఇప్పటికే కొందరు సూత్రధారులు పోలీసుల అదుపులో ఉన్నారు. హత్య ఘటనలో పాల్గొన్న పాత్రధారులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు వేట ప్రారంభించాయి. ఇటు పాత్రధారులతోపాటు.. వారికి రాజకీయంగా ఎవరి అండ లభించిందన్న విషయాన్ని తెలుసుకొని వివరాలను వెల్లడించాలన్న ఆలోచనలో పోలీసు అధికారులు ఉన్నట్లు తెలిసింది. ఒంగోలులో మంగళవారం రాత్రి టీడీపీ నాయకుడు ముప్పవరపు వీరయ్య చౌదరి హత్య జరిగిన విషయం విదితమే. నాలుగు రోజుల అనంతరం శుక్రవారం హంతకులు వినియోగించిన స్కూటీ దొరికిన తర్వాత కేసు మిస్టరీ

మిగతా 6వ పేజీలో

రేషన్ మాఫియాపై పోలీసుల దృష్టి

వీరయ్య హత్యలో రేషన్ మాఫియా పాత్రపైనే పోలీసులు ఎక్కువ అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఆ కోణంలో దర్యాప్తును ముమ్మరం చేశారు. హతుని స్వగ్రామానికి చెందిన అనుమానితునితోపాటు మండలంలో వీరయ్యకు శత్రువుగా ఉంటూ రేషన్ మాఫియాలో కీలకపాత్ర పోషిస్తున్న వ్యక్తి కూడా పోలీసుల అదుపులో ఉన్నాడు. అతనిపై రౌడీషీట్ ఉంది. రేషన్ దందాలో జిల్లావ్యాప్తంగా విస్తృత పరిచయాలు ఉన్నాయి. దీంతో పోలీసులు ఆవైపు ప్రత్యేక దృష్టి సారించారు. రేషన్ మాఫియాలో కీలకపాత్ర పోషిస్తున్న చీరాల ప్రాంతానికి చెందిన కొందరిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. అలాగే గత ఐదేళ్లలో రేషన్ మాఫియాలో ప్రస్తుత అనుమానితునితో సంబంధాలు ఉన్న మరికొందరి పాత్రపై కూడా దర్యాప్తు ప్రారంభించారు.

ఏడుగురు తహసీల్దార్ల బదిలీ

- ఇరువురికి అడ్‌హక్ ఉద్యోగోన్నతి
- సస్పెన్షన్‌లో ఉన్న ఒకరికి పోస్టింగ్

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఏడుగురు తహసీల్దార్‌లకు పోస్టింగ్‌లు ఇస్తూ కలెక్టర్ తమీమ్ అన్సారియా శనివారం ఉత్తర్వులు జారీచేశారు. వారిలో నలుగురిని పరిపాలనా సౌలభ్యం కోసం బదిలీ చేశారు. డిప్యూటీ తహసీల్దార్లుగా పనిచేస్తున్న ఇరువురికి అడ్‌హక్ ఉద్యోగోన్నతులు కల్పించారు. మూడు నెలల క్రితం సస్పెండ్ అయిన కనిగిరి తహసీల్దార్‌కు తిరిగి పోస్టింగ్ ఇచ్చారు. సీఎస్‌పురం తహసీల్దార్‌గా పనిచేస్తున్న డి.మంజునాథరెడ్డిని ఎర్రగొండపాలెం, మార్కాపురం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఏవోగా పనిచేస్తున్న కె.రవీంద్రారెడ్డిని సీఎస్‌పురం తహసీల్దార్‌గా బదిలీ చేశారు. కలెక్టరేట్‌లో ల్యాండ్ సెక్షన్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఎస్ఎల్.నారాయణరెడ్డిని మద్దిపాడు తహసీల్దార్‌గా, దొనకొండలో పనిచేస్తున్న జగదీశ్వరరావును కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ జిల్లా ఆడిట్ సూపరింటెండెంట్‌గా నియమించారు. కనిగిరి తహసీల్దార్‌గా పనిచేస్తూ సస్పెన్షన్‌కు గురైన సిహెచ్.అశోక్‌కుమార్‌రెడ్డిని పెండింగ్ విచారణ కింద రాచర్ల తహసీల్దార్‌గా పోస్టింగ్ ఇచ్చారు. హెచ్ఎంపాడులో డీటీగా పనిచేస్తున్న కె.కిషోర్‌కుమార్‌ను అడ్‌హక్ ఉద్యోగోన్నతిపై తర్లుపాడు, పొన్నలూరు డీటీగా పనిచేస్తున్న కె.వెంకటేశ్వరరావును పుల్లలచెరువు తహసీల్దార్‌గా నియమించారు.



- రూ.20వేల భృతి విడుదల
- నమూనా చెక్కును అందజేసిన కలెక్టర్
- సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

మత్స్యకారులకు ఊరట

ఒంగోలు నగరం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు రాష్ట్రప్రభుత్వం ఇచ్చే భృతిని శనివారం వారి బ్యాంక్ ఖాతాలకు జమచేశారు. ఈ సందర్భంగా ప్రకాశం భవన్ లోని సమావేశం హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా నమూనా చెక్కును మత్స్యకారులకు అందజేశారు. వేట నిషేధ సమయంలో మత్స్యకారుల కుటుంబాలను ఆదుకునేందుకు ప్రభుత్వం ఈ భృతిని విడుదల చేసింది. ఆ సొమ్మును మత్స్యకారుల బ్యాంక్ ఖాతాలకు జమచేసే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శ్రీకాకుళం జిల్లాలో శనివారం ప్రారంభించారు. లైవ్‌ను కలెక్టరేట్‌లో మత్స్యకారులు తిలకించారు. అనంతరం కలెక్టర్ అన్సారియా మాట్లాడుతూ గతంలో రూ.10వేలు ఇచ్చే భృతిని ఇప్పుడు ప్రభుత్వం రూ.20వేలకు పెంచిందన్నారు. జిల్లాలోని 5,501 మంది మత్స్యకారులకు రూ.20వేలు భృతి విడుదల చేశామన్నారు. కొత్తపట్నం, ఒంగోలు, టంగుటూరు, సింగరాయకొండ, నాగులుప్పలపాడు మండలాలకు చెందిన మత్స్యకారులకు భృతి అందజేస్తున్నట్లు

మిగతా 6వ పేజీలో



ఒంగోలులోని ప్రకాశం భవన్ వద్ద సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మత్స్యకారులు



ఆట మొదలైంది..

7

గుమ్మడి పవన్‌కుమార్ మెమోరియల్ ఇన్విటేషన్ టోర్నమెంట్ (పురుషుల డబుల్స్) షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ఒంగోలులోని హైదరీ క్లబ్‌లో శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు, కర్ణాటక నుంచి 22 జట్లు తలపడుతున్నాయి. తొలిరోజు క్రీడాకారులు గెలుపు కోసం హోరాహోరీ పోరాడారు. ఆదివారం ఫైనల్స్ జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

సైబర్ నేరగాళ్ల సరికొత్త మోసం

- ఎస్బీఐ కార్డు వేరే బ్యాంకు ఏటీఎంలో వినియోగం
- ఆ వెంటనే ఖాతాలో ఉన్న రూ.5.18 లక్షలు ఇతరులకు ట్రాన్స్‌ఫర్
- లబోదిబోమంటున్న ఉపాధ్యాయుడు

7లో

సగంలోనే సర్దేస్తారా?

- టంగుటూరు-పాదిలి రోడ్డు అభివృద్ధి పనులపై నీలినీడలు
- ఎన్డీబీ నిధుల్లో కోతతో ఆసక్తి చూపని కాంట్రాక్టర్
- ప్రజల్లో అనుమానాలు

6లో

లక్ష మెట్రిక్ టన్నుల ఇసుకను నిల్వ చేయాలి

● కలెక్టర్ అన్సారియా ఆదేశం


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని జిల్లాలో లక్ష మెట్రిక్ టన్నుల ఇసుకను నిల్వ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. జిల్లాలోని అన్ని ఇసుక డిపోల్లో ఈ నిల్వలు ఉండేలా చూడాలన్నారు. స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో శనివారం సాయంత్రం గనుల శాఖ అధికారులు, ఇసుక స్టాక్ యార్డుదారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలోని ఆరు ఇసుక స్టాక్ పాయింట్లలో వినియోగదారులకు అవసరమైన మేరకు అందుబాటులో ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు ఇసుక అక్రమ రవాణా, దుర్వినియోగం, బ్లాక్ మార్కెట్ విక్రయదారులపై కఠినంగా వ్యవహరించాలని కలెక్టర్ ఆదేశించారు. వాగుల, వంకల నుంచి ట్రాక్టర్ల ద్వారా దూర ప్రాంతాలకు ఇసుక రవాణాను కట్టడి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైతే తహసీల్దార్లను వినియోగించుకొని అక్రమార్కులపై కఠిన చర్యలతో పాటు అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.


సబ్‌జైలులో బియ్యంను పరిశీలిస్తున్న జూనియర్ సివిల్ న్యాయాధికారి ఓంకార్

సబ్‌జైలును తనిఖీ చేసిన సివిల్ న్యాయాధికారి

గిద్దలూరు టౌన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సబ్ జైలును శనివారం జూనియర్ సివిల్ న్యాయాధికారి ఏ ఓంకార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఖైదీలు ఉండే రూములను, అందులోని సదుపాయాలను క్షుణ్ణంగా పరిశీలించారు. సరుకుల నాణ్యతను పరిశీలించి పలు సూచనలు చేశారు. విచారణలో ఉన్న ఖైదీలతో ఆయన మాట్లాడుతూ అందుతున్న సదుపాయాల గురించి తెలుసుకున్నారు. వారిపై ఉన్న కేసుల వివరాలను తెలుసుకుని విచారణలో ఉన్న ఖైదీలు సొంతంగా న్యాయవాదిని పెట్టుకునే స్థోమత లేకపోతే ఉచితంగా వాదించడానికి న్యాయవాదిని న్యాయసేవాధికార సంస్థ ద్వారా పొందవచ్చని, అందుకు అర్జీ పెట్టుకోవాలని సూచించారు. వారికి అరెస్టు, బెయిల్, ఉచిత న్యాయసహాయం గురించి తెలియచేశారు. ఆవేశం అనర్థదాయకమని, ఆ తరువాత పశ్చాత్తాప పడితే ప్రయోజనం ఉండదన్నారు. కార్యక్రమంలో సబ్ జైలు సూపరింటెండెంట్ యూ లింగారెడ్డి, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ షేక్ ఫాజిల్, పారాలీగల్ వలంటీర్ అద్దంకి మధుసూదన్‌రావు పాల్గొన్నారు.



జేఈఈ కోచింగ్‌కు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్

జేఈఈ కోచింగ్‌కు ఏకలవ్య విద్యార్థులు

పెద్దదోర్నాల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : ఏకలవ్య ఆదర్శ కళాశాలకు చెందిన గిరిజన విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్ ప్రత్యేక శిక్షణ శిబిరానికి ఢిల్లీ వెళ్తున్నట్లు ప్రిన్సిపాల్ ఈశ్వర్‌సింగ్ శనివారం తెలిపారు. కళాశాలకు చెందిన సీహెచ్ నాగలక్ష్మి, బీ మల్లీశ్వరిబాయి, ఎం.అనూబాయి, డీ అనూషబాయి కేంద్ర సంస్థ ఎన్ఈఎస్‌టీ న్యూఢిల్లీ నిర్వహిస్తున్న జేఈఈ అడ్వాన్స్‌డు ప్రత్యేక శిక్షణ శిబిరానికి ఎంపికైనట్లు ఆయన తెలిపారు.

నగరంలో పోలీసుల తనిఖీలు

ఒంగోలు క్రైం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): పహల్గామ్‌లో ఉగ్రవాదుల దాడి నేపథ్యంలో ఒంగోలు నగరంలో పోలీసులు అప్రమత్తం అయ్యారు. శనివారం రాత్రి నగరంలో పలు లాడ్జిలు, ముఖ్యమైన ప్రాంతాలలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈమేరకు నెల్లూరు బస్టాండ్, కొత్తపట్నం బస్టాండ్, ఇస్లాంపేటలలో వాహనాలు తనిఖీలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో టూటౌన్ సీఐ మేడా శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సగంలోనే సర్దేస్తారా?

టంగుటూరు-పొదిలి రోడ్డు పనులపై నీలినీడలు
ఎన్డీబీ నిధుల్లో కోతతో ఆసక్తి చూపని కాంట్రాక్టర్
ప్రజల్లో అనుమానాలు
మంత్రి స్వామి జోక్యం చేసుకోవాలని మండల ప్రజల వేడుకోలు


ప్రమాదభరితంగా ఉన్న టంగుటూరు - పొదిలి రహదారి

మర్రిపూడి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోనే అతిపెద్ద రహదారిగా పేరొందిన టంగుటూరు-పొదిలి ఆర్అండ్‌బీ రోడ్డు అభివృద్ధిపై నీలినీడలు కమ్ముకున్నాయి. దీన్ని రెండు వరుసలుగా చేసేందుకు గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పట్లో శాసనసభ్యుడిగా ఉన్న డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి రూ.39కోట్ల ఎన్డీబీ నిధులు మంజూరు చేయించారు. అనంతరం ఎన్నికలు వచ్చాయి. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టెండర్ల ప్రక్రియను పూర్తి చేసింది. చిత్తూరు జిల్లాకు చెందిన ఒక ప్రజాప్రతినిధి కాంట్రాక్ట్ పనులు దక్కించుకున్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో పనులు చేపట్టకుండా అలవిమాలిన జాప్యం చేశారు. దీంతో రహదారి పనులు 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్న చందంగా మారాయి. ఈనేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, స్థానిక శాసనసభ్యుడైన స్వామి మంత్రిగా బాధ్యతలు చేపట్టడంతో రహదారి అభివృద్ధిపై ప్రజలు ఆశలు పెంచుకున్నారు. ఆశించిన విధంగానే పనులు ప్రారంభమయ్యాయి. అయితే అనుకోకుండా ప్రస్తుత ప్రభుత్వం ఎన్డీబీ నిధుల్లో కోత విధిస్తూ నిర్ణయం తీసుకుంది. రూ.39కోట్లతో చేపట్టాల్సిన రెండు వరుసల రహదారి అభివృద్ధి పనులను రూ.8కోట్లకు కుదించింది.

ఎట్లూరులో 600 మీటర్ల సీసీ రోడ్డు నిర్మించాల్సి ఉండగా 300 మీటర్లకు తగ్గించింది. మర్రిపూడిలోని సబ్‌స్టేషన్ నుంచి చెరువు కట్ట వరకు 300 మీటర్ల సీసీ రోడ్డుతోపాటు చెరువుకట్ట వద్ద ప్రమాదభరితంగా మారిన వ్యవసాయ బావులను పూడ్చి సింగిల్ రోడ్డును రేగలగడ్డ వరకు పూర్తి చేయాలని నిర్దేశించింది. దీంతో పనులు చేపట్టడానికి సబ్ కాంట్రాక్టర్ ఉత్సాహం చూపడం లేదు. పెట్లూరులో ప్రారంభించిన సీసీ రోడ్డు పనులను ఆలస్యం చేస్తున్నారు. అక్కడ సీసీ రోడ్డును 300 మీటర్లు వేసి సర్దుకోవాలని చూస్తున్నట్లు తెలిసింది. అదే జరిగితే నిత్యం ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని మర్రిపూడి చెరువుకట్ట కింద ప్రయాణించే వాహనచోదకులకు అవస్థలు తప్పవు. మర్రిపూడి, దర్శి, కొండపి నియోజకవర్గాలకు అనుసంధానం చేసే ప్రధాన రహదారి పనులు నిలిచిపోయే అవకాశం ఉండటంతో ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంత్రి స్వామి జోక్యం చేసుకొని పనులు సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

అంతా గందరగోళం

(5వ పేజీ తరువాయి)

మంది వరకు ఇద్దరు ఎస్జీటీలను నియమిస్తారు.

మోడల్ ప్రైమరీ స్కూళ్లకు 59 మంది విద్యార్థుల వరకు 1 ప్రైమరీ స్కూలు హెచ్ఎం, మూడు ఎస్జీటీలను కేటాయిస్తున్నారు.

60 నుంచి 150 మంది విద్యార్థులు ఉన్న మోడల్ ప్రైమరీ స్కూళ్లకు 1 ప్రైమరీ స్కూలు హెచ్ఎం, నలుగురు ఎస్జీటీలను ఇస్తున్నారు. 150 మంది పిల్లల తర్వాత ప్రతి 30మందికి ఒక ఎస్జీటీ అదనంగా కేటాయిస్తారు. ఎస్జీటీలు మిగులుగా ఉంటే 120 నుంచి 150 మందికి ఒక ఎస్జీటీని అదనంగా ఇస్తారు. ప్రైమరీ స్కూలు హెచ్ఎం పోస్టు లేని మోడల్ ప్రైమరీ స్కూళ్లకు మిగులుగా తేలుతున్న స్కూలు అసిస్టెంట్లను హెచ్ఎంలుగా నియమించనున్నారు.

ప్రాథమిక పాఠశాలల్లో 1 నుంచి 5 తరగతులకు బేసిక్ ప్రైమరీ స్కూలు/ మోడల్ ప్రైమరీ స్కూలు నిబంధనల ప్రకారం ఎస్జీటీలను కేటాయిస్తారు.

హైస్కూళ్లలోని 1 నుంచి 5 తరగతులకు పది మంది వరకు పిల్లలకు ఇద్దరు ఎస్జీటీలు, 11 నుంచి 30 మందికి మూడు ఎస్జీటీలు, 31 నుంచి 40 మందికి నాలుగు ఎస్జీటీలను ఇస్తున్నారు. 40 మందిపైన ఉంటే ఒక పీఎస్‌హెచ్ఎం, నాలుగు ఎస్జీటీలను కేటాయిస్తున్నారు.

మత్స్యకారులకు ఊరట

(5వ పేజీ తరువాయి)

తెలిపారు. కార్యక్రమంలో మత్స్య శాఖ జాయింట్ డైరక్టర్ శ్రీనివాసరావు, కొత్తపట్నం ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, మత్స్యకార సొసైటీ జిల్లా అధ్యక్షుడు పేరయ్య, తిరుపతిరావు, సున్నం తిరుపతి, రాయం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలభిషేకం

మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో ఇచ్చే భృతిని రూ.20వేలకు పెంచి ఇవ్వటం పట్ల మత్స్యకారులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం నాడు కలెక్టరేట్‌లో వివిధ గ్రామాలకు చెందిన మత్స్యకారులు పాల్గొన్ని సీఎం చిత్రపటానికి పాలభిషేకం నిర్వహించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని చంద్రబాబునాయుడు నిలబెట్టుకున్నాడన్నారు. కార్యక్రమంలో మత్స్యకార సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు పల్లపోతు పేరయ్య, కొత్తపట్నం ఎంపీటీసీ సభ్యుడు నరసింహారావు, కొండూరి తిరుపతిరావు, మేకల జక్రయ్యపాల్గొన్నారు.

రేషన్ మాఫియా పాత్రే కీలకమా?

(5వ పేజీ తరువాయి)

వీడేందుకు దారి ఏర్పడింది. తదనుగుణంగా హత్యతో వీరయ్య స్వగ్రామం, మండల స్థాయిలోని రేషన్, లిక్కర్ మాఫియాలతోపాటు ఇసుక వ్యాపారి పాత్ర ఉన్నట్లు గుర్తించారు. వారికి ఆర్థిక సహకారాన్ని అందించిన వ్యక్తులను కూడా గుర్తించారు. తదనుగుణంగా పలువురుని పోలీసులు అదుపులోకి కూడా తీసుకున్నారు.

రాజకీయ అండపై ప్రత్యేక దర్యాప్తు

ఈ కేసులో సూత్రధారులుగా భావిస్తున్న వారికి రాజకీయపరమైన అండ లభించి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఇటు మద్యం, అటు రేషన్ మాఫియాలలో గత ఆరేడేళ్ల నుంచి డాన్‌గా పేరున్న వ్యక్తి పాత్ర ఉండటంతో పోలీసులు ముందుగా ఆవైపు దృష్టి సారించారు. ప్రత్యేకించి వైసీపీ ప్రభుత్వంలో రేషన్ డాన్‌గా వ్యవహరించిన వ్యక్తికి, మద్యం వ్యాపారికి మధ్య ఉన్న సంబంధాలను పోలీసులు ముందుగానే గుర్తించినట్లు తెలిసింది. అయితే రేషన్ డాన్‌కు ఉన్న రాజకీయ సంబంధాలపై తాజాగా ప్రత్యేక దర్యాప్తు చేపట్టారు. ఆయన రాజకీయ చరిత్రను ఆరంభం నుంచి పరిశీలించినట్లు తెలిసింది. గత వైసీపీ ప్రభుత్వంలో ఆపార్టీ నాయకుడిగా చెలామణి అయిన ఆ డాన్‌కు ముఖ్య రాజకీయ నేతలతో సంబంధాలు ఉన్నట్లు గుర్తించారు. తదనుగుణంగానే అతనిపై ఒకటికి రెండు, మూడు కేసులు ఉన్నా విచారణ ముందుకు సాగలేదన్న నిర్ధారణకు పోలీసులు వచ్చినట్లు తెలిసింది. తదనుగుణంగా అతనితో సంబంధం ఉన్న ఓ మాజీ ప్రజాప్రతినిధి, ఒక మండల స్థాయి నాయకుడి జోక్యంపై సమాచారాన్ని సేకరిస్తున్నారు. ఫోన్ సంభాషణలు ఏమైనా వారి మధ్య జరిగాయా? వారిని ఇటీవల కలిశారా? వారి నుంచి కూడా ఆర్థిక సహకారం లభించిందా? అన్న అంశాలపై ఎస్పీ దామోదర్ స్వీయ దర్యాప్తు చేపట్టినట్లు తెలిసింది. రాజకీయ అండదండలు లేకుండా ఇలాంటి హత్యకు పాల్పడ్డారన్న అనుమానంతో పోలీసులు పరిశీలన చేస్తున్నారు. ఇటీవల కాలంలో రేషన్ మాఫియా నుంచి ఎవరెవరికి డబ్బులు అందాయి, వారికి ఎదురైన సమస్యల్లో చూసీచూడనట్లు పోవాలని అధికారులకు ఎవరు ఫోన్ చేశారు అన్న అంశాలను పరిగణనలోకి తీసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆక్రమంలోనే ఈ కేసులో భాగస్వామిగా భావిస్తున్న రేషన్ డాన్‌కు ఒకరిద్దరు నాయకుల అండదండలు ఉన్నట్లుగా గుర్తించినట్లు కూడా తెలుస్తోంది. అలాంటి వారంతా వైసీపీ నేతలే కావడం గమనార్హం.

పోలీసుల అదుపులో అమ్మనబ్రోలు వాసి

స్వగ్రామంలో రాజకీయంగా వీరయ్యను విభేదిస్తూ ఇటీవల లిక్కర్ వ్యాపారంలో కూడా ప్రవేశించిన వారి పాత్ర కూడా హత్యలో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. వారికి అదే గ్రామానికి చెంది హైదరాబాద్‌లో స్థిరపడిన హతుని విరోధి నుంచి ఆర్థిక సహకారం అందినట్లు కూడా పోలీసులు దర్యాప్తులో నిగ్గుతేల్చారు. తదనుగుణంగా హైదరాబాద్‌లో ఉన్న ఆ వ్యాపార ప్రముఖుడిని పట్టుకునేందుకు పోలీసులు ప్రయత్నించగా అప్పటికే అతను తప్పించుకున్నారు. వెంటనే పోలీసులు ఆయన పాస్‌పోర్టును సీజ్ చేశారు. అయితే అతని ద్వారా గ్రామానికి చెంది ఈ కేసులో సూత్రధారిగా వ్యవహరించిన వ్యక్తికి భారీమొత్తంలో డబ్బులు అందినట్లు పోలీసులు గుర్తించారు. అందుకు సహకరించిన వ్యాపారి సమీప బంధువు, అమ్మనబ్రోలుకు చెందిన ఒక వ్యక్తిని పోలీసులు శనివారం శ్రీశైలంలో అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. అయితే రేషన్ డాన్‌కు రాజకీయ అండ ఉన్నట్లే గ్రామంలోని అనుమానితునికి కూడా రాజకీయ అండ ఉందా అన్న అంశంపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పోలీసుల అదుపులో ఉన్న ఇద్దరు ముగ్గురు వ్యక్తులు గత కొద్దిరోజులుగా ఏ రాజకీయ నాయకుడికి ఫోన్ చేశారు అన్న విషయాన్ని గుర్తించి తదనుగుణంగా దర్యాప్తు చేపట్టారు. ఈ మొత్తం వ్యవహారంలో కిందిస్థాయిలో సూత్రధారులు ఇప్పటికే పోలీసుల అదుపులో ఉండగా హత్యలో ప్రత్యక్షంగా పాల్గొన్న కిరాయి హంతకులు మాత్రం ఇంకా దొరకలేదు. వారికి నాయకత్వం వహించినట్లు భావిస్తున్న ఇసుక వ్యాపారితోపాటు హంతకుల కోసం పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు ప్రారంభించారు. వీరిని పట్టుకోవడంతోపాటు రాజకీయ అండనిచ్చిన నేతలను గుర్తించి ఒకటి రెండు రోజుల్లో ప్రాథమిక దర్యాప్తునకు ముగింపునిస్తూ వివరాలు వెల్లడించేందుకు జిల్లా పోలీసు అధికారులు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

కిరాయి హంతకులు హైదరాబాదీయులా?

● ఒంగోలులో వారం రోజులు మకాం
● బాయ్‌ని అదుపులోకి తీసుకున్న పోలీసులు

ఒంగోలుక్రైం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): వీరయ్యచౌదరిని హత్య చేసేందుకు కిరాయి హంతకులు ఒంగోలులో వారం రోజులు మకాం వేసినట్లు తెలుస్తోంది. నలుగురు వ్యక్తులు ఒంగోలులోని ఓ హాస్టల్‌లో వారంరోజులు పాటు ఉండి వీరయ్యచౌదరి హత్యకు రెక్కీ నిర్వహించారనే నిర్ధారణకు పోలీసులు వచ్చారు. అదేక్రమంలో ఇసుక వ్యాపారి ఆదేశాల మేరకు ఆ నలుగురికి అవసరమైన సదుపాయాలు ఓ యువకుడు చూశాడు. వారికి అవసరమైన భోజనం, టిఫిన్ ను అందజేశాడు. అతనిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. అంతేకాకుండా హత్య జరిగిన అనంతరం కూడా నిందితులకు ఫోన్ ద్వారా సమాచారం అందించినట్లు తెలుస్తోంది. వారి కోసం పోలీసు బృందాలు హైదరాబాద్ వెళ్లి గాలింపు చర్యలు చేపడుతున్నాయి. అంతేకాకుండా ఈ హత్యకు సంబంధించి కీలక సూత్రధారులు ఎవరు ఉన్నారు అనే కోణంలో పోలీసులు లోతుగా విచారణ చేస్తున్నారు. ఈ కేసులో కీలకంగా మారిన ఇసుక వ్యాపారి దొరికితే సూత్రధారులు ఎవ రు పాత్రధారులు ఎంతమంది అనే సమాచారం తెలుస్తుంది.

పోలీసుల అదుపులో వైసీపీ నాయకుడు

నాగులుప్పలపాడు మండలానికి చెందిన కీలక వైసీపీ నాయకుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. గత ప్రభుత్వంలో మండలాన్ని శాసించిన సదరు నాయకుడు ఒంగోలు నివాసం ఉంటాడు. అయితే హత్యకు సంబంధించి కీలక అనుమానితుడైన రేషన్ మాఫియా డాన్‌కు ఆ నాయకుడికి మంచి సంబంధాలు ఉన్నాయి. దాంతో ఆ నాయకుడిపై అనుమానాలు రావడంతో అతనిని పోలీసులు విచారిస్తున్నట్లు తెలిసింది.

రైతులకు నష్టపరిహారం చెల్లించండి

అధికారులకు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి దిశానిర్దేశం


అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన అకాలవర్షాలు, ఈదురుగాలలకు పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లింపునకు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి అన్నారు. పలు శాఖల అధికారులతో ఎమ్మెల్యే శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. పలు సమస్యలకు సంబంధించి ఆయా శాఖల అధికారులకు దిశానిర్దేశం చేశారు. టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి వ్యవసాయ, మండలాభివృద్ధి ఆర్‌డబ్ల్యూఎస్ నియోజకవర్గ అధికారులతో సమావేశమయ్యారు. అకాల వర్షాలు, ఈదురు గాలులతో పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సబ్సిడీపై అందించే వ్యవసాయ పరికరాలు, యంత్రాలు, విత్తనాలను పంపిణీపై సూచనలు ఇచ్చారు. బీసీ, ఎస్సీ కార్పొరేషన్ల మంజూరీలో నిర్ణీత సమయానికి ఇవ్వాలని, ఎస్సీ కార్పొరేషన్ లోన్లు కేటాయించిన యూనిట్లకు ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు.

వేసవికాలం కావడం, రోజురోజుకు ఎండల తీవ్రత కారణంగా గ్రామాలలో తాగునీటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, నీటి సమస్య ఉన్న గ్రామాలను గుర్తించాలన్నారు. సమావేశంలో మండలాల ఎంపీడీవోలు, ఆర్‌డబ్ల్యూఎస్, వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

రేపటి నుంచి వేసవి విజ్ఞాన శిబిరం

చినగంజాం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, రాష్ట్ర పౌర గ్రంథాలయశాఖవారి ఆధ్వర్యంలో శాఖ గ్రంథాలయంలో ఈ నెల 28వ తేదీ నుంచి జూన్ 6వ తేదీ వరకు వేసవి విజ్ఞాన శిక్షణా శిబిరం నిర్వహించనున్నట్లు గ్రంథపాలకులు ఎ.మోహనలక్ష్మీనరసింహా చార్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 28 నుంచి ప్రారంభమయ్యే వేసవి విజ్ఞాన శిబిరంలో 6వ తరగతి నుండి 10వ తరగతి విద్యార్థుల వరకు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. శిక్షణా కార్యక్రమంలో విద్యా ర్థులకు స్పోకెన్ ఇంగ్లీషు, కంప్యూటర్స్, తెలుగు బోధనా పద్దతులు, వివిధ సృజనాత్మక అంశాలపై శిక్షణ ఇవ్వను న్నట్లు తెలిపారు. శిక్షణ కార్యక్రమం పూర్తిగా ఉచితమని, విద్యార్థులు ఈ సదవాకాశాన్ని సద్వినుయోగం చేసుకో వాలని గ్రంథపాలకులు కోరారు.

కిశోర బాలికలకు వేసవి తరగతులు

బల్లికురవ. ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో 11 ఏళ్ల నుంచి 18 ఏళ్ల లోపు ఉన్న కిశోర బాలికలకు వేసవి తరగతులు నిర్వహించేలా ప్రభుత్వం చర్యలు తీసుకొంటోందని ఐసీడీఎస్ సూపర్ వైజర్లు సలోమి, మీరాబి, విజయనిర్మల తెలిపారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో కిశోర వికాసం కింద వేసవిలో ప్రత్యేక తరగతుల నిర్వహణపై సమావేశం నిర్వహించారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు అన్ని గ్రామాలలో బాలికలను గ్రుపులుగా విభజించి వారికి తరగతుల నిర్వహణతో పాటు బాల్య వివాహాల వలన కలుగు నష్టాల గురించి వివరించాలన్నారు. మే 2 వ తేది నుండి జూన్ 15 వరకు ఈ తరగతులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ముగిసిన నాటిక పోటీలు


స్వేచ్ఛ నాటికలోని ఓ సన్నివేశం

మార్టూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): శ్రీకారం రోటరీ కళాపరిషత్‌ల ఆధ్వర్యంలో రెండు రోజుల నుంచి మార్టూరులో జరుగుతున్న 15వ తెలుగురాష్ట్రాల నాటికపోటీలు శనివారం రాత్రితో ముగిశాయి. ముగింపురోజు మూడు నాటికలను ప్రదర్శించారు. వాటిలో తొలుత విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ హైదరాబాదు వారి ఆధ్వర్యంలో స్వేచ్ఛ నాటికను ప్రదర్శించారు. మితిమీరినస్వేచ్ఛ, పరిమితులు లేని జీవితం తెగిన గాలిపటం లాంటిదని నాటిక ద్వారా సందేశం ఇచ్చారు. ప్రతి ఒక్కరూ నియంత్రణ, సంరక్షణ కూడుకున్న స్వచ్ఛత గలిగిన స్వేచ్ఛతో జీవనం సాగించాలని చూపారు. అనంతరం తాడేపల్లి అరవింద ఆర్ట్స్ వారి ఆధ్వర్యంలో 'విడాకులు కావాలి' నాటికను ప్రదర్శించారు. దాంపత్య జీవితంలో భార్యాభర్తల మధ్య చిన్న చిన్న సమస్యలు వస్తుంటాయని, అందుకని వారు విడాకులు తీసుకునే వరకు పోవడం సమంజసం కాదని చాటిచెప్పారు. భారతీయ వివాహ వ్యవస్థలో మన సంస్కృతి సాంప్రదాయాలే వైవాహిక జీవితాలను అన్యోన్యంగా నడిపే దారిదీపాలంటూ సందేశం ఇచ్చారు. భార్యాభర్తల మధ్య పొరబాట్లను ఎత్తిచూపిస్తూ, వాటి పరిష్కారానికి చక్కని మార్గాలను కథారచయిత ఈ నాటికలో చూపడంతో ప్రేక్షకులను కట్టిపడేసింది. చివరగా శ్రీమైత్రి కళా నిలయం విజయవాడ వారిచే బ్రహ్మస్వరూపం నాటికను ప్రదర్శించారు. ఈ నాటికలో మన దైనందిక జీవితంలో మన మనస్సు మంచితనంతో చూడగలిగినపుడు అందరూ మంచివాళ్లలాగే కనిపిస్తారని పేర్కొన్నారు. అయితే ఒక్కోసారి విధి మనకు విరోధిగా మారినపుడు మనం నిస్సహాయులుగా చూస్తూ ఉండాల్సిన పరిస్థితి ఏర్పడతుందని, అలాంటి సమయంలో సాక్షాత్తూ ఆ బ్రహ్మస్వరూపం ఆవహించి ధర్మాన్ని చెబుతుందని ఆలోచనాత్మకంగా కళాకారులు చేసిన ప్రదర్శన ప్రేక్షకులను హత్తుకున్నాయి.

కళలు,కళాకారులు మన జీవితాలలో భాగమే..

కళలు మనసంస్కృతి, సంప్రదాయాలను, ఆచారాలను, జీవనశైలిని భావితరాలకు అందిస్తాయని కార్యక్రమానికి ముఖ్య అతిథి విచ్చేసిన వేదిక అధ్యక్షులు ముత్తవరపు సురేష్ బాబు అన్నారు. ఈ కళలను కళాపరిషత్ లద్వారా నాటికలలో ప్రదర్శన చేస్తూ జనం మనస్సుల్లో శాశ్వతంగా గుర్తుండిపోయే విధంగా కళాకారులు ప్రదర్శన చేశారన్నారు. కళలు, కళాకారులు ఒకే నాణేనికి ఉన్న బొమ్మ బొరుసు లాంటి వారని పేర్కొన్నారు. ముందుగా శనివారం రాత్రి ముత్తవరపు అరుణకుమారి నటరాజవిగ్రహం వద్ద జ్యోతిప్రజ్వలన చేసిన తర్వాత నాటిక పోటీలను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభావేదికపై ఎఫర్ట్ సంస్థ డైరెక్టర్ జాష్టి వెంకటమోహనరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథి ముత్తవరపు సురేష్ బాబు ప్రేక్షకులను ఉద్దేశించి మాట్లాడుతూ కళాపరిషత్‌లలో నిత్యం మనకుటుంబాలలో జరిగే సమస్యలును వివరించడంతో పాటు వాటి పరిష్కారానికి చక్కటి మార్గం చూపగలిగారన్నారు. శారీరకంగా గాకుండా మానసికంగా కళాపరిషత్ నాటిక పోటీలు మనకు ఎంతో ఆనందాన్ని, తృప్తిని ఇచ్చే గొప్ప సాధనాలన్నారు. తరువాత శ్రీకారం రోటరీ కళాపరిషత్ వారు జేఎస్‌డబ్ల్యూ ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ పొదిలి రాజశేఖరరాజు, కొలిపాక సురేషలను రతన్‌టాటా అవార్డులతో సత్కరించారు. కార్యక్రమంలో ఎం.ఈశ్వరప్రసాద్, మద్దుమాల కోటేశ్వరరావు, షేక్ కాజాహుస్సేన్, శానంపూడి లక్ష్మయ్య, మాదాల సాంబ శివరావు, గుండవరపు వెంకటప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వీరయ్యచౌదరి కుటుంబసభ్యులకు ఎమ్మెల్సీ రాజా పరామర్శ


వీరయ్యచౌదరి కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజా, ఎమ్మెల్యే విజయ్‌కుమార్

నాగులుప్పలపాడు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నేత, మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్యచౌదరి దారుణ హత్యకు గురైన నేపథ్యంలో ఆయన కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ (రాజా), సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ శనివారం రాత్రి పరామర్శించారు. అమ్మనబ్రోలులోని వీరయ్యచౌదరి నివాసంలో ఆయన సతీమణి సుచిత్ర, కుమారుడు సిద్ధార్థతో వారు మాట్లాడారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి వీరయ్యచౌదరి చేసిన కృషి మరువలేనిదన్నారు. నిబద్ధత గల నాయకుడిని పార్టీ కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

వీరయ్యచౌదరి చిత్రపటానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు తేళ్ల మనోజ్‌కుమార్, నాయకులు ఇంటూరి శ్రీనివాసరావు, ఈదర వెంకటకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణాలకు అనుమతులు సులభతరం

చీరాల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరిలో జీవో నెం.20 ప్రకటించిందని తద్వారా సులభంగా, వేగంగా భవన నిర్మాణాలకు సంబంధించి అనుమతులు అందుకోవచ్చని మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్ ఒక ప్రకటనలో తెలిపారు. అనుమతులకు సంబంధించి, అలాగే ఐటిఐ, డిప్లమా, బీటెక్ అభ్యర్థులు ఇంజనీర్, సర్వేయర్‌లుగా లైసెన్సులు పొందేందుకు కార్యాలయంలోని హెల్ప్ డెస్క్ విభాగంలో సంప్రదించాలని కమిషనర్ తెలిపారు.



పక్షుల కోసం ఏర్పాటు చేసిన మూకుడులో నీటిపోస్తున్న కలెక్టర్ అన్సారియా

పశుపక్షాదుల కోసం .. నీటి తొట్టెలు, మూకుడులు

- కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు
- ప్రారంభించిన కలెక్టర్ అన్సారియా

ఒంగోలు, కార్పొరేషన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : వేసవి కారణంగా మూగజీవాలు మరణించకుండా, పక్షులు, జంతువుల దాహార్తి తీర్చేందుకు ఒంగోలు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ మేరకు ఒంగోలు కార్పొరేషన్‌తోపాటు, నగరంలోని పలు ప్రాంతాల్లో మూగజీవాలకు నీటి తొట్టెలు, చెట్లపై నీటి మూకుడులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ తమీమ్ అన్సారియా, మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ వెంకటేశ్వరరావు కార్పొరేషన్ కార్యాలయం ఆవరణలో వీటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవి కారణంగా వేడి వాతావరణంతో మనుషులే కాకుండా మూగ జీవాలు, పక్షులు కూడా తీవ్రంగా ఇబ్బంది పడుతున్న తరుణంలో కార్పొరేషన్ తీసుకున్న చర్యలను అభినందించారు. ప్రతి ఇంటి ఆవరణలో, మేడపైన, ఇంటి ప్రహరీ గోడలపైనా నీటి తొట్టెలు, మూకుడులను ఏర్పాటు చేయాలని కోరారు. మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఇలాంటి ఏర్పాట్లు చేయడం అభినందనీయం అన్నారు. కమిషనర్ కే. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఇప్పటికే నగరంలోని పలు ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేసి, ప్రజల దాహార్తిని తీరుస్తున్నట్లు తెలిపారు. అలాగే మూగజీవాలు, పక్షుల కోసం నీటి తొట్టెలు ఏర్పాటు చేసి, మూగజీవాల దాహార్తిని తీరుస్తున్నామని తెలిపారు ఈ కార్యక్రమంలో వ్యాపారవేత్త, కమ్మ సంఘం నాయకుడు మండవ మురళీకృష్ణ, నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు, డిప్యూటీ మేయర్ వేమూరి బుజ్జి, కార్పొరేటర్ చింతపల్లి గోపి తదితరులు ఉన్నారు.



పక్షుల కోసం నీటి మూకుడులను అందిస్తున్న కలెక్టర్, మేయర్, కమిషనర్



కంభం మెయిన్ బజారులో మానవహారంగా ఏర్పడి నిరసన తెలుపుతున్న వివిధ పార్టీలు, సంఘాల నేతలు

ఉగ్రదాడిపై వెల్లువెత్తిన నిరసన

- కొవ్వొత్తులతో ర్యాలీ, మానవహారం

కంభం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్ పహల్గాంలో మతోన్మాదుల మారణకాండకు నిరసనగా కంభం పట్టణంలో శనివారం భారీ నిరసన ర్యాలీ జరిగింది. వివిధ ప్రజా సంఘాలు, హిందూ ధార్మిక సంస్థలు, స్వచ్ఛంద సేవా సంస్థలు ఈర్యాలీలో పాల్గొన్నాయి. నిరసనకారులు అధిక సంఖ్యలో ర్యాలీలో పాల్గొని పాకిస్తాన్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ర్యాలీ కంభం పట్టణంలోని గచ్చకాలువ నుంచి మొదలై చౌకొసెంటర్, జడ్జీ బాలికల పాఠశాల, కాలేజీ రోడ్డు మీదుగా కందులాపురం కూడలికి చేరుకుంది. అక్కడ మానవహారం నిర్వహించారు. అసువులుబాసిన 26 మందికి సంతాప సూచకంగా కొవ్వొత్తులు వెలిగించి మౌనంపాటించారు. ఈర్యాలీలో పార్టీలకు అతీతంగా టీడీపీ, జనసేన పార్టీ, బీజేపీ, ఆర్యవైశ్య సంఘం, లయన్స్ క్లబ్, మాజీ సైనిక ఉద్యోగులు, విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం

పీడీబీఏ ఆధ్వర్యంలో ఒంగోలు

హైదరీక్లబ్‌లో నిర్వహణ



షటిల్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

ఒంగోలు, కార్పొరేషన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : గుమ్మడి పవన్ కుమార్ మెమోరియల్ రాష్ట్ర స్థాయి ఇన్విటేషన్ టోర్నమెంట్ (పురుషుల డబుల్ విభాగం) షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ఒంగోలులో శనివారం ఘనంగా ప్రారంభం అయ్యాయి. జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 26,27 తేదీలలో రెండు రోజుల పాటు స్థానిక హైదరీ క్లబ్‌లో నిర్వహిస్తున్న పోటీలను పీడీబీఏ ప్రతినిధులు ప్రారంభించారు. ఈ సందర్భంగా పీడీబీఏ సెక్రటరీ పావులూరి విజయకృష్ణ మాట్లాడుతూ రెండు రోజులపాటు జరిగే ఈపోటీలలో బెంగళూరు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచి జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొన్న క్రీడాకారులు పాల్గొంటున్నట్లు తెలిపారు. మొత్తం 22 టీములు పాల్గొనగా, ఆదివారం సాయంత్రం ఫైనల్స్ జరుగుతాయని తెలిపారు. తొలి రోజు పోటీలలో ఆయా రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు హోరా హోరీగా తలపడ్డారు. కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వాహకులు లక్ష్మణ్, యలవర్తి త్రిశంకరరావు, యలవర్తి మల్లేశ్వరరావుతోపాటు హైదరీక్లబ్ ఉపాధ్యక్షుడు ఎస్.చంద్రమోహన్‌రెడ్డి, సెక్రటరీ డాక్టర్ గుండవరపు రాఘవ, కోశాధికారి ఆంజనేయులు, క్రైడాయ్ ప్రతినిధులు రాజేంద్ర పలువురు పాల్గొన్నారు. దీంతో పోటీలను వీక్షించేందుకు క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో హాజరు కావడంతో హైదరీ క్లబ్‌లో క్రీడా సందడి నెలకొంది. ముందుగా పీడీబీఏ మాజీ సెక్రటరీ స్వర్గీయ గుమ్మడి పవన్ కుమార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నిర్వాహకులు నివాళులు అర్పించారు.

వచ్చేనెల 19 నుంచి ఓపెన్ స్కూలు పది,ఇంటర్ పరీక్షలు

ఒంగోలు విద్య, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : ఓపెన్ స్కూలు పదవ తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షలు వచ్చేనెల 19నుంచి 24వతేదీ వరకు జరుగుతాయని జిల్లా విద్యాశాఖాధికారి ఏ. కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలు ఉదయం 9.30నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగుతాయన్నారు. పదవ తరగతి, ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలు రెగ్యులర్ పదవ తరగతి టైంటేబుల్ అనుసంధానంతో జరుగుతాయన్నారు. ఆయా తేదీల్లో రెగ్యులర్ పరీక్షా కేంద్రాల్లో ఓపెన్ స్కూలు పదవ తరగతి విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉటుందన్నారు. ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలు రెగ్యులర్ పదవ తరగతి టైంటేబుల్‌తో అనుసంధానం చేసి అదే సమయంలో పరీక్షలను ఎంపిక చేసిన ఇతర కేంద్రాలో పరీక్షలు రాయాల్సి ఉంటుందన్నారు. ఈనెల 26నుంచి వచ్చేనెల 5వ తేదీ వరకు పరీక్ష ఫీజును ఏపీ ఆన్‌లైన్ లేదా గేట్వే ద్వారా చెల్లించాలన్నారు. రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు ఈనెల 26నుంచి వచ్చేనెల 5వతేదీ వరకు ఫీజు చెల్లించాలన్నారు. రీ కౌంటింగ్‌కు రూ.200, రీ వెరిఫికేషన్‌కు రూ.వెయ్యిని ఏపీ ఆన్‌లైన్ సర్వీసు సెంటర్‌లో చెల్లించాలని డీఈవో కోరారు.



కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న కలెక్టర్ అన్సారియా,పక్కన పశు సంవర్ధకశాఖ జేడీ బేబీరాణి, ఆర్డీవో లక్ష్మీప్రసన్న తదితరులు

సైబర్ నేరగాళ్ళ వలలో ఉపాధ్యాయుడు

ఎస్‌బీఐ కార్డు వేరే బ్యాంకు ఏటీఎంలో వినియోగం

ఆ వెంటనే ఖాతాలో ఉన్న రూ.5.18 లక్షలు

ఇతరులకు ట్రాన్స్‌ఫర్‌తో లబోదిబో

ముండ్లమూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల వలలో ఉపాధ్యాయుడు చిక్కుకున్నాడు. పసుపుగల్లు గ్రామంలో నివాసం ఉంటున్న వైవీ సుబ్బారావు ముండ్లమూరులోని ఏపీ మోడల్ స్కూల్‌లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. సైబర్ నేరగాళ్ళ ఉచ్చులో పడి ఏకంగా రూ.5.18 లక్షలు పోగొట్టుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తమ కుమారుడు ఫ్రాన్స్ దేశంలో ఎంఎస్ చేస్తుండగా ఫీజు నిమిత్తం బ్యాంకులో దాచుకున్నానని భోరున విలపించాడు. వివరాల్లోకి వెళితే.. స్టేట్ బ్యాంక్‌లో ఆయనకు అకౌంట్ ఉంది. ఈనెల 23న కొంత నగదు అవసరమై ముండ్లమూరులో ని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ ఏటీఎంలో రూ.10వేలు ఒక సారి, రూ.2వేలు మరోసారి డ్రా చేశారు. సాయంత్రం 3 గంటల సమయంలో రూ.48వేలు డ్రా చేసినట్టు తన సెల్‌ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. దీంతో కంగారుపడిన ఉపాధ్యాయుడు వెంటనే దర్శిలోని స్టేట్ బ్యాంక్‌కు వెళ్ళి అకౌంట్‌ను పరిశీలించారు. అప్పటికే అకౌంట్‌లో ఉన్న రూ.2.50 లక్షలు, రూ.2 లక్షలు, రూ.20వేలు, చివరిగా రూ.48వేలు డ్రా చేసి ఉంది. మొత్తం రూ.5.18 లక్షలు ట్రాన్స్‌ఫర్ అయినట్టు బ్యాంక్ అధికారులు తెలియజేయటంతో ఖంగు తిన్నాడు. తాను డ్రా చేయకుండానే తన ఖాతాలో నిల్వ ఉన్న నగదు ఇతరుల ఖాతాలోకి ఎలా పోతాయని బ్యాంక్ అధికారులను నిలదీశాడు. బ్యాంక్ మేనేజర్ నుంచి ఎలాంటి స్పందన రాలేదు. తన కుమారుడు ఫీజు కోసం ఉంచుకున్న రూ.5.18 లక్షలు సైబర్ నేరగాళ్ళు కాజేశారని వాపోయాడు. బ్యాంక్ అధికారులు మాత్రం ఐడీఐబీ బ్యాంకుకు ట్రాన్స్‌ఫర్ అయ్యాయని సుబ్బారావుకు వివరించారు. దీంతో ఉపాధ్యాయుడు సుబ్బారావు ముండ్లమూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు సిద్ధమయ్యారు. సైబర్ నేరగాళ్ళ ఉచ్చులో పడి ఇటీవల మారెళ్ళలో ఒక ఉపాధ్యాయిని రూ.4 లక్షల మేర పోగొట్టుకుంది. ఇటీవల మండలంలో సైబర్ నేరగాళ్ళ చేతిలో మోసపోతున్న బాధితుల సంఖ్య డజను మందికి పైగానే ఉన్నారు. మూడు సంవత్సరాల క్రితం పసుపుగల్లుకు చెందిన ఒక యువకుడు రూ.10 లక్షలు సైబర్ నేరగాళ్ళ ఉచ్చులో పడి పోగొట్టుకున్నాడు.

పశువైద్యుల సేవలు అభినందనీయం

- కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : మూగజీవాలకు ప్రాణదాతలుగా పశువైద్యులు అందిస్తున్న సేవలు అభినందనీయమని కలెక్టర్ అన్సారియా అన్నారు. ప్రపంచ పశువైద్య దినోత్సవం సందర్భంగా స్థానిక ఎన్‌టీఆర్ కళాక్షేత్రంలో నిర్వహించిన వేడుకల్లో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా కలెక్టర్ అన్సారియా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.తొలుత పహల్గాంలో ఉగ్రదాడిలో మృతిచెందిన వారి ఆత్మకు శాంతికలగాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం ప్రపంచ పశువైద్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతిజ్ఞ చేయించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధకశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పంపిన సందేశాలను చదివి వినిపించారు. అనంతరం జరిగిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ పవిత్రమైన వైద్య వృత్తిలో ఉండి మూగజీవాలకు వైద్య సేవలు అందిస్తున్న పశుసంవర్ధకశాఖ సిబ్బందిని అభినందించారు. జిల్లా విజన్ డాక్యుమెంట్‌లో లైవ్ స్టాక్ సెక్టార్ 9,735 కోట్ల జీడీపీతో మొదటి స్థానంలో ఉందన్నారు. పాల ఉత్పత్తిలో రాష్ట్రంలో ఐదవ స్థానంలో ఉందన్నారు. వెనుకబడిన జిల్లా అని, 17,525 కుటుంబాలు పేదరికంలో ఉన్నాయని, అందువల్ల ప్రభుత్వం పీ4 విధానంలో వీరిని అభివృద్ధి చేసేలా 15శాతం వృద్ధి రేటుతో ప్రణాళికలు రూపొందించినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఎక్కువశాతం పేద కుటుంబాలు పాడిపరిశ్రమపై అధారపడి జీవిస్తున్నారని తెలిపారు. జిల్లాను పాడిపరిశ్రమలో రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిపేందుకు పశుసంవర్ధకశాఖ అధికారులు తమ వంతు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా క్రీడాపోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న, పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ బేబిరాణి, పశుసంవర్ధకశాఖ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, వైద్యులు ఉన్నారు.

ఆక్రమణల పరిశీలన

- నివేదికను కలెక్టర్‌కు పంపిస్తాం
- స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామిరెడ్డి

ఎర్రగొండపాలెం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : ఎర్రగొండపాలెంలోని సర్వేనెంబరు 28/1లో 44.09 ఎకరాల విస్తీర్ణం వాగు పోరం బోకు భూమిలో ఉన్న ఆక్రమణలను శనివారం డిప్యూటీ కలెక్టర్ రామిరెడ్డి పరిశీలించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సర్వే 28/1లో ఆక్రమణలను పరిశీలించినట్లు తెలిపారు. కలెక్టర్‌కు నివేదిక పంపుతామని తెలిపారు. ఆయన వెంట సర్వేయర్ సైదారావు, సచివాలయ సర్వేయర్ వేమారెడ్డి ఉన్నారు.



రాళ్లవాగు సరిహద్దు భూమిలో ఆక్రమణలను పరిశీలించి వివరాలు తెలుసుకుంటున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామిరెడ్డి



శేషవాహనంపై వేంకటేశ్వరుడు

కంభం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కంభం శ్రీ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా 4వ రోజు శుక్రవారం రాత్రి స్వామివారు శేషవాహనంపై దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా స్వామిఅమ్మవార్లు మాడవీధుల్లో ఊరేగుతూ ఊరేగారు. దారిపొడవునా కోలాట ప్రదర్శన అబ్బురపరిచింది.



కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలోని చెట్టుకు పక్షుల దాహార్తిని తీర్చేందుకు కట్టిన మూకుడు



కార్పొరేషన్ కార్యాలయ భవనంపై ఏర్పాటు చేసిన నీటి మూకుళ్లు

మూగజీవాలపై మమకారం !

కార్పొరేషన్ ఆధ్వర్యంలో నీటితొట్టెలు ఏర్పాటు ● ప్రజలూ భాగస్వాములు కావాలని పిలుపు

మండుతున్న ఎండలకు మనుష్యులే అల్లాడిపోతున్నారు. ఉక్కపోతలకు ఊపిరి ఆడక అవస్థలు పడుతున్నారు. బాధను బయటకు చెప్పుకునే మనమే మండుటెండలకు భయపడిపోతున్న క్రమంలో నోరు లేని మూగజీవులు, చెట్లను ఆసరగా చేసుకుని జీవించే పక్షుల పరిస్థితి మరింత బాధాకరమనే చెప్పాలి. దీంతో ఒంగోలులో నగరపాలక సంస్థ అధికారులు మూగజీవాల మనుగడపై ప్రత్యేక దృష్టి సారించారు. సేవ్‌ద యానిమల్, పీపుల్ ఫర్ యానిమల్ సంస్థతో కలిసి నగరంలోని పలు ప్రాంతాలలో చెట్లుపైన ఉట్టితో నీటి మూకుడులు ఏర్పాటు చేశారు. అలాగే నగర వీధుల్లోని పలు ప్రాం తాల్లో సిమెంట్ తొట్లు ఏర్పాటు చేసి వాటిలో నీరు నింపుతున్నారు. అలాగే నగరవాసులు కూడా మూగజీవాల దాహర్తిని తీర్చడంలో భాగస్వాములు కావాలని కలెక్టర్ తమీమ్ అన్సారీయా, కమిషనర్ కె.వెంకటేశ్వరరావు శనివారం పిలుపునిచ్చా రు. అందుకు అవసరమైన నీటితొట్లు, మట్టి మూకు డులు స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేషన్ సంయుక్తంగా ఉచితంగా అందిస్తున్నారు.

- ఒంగోలు కార్పొరేషన్ (ఆంధ్రజ్యోతి)



దాహార్తిని తీర్చుకుంటున్న శునకం



తొట్టెలో నీరు నింపుతున్న సిబ్బంది



వీధుల్లో ఏర్పాటు చేసేందుకు సిద్ధం చేసిన నీటి తొట్టెలు

మాతా శిశు వైద్యశాలలో పండ్లు పంపిణీ



పండ్లు పంపిణీ చేస్తున్న మేయర్ సుజాత, మురళీకృష్ణ

ఒంగోలు కల్చరల్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): సీతారామ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం ఒంగోలులోని మాతా శిశు వైద్యశాలలో గర్భిణులు, బాలింతలకు పండ్లు, బ్రెడ్ పంపిణీ కార్యక్రమం జరిగింది. ప్రవాస భారతీయులు అమర్‌చంద్, నాగకిన్నెరల కుమార్తె తలశిల సౌమిక పుట్టినరోజును పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమానికి డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు, నగర మేయర్ గంగాడ సుజాత, పారిశ్రామికవేత్త మండవ మురళీకృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారి చేతుల మీదుగా పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఉపాధ్యక్షుడు నూకతోటి శరత్‌బాబు, మాతా శిశు వైద్యశాల సూపరింటెండెంట్ సుబ్బారావు, నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు, మండవ సుబ్బారావు, దన్నారపు మస్తాన్‌రావు, తన్నీరు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి



కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేస్తున్న ఎంపీడీవో

ఒంగోలు(రూరల్), ఏప్రిల్26(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో జరిగే ఉపాధి పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో రాజశేఖర్‌రావు కోరారు. ఒంగోలు మండలంలోని చేజర్ల, ఉచిలి, దేవరంపాడు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను శనివారం ఆయన పరిశీలించారు. కూలీలు పనుల ప్రదేశంలో ఎండ నుంచి సేద తీరేందుకు టెంట్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. అదేవిధంగా తాగునీరు సరఫరా చేసేందుకు ఒక కూలీని నియమించుకోవాలని చెప్పారు. అనంతరం కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేశారు. హాజరు పట్టికను పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీవో నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వైసీపీ మండల అధ్యక్షుడిగా సుబ్బారెడ్డి

మర్రిపూడి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ మండల అధ్యక్షుడిగా మర్రిపూడికి చెందిన ఇనుకొల్లు సుబ్బారెడ్డిని పార్టీ అధిష్ఠానం నియమించింది. ఆయన గతంలో కాంగ్రెస్, ఆమ్ ఆద్మీల్లో కొనసాగారు. ఆపార్టీలకు మండల కన్వీనర్‌గా పనిచేశారు. వైసీపీ ఆవిర్భావం అనంతరం ఆ పార్టీకి సంబంధించి మర్రిపూడి రాజకీయాల్లో చురుకైన నాయకుడిగా గుర్తింపు పొందారు. సుబ్బారెడ్డిని వైసీపీ నాయకులు, కార్యకర్తలు అభినందించారు.

వైసీపీ గ్రీవెన్స్‌సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా 'పేరాల'

నాగులుప్పలపాడు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అనుబంధ విభాగాల కమిటీల ఏర్పాటులో భాగంగా గ్రీవెన్స్ సెల్ రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా ఉప్పుగుండూరుకు చెందిన పేరాల చెన్నకేశవులు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా మద్దిరాలపాడుకు చెందిన పాలడుగు రాజీవ్ నియమితులయ్యారు. ఈమేరకు ఆ పార్టీ అధ్యక్షుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నియమించారు.

వైద్యశిబిరానికి విశేష స్పందన



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న కిమ్స్ వైద్యులు

చీమకుర్తి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : పల్లామల్లి గ్రామంలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేషస్పందన లభించింది. కిమ్స్ వైద్యులు శిబిరంలో పాల్గొన్న వారికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామ టీడీపీ నాయకుడు అన్నమనేని రాఘవయ్య, అన్నమనేని వెంకయ్య, శ్రీను శిబిరం నిర్వహణకు సహకారం అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు రామాంజనేయులు, విజయలక్ష్మి, ప్రతినిధి పి.రత్నకుమార్ పాల్గొన్నారు.

సెలవు రోజుల్లో పన్నులను చెల్లించవచ్చు

● ఒంగోలు నగర కమిషనర్

ఒంగోలు కార్పొరేషన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) ఒంగోలు నగరపాలక సంస్థకు చెల్లించాల్సిన పన్నులు ముందస్తు చెల్లింపుపై 5 శాతం, పాతబకాయిలపై 50 శాతం రాయితీపై పన్నులు ఈనెల 30వ తేదీలోపు చెల్లించవచ్చని కమిషనర్ వెంకటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అందుకోసం ఆదివారం, ఇతర ప్రభుత్వ సెలవు రోజుల్లో కూడా కార్పొరేషన్ కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్లలో చెల్లించే అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని నగర ప్రజలు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

ప్లాస్టిక్ రహిత చీమకుర్తికి సహకరించాలి



వ్యాపారులతో మాట్లాడుతున్న కమిషనర్ రామకృష్ణయ్య

చీమకుర్తి, ఏప్రిల్26(ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్ రహిత చీమకుర్తికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కమిషనర్ వై.రామకృష్ణయ్య కోరారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వ్యాపారులతో సమావేశాన్ని నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించినట్లు చెప్పారు. కార్యక్రమంలో గొల్లపూడి కోటేశ్వరరావు, చంద్ర పాల్గొన్నారు.

ఉగ్రవాదులపై కఠిన చర్యలు తీసుకోవాలి

పహల్గామ్ మృతులకు పలు సంఘాల ఆధ్వర్యంలో నివాళులు



కాపు సంఘం ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్ ప్రాంతంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడులను నిరసిస్తూ ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్(ఏపీయూడబ్ల్యూజే) ఆధ్వర్యంలో జిల్లా కేంద్రమైన ఒంగోలులో శనివారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కార్యదర్శి దాసరి కనకయ్య ఆధ్వర్యంలో స్థానిక మల్లయ్యలింగం భవన్ నుంచి చర్చిసెంటర్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం యూనియన్ నాయకులు కనకయ్య, ఎ.సురేష్‌లు మాట్లాడుతూ ఉగ్రవాదులు దాడిలో 28 మంది పర్యాటకుల మృత్యువాత పడటం బాధకరమన్నారు. ఉగ్రవాదులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

- కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు కొక్కిరాల సంజీవకుమార్ ఆధ్వర్యంలో ఉగ్రవాదుల దాడులకు వ్యతిరేకంగా స్థానిక రామనగర్ నుంచి నెల్లూరు బస్టాండు, కలెక్టరేట్ మీదుగా చర్చి సెంటర్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్ర దాడులు హేయమైన చర్యన్నారు. ఉగ్రవాదులను అణిచివేసేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలకు అండగా ఉంటామని చెప్పారు. కార్యక్రమంలో తంజావూరు శ్రీనివాసమూర్తి, నరహరి సాంబయ్య, ఉమ్మడిశెట్టి శ్రీనివాసరావు, నారపుశెట్టి రామ్మోహన్‌రావు, చెన్నంశెట్టి శివ, వల్లంశెట్టి హనుమంతరావు, చింతపల్లి నారాయణ, మేకల నారాయణ, కిరణ్, అడుసుమల్లి వీరబ్రహ్మం, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

- పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని వ్యతిరేకిస్తూ శనివారం భారతీయ జనతా మజ్దూర్ సెల్(బీజేఎంసీ) ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. స్థానిక సుజాత నగర్‌లో జరిగిన ర్యాలీలో రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఖలీఫాతుల్లాబాషా మాట్లాడుతూ ఉగ్రవాదులు 28మందిని హత మార్చడం దుర్మార్గంగా ఉందన్నారు. మతం పేరుతో చంపి కుల, మతాల మధ్య చిచ్చుపెట్టే ఇలాంటి ఉగ్రదాడులను చేసిన వారికి కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉగ్రవాదుల చర్యలను ప్రతి ఒక్కరు ఖండించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు షేక్ సిద్దాంబీ, నగర అధ్యక్షుడు తిరుమలశెట్టి రామయ్య పాల్గొన్నారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

తెలుగు రైతు కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీనివాసులు



మర్రిపూడిలో కుట్టు శిక్షణ ప్రారంభిస్తున్న శ్రీనివాసులు



సింగరాయకొండలో మాట్లాడుతున్న ఎంపీడీవో జయమణి

మర్రిపూడి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : మహిళల సాధికారతే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలుగు రైతు కార్యనిర్వాహక కార్యదర్శి యర్రమోతు శ్రీనివాసులు అన్నారు. బీసీ ఆర్థిక సహకార సంస్థ ఆధ్వర్యంలో స్థానికంగా ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ 90 రోజులపాటు 100మందికిపైగా మహిళలకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. అనంతరం ఉచితంగా కుట్టు మిషన్‌లు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. గ్రామీణ మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ జ్వాలా నరసింహం, ఎంపీడీవో జగదీష్, సర్పంచ్ కదిరి భాస్కర్, టీడీపీ నాయకులు చేరెడ్డి నర్సారెడ్డి, రేగుల వీరనారాయణ, తుళ్లూరి నరసింహారావు, గొంటు హనుమారెడ్డి, యర్రంరెడ్డి వెంకటరెడ్డి, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సింగరాయకొండ: బీసీ కార్పొరేషన్, ఈడబ్ల్యూఎస్ సహకారంతో స్థానిక వెలుగు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ కేంద్రాన్ని టీడీపీ మండల అధ్యక్షుడు వేల్పుల సింగయ్య శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో జయమణి మాట్లాడుతూ అర్హులైన మహిళలు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఎం భాగ్యలక్ష్మి, టీడీపీ నేతలు కూనపరెడ్డి సుబ్బారావు, సుదర్శి చంటి పాల్గొన్నారు.

ఆక్రమణలను తొలగించి రహదారి నిర్మించాలి

● హిమగిరికాలనీవాసుల వినతి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు, టీడీపీ నాయకులు

చీమకుర్తి, ఏప్రిల్26(ఆంధ్రజ్యోతి) : తమ కాలనికి వెళ్లే దారిలోని ఆక్రమణలను తొలగించి రహదారి నిర్మాణాన్ని చేపట్టాలని చీమకుర్తి మున్సిపాలిటీలో శివారుగా ఉన్న హిమగిరికాలనీవాసులు కోరారు. ఈమేరకు శనివారం కమిషనర్ వై.రామకృష్ణయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణానికి దాదాపు రెండుకిలోమీటర్ల దూరంలో ఉన్న హిమగిరికాలనీకి రాకపోకలు సాగించాలంటే రహదారి సౌకర్యం సరిగ్గా లేనందున ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. కరెంటు స్తంభాలు సైతం రోడ్డుకు అడ్డంగా ఉన్నాయని తెలిపారు. కాగా ఈ విషయాన్ని కాలనీవాసులు టీడీపీ నాయకుల దృష్టికి తీసుకెళ్లగా అందరూ కలిసి కమిషనర్‌కు విన్నవించారు. పాలకవర్గం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని కమిషనర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కందిమళ్ల గంగాధరరావు, సూరంపల్లి హనుమంతరావు, కాట్రగడ్డ రమణయ్య, గోగినేని శ్రీనివాసరావు, కాలనీవాసులు అంజిబాబు, రాయుడు, ప్రసాద్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలు అరికట్టేలా చైతన్యపరచాలి

● ఎంపీడీవో సురేష్‌బాబు



సంతనూతలపాడులో మాట్లాడుతున్న ఎంపీడీవో సురేష్‌బాబు

సంతనూతలపాడు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో బాల్యవివాహాలను ప్రోత్సహించకుండా అరికట్టేలా తల్లిదండ్రులను చైతన్యపరచాలని ఎంపీడీవో డి.సురేష్‌బాబు తెలిపారు. సంతనూతలపాడు మండలపరిషత్ కార్యాలయంలో శనివారం కిషోరి వికాసంపై జరిగిన శిక్షణ కార్యక్రమం ఎంఈవో డి.వెంకారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ బాల్యవివాహాల నిషేధం, బాలికల అక్రమరవాణా, బాలికలపై అత్యాచార నిర్మూలన తదితర వాటిపై అవగాహన కల్పించాలన్నారు. బాలికలకు విద్య, ఆరోగ్యం, పోషకాహారం, పరిశుభ్రతపై సమీక్షించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

నాగులుప్పలపాడులో..

నాగులుప్పలపాడు: స్థానిక మండల కార్యాలయలో కిశోరివికాసంపై ఎంపీడీవో వై.మహాలక్ష్మి అధ్యక్షతన శిక్షణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్త్రీశిశు సంక్షేమశాఖ లీగల్ అధికారి బి.రత్నకుమార్, సంరక్షణాధికారి శ్రీలక్ష్మి మాట్లాడుతూ గ్రామాల్లో 15-18 మధ్య వయస్సు గల కిశోర బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రత, స్వీయ రక్షణపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు టి.రవి, రమణయ్య, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ఉషారాణి, శ్రీదేవి పాల్గొన్నారు.

మద్దిపాడులో..

మద్దిపాడు: కిషోర బాలికల వికాసానికి కృషి చేయాలని ఎంపీడీవో శ్రీనివాసప్రసాద్ తెలిపారు. శనివారం మద్దిపాడులోని ఎంపీడీవో కార్యాలయంలో స్త్రీశిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో కిషోర వికాసం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ బాల్యవివాహాలు జరగకుండా అందరూ పాటు పడాలని కోరారు. సీడీపీవో ఇవాంజిలిన్ మాట్లాడుతూ ఆడపిల్లల ఉజ్వల భవిష్యత్‌కు కిషోరి వికాసం కార్యక్రమం దోహదం చేస్తుందన్నారు. కిషోర బాలికలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధవహించాలని డాక్టర్ ఆనంద్‌మోహన్ అన్నారు. కార్యక్రమంలో జయలక్ష్మి, పద్మావతి, నాగరాజు, కాకుమాను సుబ్బారావు, ఆశవర్కర్లు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

డీఈఈ సెట్ నోటిఫికేషన్ విడుదల

ఒంగోలు విద్య, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): డిప్లమో ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఈఎల్ఈడీ) కోర్సుల్లో 2025-26 సంవత్సరంలో ప్రవేశాలకు నిర్వహించే డీఈఈసెట్ నోటిఫికేషన్ విడుదలైందని ఖైనంపాడు డైట్ ప్రిన్సిపాల్ సామా సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. డీఈడీ కళాశాలలు, ప్రభుత్వ డైట్‌లలో ప్రవేశాలకు అభ్యర్థులు ఈ పరీక్ష రాయాల్సి ఉంటుందన్నారు. ఈ పరీక్షకు మే 8వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలి. ఫీజు చెల్లింపునకు మే 7వతేదీ వరకు అవకాశం ఇచ్చారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు డీఈఈ సెట్‌కు దరఖాస్తుకు అర్హులు. మే 20నుంచి ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలి. జూన్ 2,3 తేదీల్లో పరీక్ష నిర్వహిస్తారు. జూన్ 10న ఫలితాలు ప్రకటిస్తారని సుబ్బారావు పేర్కొన్నారు.

పాలిసెట్ హాల్ టిక్కెట్లు విడుదల

ఒంగోలు విద్య, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలకు నిర్వహిస్తున్న పాలిసెట్-25 హాల్ టిక్కెట్లు విడుదలైనట్లు ఒంగోలు ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ శివప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష ఈనెల 30న జరుగుతుందని, హాల్‌టిక్కెట్లను పాలిసెట్ ఏపీ.నిక్.ఇన్ వెబ్‌సైట్ నుంచి విద్యార్థులు డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. చివరి నిమిషంలో సమస్యలు తలెత్తకుండా ముందుగానే హాల్‌టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆయన కోరారు.

29న జాబ్‌మేళా

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని ఉపాధి జిల్లా కార్యాలయంలో ఈనెల 29వ తేదీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి టి.భరద్వాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, పేటీఎం కంపెనీలో ఏజెంట్ల నియామకం, అభివృద్ధి, ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్ సెక్టార్‌లలో ఖాళీలను భర్తీ చేస్తారన్నారు. ఐటీఐ, డిప్లమో, టెన్త్, ఇంటర్, ఏదైనా డిగ్రీ చదువులు పూర్తి చేసిన నిరుద్యోగ అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరు కావాలని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు జీతం రూ.8500 నుంచి రూ.30వేల వరకు ఉంటుందని, జిల్లాలో 18నుంచి 40 ఏళ్లలోపు నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 08592-281776 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

క్విస్‌లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన



మొక్కను నాటుతున్న అధ్యాపకులు

ఒంగోలు విద్య, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించినట్లు ఆ విద్యా సంస్థల అధినేత డాక్టర్ సూర్య కల్యాణ్‌చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్‌చైర్మన్ డాక్టర్ శ్రీగాయత్రి తెలిపారు. కళాశాలకు చెందిన 600 మంది విద్యార్థులు పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ నిషేధం, మొక్కలు పెంచడం తదితర అంశాలపై ప్రసంగించగా విజేతలకు బహుమతులను అందజేశారు. ముఖ్యఅతిథులు వెంకటేశ్వరరెడ్డి, డాక్టర్ శివాజీ మాట్లాడుతూ ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలను వివరించారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ వైవీ.హనుమంతరావు, డాక్టర్ కిషోర్‌బాబు, పర్యావరణ పరిరక్షణ గతివిధి ప్రతినిధులు చంద్రశేఖర్, అశోక్, డాక్టర్ కాలె మస్తాన్‌రావు, హెచ్‌వోడీలు హిమబిందు, కొండలరావు, రేవతి, విద్యానాథబాబు తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ సవరణ చట్టాన్ని ఉపసంహరించుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పెన్షన్ సవరణ చట్టం ద్వారా ప్రభుత్వ పెన్షనర్లకు నష్టం కలిగిస్తుందని, అందువల్ల దానిని ఉపసంహరించుకోవాలని జిల్లా రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పాకల విశ్వరూపాచారి కోరారు. స్థానిక అసోసియేషన్ హాలులో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాలను రాష్ట్ర ప్రభుత్వం అనుసరించే అవకాశం ఉందన్నారు. అందువల్ల కేంద్రం తెచ్చిన పెన్షన్ సవరణ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. 12వవేతన సవరణ కమిషన్ ఏర్పాటు చేయడంతో పాటు వెంటనే ఐఆర్ ప్రకటించాలన్నారు. 70 ఏళ్ళు నిండిన పెన్షనర్లకు 10శాతం, 75 ఏళ్ళు నిండిన ఉద్యోగులకు 15శాతం అదనపు పెన్షన్ చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి తోట రాఘవరావు, కోశాధికారి వాకా శంకరరెడ్డి, ఒంగోలు యూనిట్ అధ్యక్షుడు రఘురామిరెడ్డి, ఇ.సత్యనారాయణ, వి.హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

57మంది రైజ్ విద్యార్థులకు ఉద్యోగాలు



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో నిర్వాహకులు

ఒంగోలు విద్య, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని రైజ్ కృష్ణసాయి గ్రూప్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలలో 57 మంది విద్యార్థులు ఆల్‌డీజీ టెక్నాలజీస్ కంపెనీకి ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ శిద్దా వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం ఆ కంపెనీ హెచ్‌ఆర్ సురేందర్ విద్యార్థులకు మొదటగా గ్రూప్ డిస్కషన్, టెక్నికల్‌రౌండ్, హెచ్‌ఆర్ రౌండ్ నిర్వహించారు. ఎంపికైన విద్యార్థులు టెక్ సపోర్ట్ రోల్లో ఆల్‌డీజీ టెక్నాలజీస్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తారని ప్లేస్‌మెంట్ ఆఫీసర్ రఘుబాబు తెలిపారు. వార్షిక వేతనం రూ.2.40 లక్షలు ఉంటుందన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల గౌరవ చైర్మన్ ఇస్కాల రంగమన్నార్, ట్రెజరర్ శిద్దా భరత్, చీఫ్ అడ్వయిజర్ శిద్దా ప్రవల్లిక, కళాశాల డైరెక్టర్ ఏవీ.భాస్కరరావు అభినందించారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు



సైదకాలువలో మందును పిచికారి చేయిస్తున్న సిబ్బంది

మద్దిపాడు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మద్దిపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ టి.ఆనంద్‌మోహన్ తెలిపారు. మండలంలోని అన్నంగి, పెద్దకొత్తపల్లి గ్రామాల్లో శనివారం దోమల నివారణ కోసం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల నివారణ కోసం ప్రతి గ్రామంలో ఫాగింగ్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని వైద్యఆరోగ్య సిబ్బందికి సూచించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీహెచ్ఎస్ఎం కె.బాలకోటయ్య, హెల్త్ అసిస్టెంట్ షేక్ దరియా, ఎస్.సురేష్‌బాబు, ఏఎన్ఎం ఎస్.స్వాతి, ఎంల్‌హెచ్‌పీలు కృష్ణ, సంగీత, ఆశ వర్కర్ మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో డ్వాక్రా ఉత్పత్తులు

మద్దిపాడు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): డ్వాక్రా మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను ఆన్‌లైన్ ద్వారా విక్రయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుందని ఏపీఎం కాకుమాను సుబ్బారావు తెలిపారు. శనివారం మద్దిపాడులోని వెలుగు కార్యాలయంలో డ్వాక్రా మహిళలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల ఇళ్ల వద్ద తయారు చేసే అన్నిరకాల ఉత్పత్తుల వివరాలను ప్రత్యేక యాప్‌తో అనుసంధానం చేయడం ద్వారా మార్కెటింగ్ చేసుకునే అవకాశం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో డ్వాక్రా సీసీలు పాల్గొన్నారు.

గ్రంథాలయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

ఒంగోలు కల్చరల్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ ఉద్యోగుల కమ్యూటేషన్ సమస్యను తక్షణమే పరిష్కరించాలని జిల్లా గ్రంథాలయ పెన్షనర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు జి.గురవారెడ్డి కోరారు. శనివారం గుంటూరులో జరిగిన అసోసియేషన్ సమావేశంలో ఆయన ఈ మేరకు రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ జి.కోటేశ్వరరావుకు విజ్ఞప్తి చేశారు. అందుకు ఆయన సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు గురవారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు పి.మల్లేశ్వరరావు పాల్గొన్నారు.


చెట్టును తొలగిస్తున్న అధికారులు

ఎండిపోయిన చెట్టు తొలగింపు

గిద్దలూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డు మార్జిన్‌లో రెవెన్యూ కార్యాలయం కాంపౌండ్‌లో ప్రమాదకరంగా ఉన్న చెట్టును ట్రాన్స్‌కో అధికారులు తొలగించారు. ఈ చెట్టు పూర్తిగా ఎండిపోయి పడిపోయే పరిస్థితిలో ఉన్నది. పెద్ద గాలులు వస్తే చెట్టు పడిపోతే చెట్టు కింద ఉన్న విద్యుత్ తీగలపై పడి ప్రమాదం జరిగే అవకాశాలు ఉండడంతో శనివారం ఉదయం ఈచెట్టును విద్యుత్, రెవిన్యూ, మున్సిపల్ అధికారులు కలిసి తొలగించారు.

నేటి నుంచి బైబిల్ పాఠశాల

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురంలో తెలుగు బాప్టిస్టు టౌన్ చర్చిలో సోమవారం నుంచి వేసవి సెలవుల దృష్ట్యా బైబిల్ పాఠశాలను నిర్వహిస్తున్నట్లు చర్చి వీబీఎస్ డైరెక్టర్ జి.సుస్మిత శనివారం ప్రకటనలో తెలిపారు.


కంభంలో రోడ్డు పక్కనే వ్యర్థ పదార్థాల కుప్పలు


ఇరిగేషన్ కాలువ వెంట పేరుకుపోయిన వ్యర్థాలు

కలెక్టర్ హెచ్చరించినా.. అదే నిర్లక్ష్యం

- మారని అధికారులు, పంచాయతీ పాలకుల తీరు
- ఏ రోడ్డు చూసినా చెత్త కుప్పలే
- కంపుతో ఇబ్బంది పడుతున్న స్థానికులు

కంభం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ హెచ్చరించినా కంభం పంచాయతీ పాలకులు, అధికారుల తీరు మారలేదు. ఒకప్పటి నియోజకవర్గ కేంద్రం, ప్రస్తుతం మేజర్ పంచాయతీ అయిన కంభంలోని ఏ రోడ్డు పక్కన చూసినా రోజుల తరబడి పేరుకుపోయిన చెత్తకుప్పలు, వ్యర్థపదార్థాలు దర్శనమిస్తాయి. దీనికితోడు మురికి కా లువల్లో మురుగు నీరు వెళ్లే దారిలో రోడ్డుపైనే మురుగు నీరు పారుతోంది. పట్టణంలోని అన్ని ప్రధాన వీధుల గుండా వెళ్లే ఇరిగేషన్ పంట కాలువలన్నీ మురుగు, వ్యర్థాలతో నిండిపోయి ముక్కుపుటలు అదిరేలా కంపుకొడుతున్నాయి. అయినా మం డల స్థాయి అధికారుల్లో ఏమాత్రం చలనం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. రోడ్ల పక్కన పేరుకుపోయిన చెత్తను ఎప్పుడు శుభ్రం చేస్తారని పంచాయతీ కార్యదర్శులను ప్రశ్నిస్తే వెంటనే శుభ్రం చేస్తామనే సమాధానం వస్తుంది కానీ ఎటువంటి పనులు చేయడం లేదు. మురుగు పేరుకుపోయి దోమలకు నిలయాలుగా మారాయి. నెలకు ఒక్కసారైనా బ్లీచిం గ్ పౌడర్నైనా చల్లడం లేదు. ఎమ్మెల్యే, జిల్లా అధికారులు వస్తున్నపుడు మాత్రమే రోడ్డుకు ఇరువైపులా బ్లీచింగ్ చల్లి చేతులు దులుపుకుంటున్నారు.

కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు

శుక్రవారం ఒంగోలులోని కలెక్టరేట్‌లో కలెక్టర్ తమీమ్‌అన్సారియా అధ్యక్షతన జరిగిన ఎంపీడీవోలు, ఈవోఆర్డీల సమావేశంలో పారిశుధ్య నిర్వహణ పట్ల నిర్లక్ష్యంగా ఉంటే వేటు తప్పదని హెచ్చరించినా అధికారులలో ఎలాంటి మార్పు రాకపోవడంపై ప్రజలు విమర్శిస్తున్నారు. కలెక్టర్ హెచ్చరించినా మండల నాయకులు, అధికారుల్లో చలనం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా స్వచ్ఛాంధ్రలో భాగంగానైనా చెత్తను తొలగిస్తారని ఆశిద్దాం.


మాట్లాడుతున్న కమిషనర్ నారాయణరావు

భవన నిర్మాణ అనుమతులు సులభతరం

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : పురపాలక సంఘంలో భవన నిర్మాణ అనుమతులు సులభతరంగా మంజూరు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ నారాయణరావు తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వం జీవో నెం.20 ద్వారా స్వీయధ్రువీకరణ పత్రం 2025లో భాగంగా ప్రజలకు అంగీకరపత్రం సమర్పించి సులభతరంగా భవణ నిర్మాణ అనుమతులు పొందేందుకు వెసులుబాటు కల్పించిందన్నారు. దీనిలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు కార్యాలయం ద్వారా లైసెన్సు పొందిన టెక్నికల్ పర్సన్, సర్వేయర్, ఇంజనీర్ ద్వారా గ్రామకంఠం, అధికారిక లేఅవుట్‌లు, సర్క్యూలేషన్ ప్యాటర్నా మొదలైన ప్రాంతాలలో నివాసం కోసం భవన నిర్మాణ అనుమతులు స్వీయ ధ్రువీకరణపత్రం సమర్పించి సులభంగా, వేగంగా, పారదర్శకంగా అనుమతులు పొందగలరని తెలిపారు. ఇదేవిధంగా ఆసక్తి ఉన్న అర్హులైన అభ్యర్థులు (ఐటీఐ సివిల్, డిప్లొమా సివిల్, బీటెక్ సివిల్) పురపాలక సంఘ కార్యాలయానికి నేరుగా, ఏపీబీఎస్, ఏపీడీపీఎంఎస్ పోర్టల్ ద్వారా లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకుని లైసెన్సులు పొందాలన్నారు.

రాచర్ల తహసీల్దార్‌గా అశోక్‌కుమార్‌రెడ్డి

రాచర్ల (గిద్దలూరు), ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : రాచర్ల తహసీల్దార్‌గా సీహెచ్ అశోక్‌కుమార్‌రెడ్డి నియమితులయ్యారు. ఆ మేరకు జిల్లా రెవెన్యూ అధికారులు ఆయన బదిలీ ఉత్తర్వులను పంపారు. అశోక్‌కుమార్‌రెడ్డి గతంలో కనిగిరి తహసీల్దార్‌గా పని చేసి ప్రస్తుతం వేకెన్సీ రిజర్వ్‌లో ఉన్నట్లు తెలిసింది.

ప్రారంభమైన వేసవి క్లాసులు

గిద్దలూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జామియా మసీదు (పెద్దమసీదు)లో ఆధ్యాత్మిక విధానాలపై సమ్మర్ క్లాసులు శనివారం ప్రారంభమయ్యాయి. నెలరోజులపాటు ప్రతి రోజు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఆధ్యాత్మిక విధానాలైన నమాజ్, ఖురాన్, హదీస్, తదితర అంశాల గురించి నేర్పించడం జరుగుతుందని మసీదు ప్రతినిధులు పేర్కొన్నారు.

రుణాలతో ఆర్థికంగా అభివృద్ధి చెందాలి


మాట్లాడుతున్న స్త్రీ నిధి ఏజీఎం హర్షవర్ధన్

గిద్దలూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా మహిళలు వివిధ జీవనోపాధుల నిమిత్తం తీసుకునే స్త్రీనిధి రుణాలను ఉపయోగించుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని స్త్రీనిధి జిల్లా ఏజీఎం హర్షవర్ధన్ అన్నారు. వెలుగు కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్త్రీనిధి రుణాలు తీసుకున్న డ్వాక్రా మహిళలు 100శాతం చెల్లిస్తే ఈ ఆర్థిక సంవత్సరం కొత్తగా రుణాలు పొందే అవకాశం ఉంటుందన్నారు. పేటీఎం ద్వారా కూడా గ్రామస్థాయిలో రికవరీలు చేయవచ్చని, మొండి బకాయిలు లేకుండా చూడాలని పేర్కొన్నారు. క్లస్టర్ ఏరియా కోఆర్డినేటర్ లక్ష్మీరెడ్డి మాట్లాడుతూ వెదురు సాగుకు ఆసక్తి ఉన్న మహిళలతో బీవోఏలతో సర్వే చేయించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం నరేష్, స్త్రీనిధి మేనేజర్ రాజేశ్వరి పాల్గొన్నారు.

గిన్నిస్ బుక్‌లో డాక్టర్ జాషువాకు చోటు

మార్కాపురం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో డయాలసిస్ ఇన్‌చార్జిగా పనిచేస్తున్న డాక్టర్ దారా జాషువాకు గిన్నిస్ బుక్‌లో చోటు లభించింది. హల్లెల్ మ్యూజిక్ స్కూల్ సంగీత కళాకారుల బృందం ఆధ్వర్యంలో ప్రపంచ స్థాయిలో ప్రదర్శన జరిగింది. ఇందులో సరళి స్వరాలను 45 సెకండ్లలో స్వరపరిచి గంటలో 1,046 వీడియోలను 2024 డిసెంబర్ 1న అప్లోడ్ చేయడం ద్వారా ఈ ఘనత సాధించారు. ఈ మేరకు ఈ నెల 25న విజయవాడలో జరిగిన కార్యక్రమంలో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ ప్రతినిధుల సమక్షంలో పాస్టర్ దంగిడి అగస్టీన్ చేతులమీదుగా సర్టిఫికెట్‌ను అందుకున్నారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన ప్రముఖులు, క్రైస్తవ సంఘాలు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

గిద్దలూరు టౌన్ ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : : గిద్దలూరు సబ్ డివిజన్ పరిధిలోని రాచర్ల 33 కేవీ మరమ్మతుల కారణంగా పట్టణంలోని పలు ప్రాంతాలలో ఆదివారం ఉదయం 7గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈఈ బి.శేషగిరిరావు తెలిపారు. మరమ్మతుల కారణంగా నల్లబండ బజారు, అంబవరం రూరల్, పాములపల్లె, కొండపేట, ఉప్పలపాడు సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

బేస్తవారపేట : ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ఎస్ఎస్ రావు తెలిపారు. మార్కాపురం ఫీడర్‌లో లైన్ల మరమ్మతుల కారణంగా సరఫరా ఆపుతున్నట్లు తెలిపారు. రావిపాడు, పెద్ద ఓబినేనిపల్లె, ఉమ్మారెడ్డిపల్లె సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు సరఫరా ఉండదని తెలిపారు. రైతులు, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

కాటంరాజు ఆలయానికి ప్రత్యామ్నాయ రహదారిని ఏర్పాటు చేయాలి

మార్కాపురం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : యాదవుల ఆరాధ్య దైవం వేనూతల కాటంరాజు ఆలయానికి ప్రత్యామ్నాయ రహదారిని ఏర్పాటు చేయాలని ఆలయ కమిటీ శనివారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేసింది. కాటంరాజు ఆలయానికి చేరుకునేందుకు ప్రస్తుతం ఉన్న రహదారి వెలుగొండ ప్రాజెక్టు ముంపులో పోతుందన్నారు. ఈ నేపథ్యంలో పెద్దారవీడు మండలం బద్వీడు చెర్లోపల్లి నుంచి కలనూతల గ్రామం వరకు నూతనంగా రహదారిని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అదే విధంగా పెద్దదోర్నాల మండలం అగ్రహారం నుంచి కలనూతల వరకు రహదారి నిర్మించినా దేవాలయానికి చేరుకోవచ్చన్నారు. ఈ రెండు రహదారుల్లో ఏది నూతనంగా నిర్మించినా వెలుగొండ ప్రాజెక్టు ముంపులో నుంచి కాకుండా నేరుగా ఆలయానికి చేరుకునేందుకు అవకాశం ఏర్పడుతుందని వివరించారు. వినతిపత్రం అందజేసిన వారిలో దేవస్థానం కమిటీ అధ్యక్షుడు గుమ్మా గంగరాజు యాదవ్, పిన్నిక చక్రపాణి, బుర్రి చిన్నవెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


అధికారికి వినతిపత్రం అందజేస్తున్న దేవస్థాన కమిటీ


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న బీఈడీ విద్యార్థులు

ఆత్మీయ సమ్మేళనం

- జ్ఞాపకాలను గుర్తుచేసుకున్న పూర్వ విద్యార్థులు

గిద్దలూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : గిద్దలూరులోని సెయింట్ పాల్స్ బీఈడీ కళాశాలలో 1998-99 బ్యాచ్‌లో చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం జరిగింది. 100 మందికి పైగా పూర్వ విద్యార్థులు ఒకే చోట కలిసి కళాశాలలో జరిగిన జ్ఞాపకాలను గుర్తు చేసుకుని భావోద్వేగంతో, జ్ఞాపకాలను పంచుకున్నారు. కార్యక్రమంలో బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రీటాసుగుణ సుందరి, పూర్వ విద్యార్థుల సంఘ ప్రతినిధులు రాజగోపాల్‌రెడ్డి అధ్యక్షత వహించగా మాజీ ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి, లెక్చరర్లు ఆశాలత, శ్రీనివాసరెడ్డి, శోభన్‌బాబు, బాబూరావు తదితరులు పూర్వ విద్యార్థులతో అనుభవాలు పంచుకున్నారు.

వ్యాయామంతో ఆరోగ్యం


యోగాపై శిక్షణ ఇస్తున్న వైద్యుడు

కొమరోలు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : ప్రతి వ్యక్తి వ్యాయామంతోనే మంచి ఆరోగ్యంగా ఉంటారని ఎంపీపీ కామూరి అమూల్య అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండలంలోని ప్రభుత్వ అధికారులు, సచివాలయ సిబ్బందికి ఆరోగ్యం- వ్యాయామం చేయడంపై వైద్యులు అవగాహన కలిగించారు. ఈసందర్భంగా ఎంపీపీ అమూల్య మాట్లాడుతూ ప్రతి వ్యక్తి తమ పనుల్లో బిజీబిజీగా ఉంటూ ఆరోగ్యంపై కొంత సమయాన్ని కేటాయించకపోవడంతోనే అనారోగ్యం పాలవుతున్నారన్నారు. రోజూ కొంత సమయాన్ని వ్యాయానికి కేటాయించడంతోపాటు ఆహార అలవాట్లను మార్చుకోవాలన్నారు. వైద్యులు రమేష్, రామ్‌జీ గోవింద్‌లు ఉద్యోగులకు పలు సూచనలు, ఆసనాలను వేసి శక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో సయ్యద్ మస్తాన్‌వలి, ఈవోపీఆర్డీ దేవరశెట్టి బ్రంహ్మయ్య పాల్గొన్నారు.

మట్టి పరీక్షలు చేయించుకోవాలి

పెద్దదోర్నాల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : రైతులు కచ్చితంగా పొలాల్లో మట్టి పరీక్షలు చేయించుకోవాలని తద్వార పంటల సాగుకు మేలు జరుగుతుందని వ్యవయాధికారి జవహర్‌లాల్ నాయక్ అన్నారు. మండలంలోని చిన్నగుడిపాడు గ్రామంలో శనివారం రైతులకు మట్టి నమూనా సేకరణపై అవగాహన కల్పించారు. మండలానికి 668 నమూనాలు సేకరించేందుకు ప్రభుత్వం అనుమతిచ్చిందన్నారు. మే 10వ తేదీలోపు సేకరించి ల్యాబ్‌కు పంపించి పరీక్షలు చేయిస్తామన్నారు. వీఏఏ హరిజననాయక్ పాల్గొన్నారు.

జూలై 5న జాతీయ లోక్ అదాలత్

గిద్దలూరు టౌన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మే 10వ తేదిన జరుగవలసిన జాతీయ లోక్‌అదాలత్‌ను జూలై 5వ తేదీకి వాయిదా పడిందని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి ఏ ఓంకార్ ఒక ప్రకటనలో తెలిపారు. కక్షిదారులు ఈ విషయాన్ని గమనించాలన్నారు.

పథకాలపై అవగాహన ఉండాలి

పెద్దదోర్నాల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పథకాలపై చెంచు గిరిజనులు అవగాహన కల్గి ఉండాలని తహసీల్దార్ కిన్నెర శాంతి అన్నారు. శిశు సదన్‌లోని ఆదర్శ సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ పథకాలపై చెంచు గిరిజనులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శాంతి మాట్లాడుతూ గిరిజనులందరూ ఆధార్ కార్డు తీసుకోవాలని, అర్హులందరూ రేషన్, పింఛన్ పొందాలని అన్నారు. అర్హత ఉండి మంజూరు కాని వాళ్లు కార్యాలయాల్లో అర్జీలు ఇవ్వాలన్నారు. మనమిత్ర యాప్ ద్వారా సమస్యలు పరిష్కరించుకోవచ్చని అవగాహన కల్పించారు. 18ఏళ్లు నిండాకే బాలికలకు వివాహం చేయాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో సీడీపీవో కమలా కుమారి, సంస్థ ప్రతినిధి కరుణాకర్, గిరిజన నాయకులు బీ మంతన్న పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ శాంతి

వేడుకగా మూడో రోజు వసంతోత్సవం

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో శనివారం మూడోరోజు వసంతోత్సవాలు వేడుకగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీపతి అప్పనాచార్యులు చెన్నకేశవస్వామి మూలవిరాట్‌కు విశేష అలంకరణ, పూజలు నిర్వహించారు. అనంతరం మధ్యరంగ మండపంలో శ్రీదేవిభూదేవి సమేత చెన్నకేశవస్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి వసంతోత్సవం నిర్వహించారు. పసుపు, చందనం, సుగంధభరిత ద్రవ్యాలను కలిపి భక్తులపై వసంతాలు చల్లారు. ఈవో గొలమారి శ్రీనివాసులరెడ్డి, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు యక్కలి కాశీవిశ్వనాథం, సభ్యుల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.


వసంతోత్సవంలో చెన్నకేశవుడు


కంభంలో నిర్మించిన నీటితొట్టెను పరిశీలిస్తున్న ఎంపీడీవో వీరభద్రాచారి

చకచకా నీటి తొట్టెల నిర్మాణం

కంభం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం రోజురోజుకూ ముదురుతున్న ఎండలను దృష్టిలో ఉంచుకుని మేతకు వెళ్లే పశువులు, గొర్రెలు, మేకలు, ఇతర జంతువులు దాహార్తి తీర్చేందుకు కంభం మండలంలో నీటితొట్లను చకచకా నిర్మిస్తున్నట్లు ఎంపీడీవో వీరభద్రాచారి తెలిపారు. శనివారం కంభం మండలంలో నిర్మించిన నీటి తొట్లను పరిశీలించారు. మండలంలో వివిధ గ్రామాల్లో 35 నీటి తొట్ల నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయని, 8 తొట్లు పూర్తయ్యాయని, మిగిలిన 27 తొట్లను వారంలోగా పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామని తెలిపారు.

వాహనాల తనిఖీ

బేస్తవారపేట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : బేస్తవారపేటలో శనివారం ఎస్ఐ వాహనాలను తనిఖీ చేశారు. పట్టణంలోని లాడ్జీలు, అనంతపురం - అమరావతి జాతీయ రహదారిలో వాహనాలను తనిఖీ చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు కన్పిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.


అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న టీడీపీ నాయకుడు రామిరెడ్డి

ఉచిత అంబులెన్స్ ప్రారంభం

మార్కాపురం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన బీజేపీ నాయకులు ప్రవీణ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత అంబులెన్స్‌ను టీడీపీ పోల్ మేనేజిమెంట్ క్లస్టర్ ఇన్‌చార్జి కందుల రామిరెడ్డి శనివారం ప్రారంభించారు. వెనుకబడ్డ మార్కాపురం ప్రాంతానికి ఉచిత అంబులెన్స్ సేవలు ఎంతో అవసరమన్నారు. ప్రవీణ్‌ను ఆయన అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీ కృష్ణారావు, అనిల్, ఓబినబోయిన రామాంజనేయులు, కొత్త శ్రీనివాసరెడ్డి, రాజేష్, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నేడే గాయత్రి యజ్ఞం

గిద్దలూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గాయత్రి మాత ఆలయంలో 27వ తేదీ ఆదివారం ఉదయం 9గంటలకు గాయత్రి మహాయజ్ఞం నిర్వహిస్తున్నట్లు గాయత్రి పరివార్ సభ్యులు శనివారం ప్రకటనలో తెలిపారు. భక్తులు సామూహికంగా యజ్ఞంలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

ఉగ్ర దాడిని నిరసిస్తూ ప్రజా సంఘాల ర్యాలీ



మార్కాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న జర్నలిస్టులు, వైపాలెంలో పాల్గొన్న వేదిక నేతలు

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : భారతదేశంలో మతవిద్వేషాలను రెచ్చగొట్టే విధంగా ఉగ్రవాదులు జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై విచాక్షణారహితంగా కాల్పులు జరపడం అమానుషమని ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు ఎస్వీ రమణ అన్నారు. ఉగ్రవాదుల దాడులను నిరసిస్తు ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో శనివారం జర్నలిస్టులు పట్టణంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మూల అల్లూరిరెడ్డి, జిల్లా కోశాధికారి దారివేమలు శరణ్ కుమార్ బాబీ, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ బాజీ వలి, మార్కాపురం ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు డి.మోహన్‌రెడ్డి, ఐజేయూ మాజీ సభ్యుడు జీఎల్ నరసింహారావు, ఏపీయూడబ్ల్యూజే జిల్లా సభ్యుడు షేక్ అజ్మతుల్లా, సుబ్రహ్మణ్యం, ప్రింట్, ఎలక్ట్రానిక్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం : ఉగ్ర దాడిని ఖండిస్తూ హిందూ ఐక్య వేదిక ఆధ్వర్యంలో ప్రజలు శనివారం శాంతి ర్యాలీ నిర్వహించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వేదిక నాయకులు, పెద్దలు పాల్గొన్నారు.

గిద్దలూరు : ఉగ్ర దాదిడిని రిటైర్డ్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఖండించారు. ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని, కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రవీంద్రనాథరెడ్డి, ప్రతినిధులు భాస్కర్‌రెడ్డి, రంగయ్య పాల్గొన్నారు.

నిప్పుపై నిర్లక్ష్యం

- మూడు రోజులుగా కాలుతున్న వరిగడ్డి
- పట్టించుకోని అగ్నిమాపక అధికారులు


మూడు రోజులుగా కాలుతున్న వరిగడ్డి

తర్లుపాడు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : తర్లుపాడులోని రైల్వేగేటు వద్ద విద్యుదాఘాతంతో గురువారం మధ్యాహ్నం వరి గడ్డి ట్రాక్టర్ దగ్ధమైన సంగతి తెలిసిందే. మంటలు పూర్తిగా వ్యాపించడంతో అక్కడే వరిగడ్డిని ఎత్తి డ్రైవర్ ట్రాక్టర్‌తో వెళ్లిపోయాడు. మంటల వ్యాపించడంతో మార్కాపురం అగ్నిమాపక సిబ్బందికి సమాచారంతో ఇవ్వడంతో వారు వచ్చి నామమాత్రంగా మంటలను అదుపుచేసి వెళ్లిపోయారు. తిరిగి వరిగడ్డి రోడ్డుపైనే కాలుతూ ఉంది. దీంతో మార్కాపురం - తర్లుపాడు వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. చుట్టు పక్కల పొలాల్లో బ్యార్నీలు కూడా ఉండటంతో ఏం ప్రమాదం జరుగుతుందోనని రైతులు ఆందోళనకు గురవుతున్నారు. మంటలను పూర్తిగా ఆపాలని మార్కాపురం అగ్నిమాపక సిబ్బందికి తెలిపినప్పటికీ వారు పట్టించుకోకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క వరి గడ్డి కాలుతూ గాలులకు నిప్పు రవ్వలు కూడా పైకి లేస్తుండడంతో చుట్టుపక్కల వారు ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపుచేయాలని ప్రజలు కోరుతున్నారు.

ముఖాముఖి

నేరాల నియంత్రణకు గస్తీ ముమ్మరం

జి.కోటయ్య, ఎస్ఐ, పీసీపల్లి



ప్రశ్న: నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలేంటి?

జవాబు: నేరాలను నియంత్రించేందుకు సిబ్బంది ద్వారా గస్తీ ముమ్మరం చేశాం. రాత్రివేళల్లో బీటు కానిస్టేబుళ్ల గ్రామాల్లో తిరుగుతూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

ప్ర: రోడ్డు ప్రమాదాల నివారణకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

జ: విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా ప్రతిరోజు గ్రామాలను సందర్శిస్తున్నాం. వాహనాలను ఆపి డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేస్తున్నాం. హెల్మెట్ ధారణపై అవగాహన కల్పిస్తున్నాం. డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని వాహన చోదకులకు వివరిస్తున్నాం.

ప్ర: శక్తి యాప్‌పై అవగాహన కల్పిస్తున్నారా?

జ: ప్రతిరోజు 15 నుంచి 20 మందికి మొబైల్‌ఫోన్‌లో శక్తి యాప్‌ను రిజిస్ట్రేషన్ చేయిస్తున్నాం. యాప్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్నాం

ప్ర: గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు పూర్తయిందా?

జ: మండలంలోని అన్ని గ్రామాల ప్రధాన కూడళ్లు, దేవాలయాలు, చర్చిల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటుచేశాం. ప్రతిరోజు మానిటరింగ్ చేస్తున్నాం. మండలంలో 60 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశాం.

బాల్యవివాహాల నిర్మూలనకు కృషిచేయాలి

పామూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్య పేర్కొన్నారు. శనివారం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామ పంచాయతీలో ఐసీడీఎస్, మహిళా పోలీసులు, ఆశా కార్యకర్తలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ గోళ్ల పద్మజ, పరిపాలనాధికారి ఎస్.చెన్నకేశవరెడ్డి, ఎంఈవో జి.కరుణాకుమారి, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ గ్రామ కమిటీల ఏర్పాటు

పామూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలో టీడీపీ గ్రామ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్టు ఆపార్టీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం జరిగిన సమావేశాల్లో రావిగుంటపల్లి గ్రామ టీడీపీ అధ్యక్షుడిగా కంచర్ల శ్రీనివాసులు, దూబగుంట అధ్యక్షుడిగా దైండె శివశంకర్, బుక్కాపురం అధ్యక్షుడిగా మోరబోయిన రాజేంద్రప్రసాద్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారని ఆయన తెలిపారు.

అనుమానితులు సంచరిస్తుంటే తెలియజేయాలి

పామూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఎవరైన అనుమానాస్పదంగా సంచరిస్తుంటే పోలీసులకు తెలపాలని ఎస్ఐ టి.కిశోర్‌బాబు తెలిపారు. శనివారం పట్టణంలోని నెల్లూరు రోడ్డులో ఆయన ప్రజలతో మాట్లాడారు. బెట్టింగ్ యాప్, గంజాయి, మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించారు. పలు లాడ్జిల్లో ఆకస్మిక సోదాలు నిర్వహించారు. పలు వాహనాలను తనిఖీ చేశారు.

జామాయిల్ తోట దగ్ధం

ముండ్లమూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలవరం గ్రామానికి చెందిన అనపర్తి జాన్ ప్రభాకర్‌కు చెందిన జామాయిల్ తోటను గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో దగ్ధమైన ఘటన శనివారం ఉదయం వెలుగులోకి వచ్చింది. పొలం పక్కన రైతులు యజమానికి సమాచారం అందించటంతో పరిశీలించారు. రెండు ఎకరాలు పూర్తిగా కాలిపోయింది. ఈప్రమాదం శుక్రవారం రాత్రి జరిగి ఉండవచ్చునని బాధితుడు తెలిపారు.

దొంగతనానికి యత్నం

ముండ్లమూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండంలోని మారెళ్లలో శుక్రవారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. ఇద్దరు దొంగలు గ్రామంలోని బికాలు ఇంటి ముందు తాళం వేసి ఉన్న ద్విచక్ర వాహనాన్ని చోరీ చేస్తుండగా ఇంటి యజమానురాలు లేచి కేకలు వేసింది. దీంతో అంబేడ్కర్‌నగర్ వాసులు దొంగలను పట్టుకొనేందుకు ప్రయత్నించగా పరారయ్యారు.

మద్యం మత్తులో హల్‌చల్

కనిగిరి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఓవ్యక్తి చాకుతో శనివారం పట్టణంలో హల్‌చల్ చేశాడు. మండలంలోని ఎన్‌గొల్లపల్లి గ్రామానికి చెందిన మీరా హుస్సేన్ ఉదయాన్నే మద్యం సేవించాడు. వృత్తిరీత్యా అతను పంచర్ దుకాణం నడుపుకుంటున్నాడు. ఈక్రమంలో టైర్లను కోసే చాకు పట్టుకుని వీధుల్లో తిరుగుతూ పాదచారులను దుర్భాషలాడుతూ వారివెంట పడ్డాడు. దీంతో రవి అనే కానిస్టేబుల్ అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అతినికి పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి ఇంటికి పంపారు.

గడియార స్తంభం కూల్చివేతకు రంగం సిద్ధం

దర్శి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): దర్శి పట్టణంలోని గడియారస్తంభం కూల్చివేసేందుకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. సుమారు 20 సంవత్సరాల క్రితం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఈ స్తంభం నిర్మించారు. నిర్మాణం సమయంలో ఆర్అండ్‌బీ అధికారులు ముందుచూపు లేకుండా ఒకవైపు నిర్మించారు. దీంతో ఆ సర్కిల్‌లో పెద్ద వాహనాలు తిరిగేందుకు వీలులేకుండా ఇబ్బందిపడే పరిస్థితి నెలకొంది. కాలక్రమంగా వాహనాల రద్దీ విపరీతంగా పెరగటంతో అక్కడ తరచూ ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. ఈనేపథ్యంలో ట్రాఫిక్‌కు అడ్డుగా ఉన్న గడియారస్తంభం తొలగించాలని రెవెన్యూ, నగర పంచాయతీ అధికారుల నిర్ణయించారు. గడియార స్తంభం కూల్చవద్దని రోటరీ క్లబ్‌కు చెందిన కొందరు వ్యక్తులు కోర్టును ఆశ్రయించినట్లు తెలిసింది. అయితే, ట్రాఫిక్‌కు అడ్డుగా ఉన్నందున తొలగించాల్సిన అవసరం ఏర్పడిందని నగర పంచాయతీ అధికారులు కోర్టుకు వివరణ ఇవ్వటంతో అడ్డంకులు తొలగిపోయినట్లు కమిషనర్ మహేశ్వరరావు తెలిపారు. ఈక్రమంలో గడియార స్తంభాన్ని ఏ సమయంలోనైనా కూల్చివేసే అవకాశం ఉంది.



(26దర్శి03) దర్శి పట్టణంలోని గడియార స్తంభం

దొనకొండలో దాహం దాహం

- తరచూ పైపులైను మరమ్మతులు
- నీటి సరఫరాకు అంతరాయం
- శిథిలావస్థలో చందవరం-1 సాగర్ నీటి స్టోరేజీ

దొనకొండ, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రమైన దొనకొండ ప్రజల దాహంతీర్చే సాగర్ జలాలు సరఫరా జరగకపోవటంతో ఇబ్బందులు పడుతున్నారు. రైల్వే ట్రాక్ అవతలివైపు వారం రోజులుగా, ఇటువైపున ఒబ్బాపురం ప్రాంతానికి దాదాపు నెలరోజులుగా నీటి సరఫరా జరగడంలేదు. చందవరం-1 స్టోరేజీలో సంమృద్ధిగా సాగర్‌నీరు ఉన్నా మంచినీటి కష్టాలు తప్పటం లేదు. ఒబ్బాపురం ఎన్ఏపీ ట్యాంక్ పరిధిలో దాదాపు వందకు పైగా గృహాలకు నెలరోజులుగా నీటి సరఫరా జరగకపోవడంతో పడరాని పాట్లు పడుతున్నారు. ఆర్థికంగా ఇబ్బందులు అయినా మినరల్ వాటర్ కొనుగోలు చేసుకొని దాహర్తి తీర్చుకుంటున్నారు. తరచూ పైపులైను పగలటం, లీకులు అవుతుండటంతో మంచినీటి సమస్య తీవ్రమైంది. నూతన పైప్‌లైన్ ఏర్పాటు జరిగితేనే మంచినీటి సమస్యకు పరిష్కారం మవుతుందని ప్రజలు బావిస్తున్నారు.



దొనకొండలో నిరుపయోగంగా ట్యాంక్

దొనకొండ మండలంలోని 29 గ్రామాల ప్రజల దాహర్తి నిమిత్తం నెదర్లాండ్ ఆర్థిక సహాయంతో 1982లో 885 మిలియన్ లీటర్ల సామర్థ్యంతో రూ.2.75 కోట్ల వ్యయంతో సాగర్ కాలువకు రెండు కిలోమీటర్ల దూరంలో చందవరం-1 మంచినీటి స్టోరేజీని నిర్మించారు. ఇది నిర్మించి 43 సంవత్సరాలు గడవటంతో శిథిలావస్థకు చేరింది. నీటి సరఫరా నిమిత్తం ఏర్పాటుచేసిన పైపులైను తరచూ మరమ్మతులకు గురవుతుంది. దీనికితోడు ఇటీవల కొందరు పశుపోషకులు పశువుల దాహర్తి నిమిత్తం పైపును పగులకొట్టి నీటిని గుంతలకు మళ్లిస్తున్నారు. ఫలితంగా నీటి సరఫరాకు ఆటంకం ఏర్పడుతుంది. చందవరం-1 మంచినీటి స్టోరేజీ పూర్తిగా నిరుపయోగమై మంచినీటి సమస్య తీవ్రం కాక ముందే సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి అమానుషం

కనిగిరి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పహల్గాంలో పర్యా టకులను అమానుషంగా కాల్చి చంపటం దుర్మార్గమని టీడీపీ నాయకుడు వీవీఆర్ మనోహర రావు (చిరంజీవి) అన్నారు. కశ్మీర్‌లో జరిగిన ఘటనపై జర్నలిస్టుల ఆధ్వర్యంలో శనివారం రాత్రి నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జేవీవీ, ప్రజాసంఘాలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు సంఘీభావం తెలిపి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ ఉగ్రవాద సంస్థలను దేశం నుంచి తరిమి కొట్టాలన్నారు. తొలుత స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నుంచి పట్టణ పురవీధులో ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ సుగుణావతమ్మ సెంటరు వద్ద మానవహారం నిర్వహించారు.



కనిగిరిలో మానవహారం నిర్వహించిన జర్నలిస్టులు, రాజకీయపార్టీ నాయకులు

కార్యక్రమంలో జర్నలిస్టులు బుజ్జి, నున్నా కృష్ణ, నారాయణరెడ్డి, ఆచారి, విజయరాజు, ఖాదర్‌భాషా, ప్రింట్ అండ్ మీడియా జర్నలిస్టులు, టీడీపీ నాయకులు రాచమల్ల శ్రీనివాసులురెడ్డి, ముచ్చుమూరి చెంచిరెడ్డి, నాగిరెడ్డి, జేవీవీ నాయకులు కె.వెంకటేశ్వర్లు, బీజేపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు. అలాగే, సీపీఎం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆపార్టీ నాయకుడు పీసీ కేశవరావు, తదితరులు పాల్గొన్నారు.

దర్శిలో..

దర్శి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ కాల్పుల్లో మృతి చెందిన కుటుంబాలకు వాళులర్పిస్తూ ఏపీయూ డబ్ల్యూజే ఆధ్వర్యంలో శనివారం జర్నలిస్టులు నిరసన ర్యాలీ నిర్వహించారు. స్థానిక తహసీల్దా ర్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ పట్టణంలోని ప్రధాన వీధుల్లో కొనసాగింది. అనంతరం గడియార స్తంభం సెంటర్‌లో కశ్మీర్‌లో అమాయకులపై కాల్పులు జరిపి 28 మంది ప్రాణాలు బలిగొన్న తీవ్రవాదులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు, నియోజకవర్గంలోని జర్నలిస్టులు హెచ్.రవి కాంత్, నరేంద్ర, రామారావు, బాలకృష్ణ, శ్రీనివాసరావు, శ్రీనివాసరెడ్డి, సురేష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఐటీడీపీ కోఆర్డినేటర్ సందు రామయ్య, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు తిండి నారాయణరెడ్డి నిరసన ర్యాలీలో పాల్గొని సంఘీభావం తెలిపారు.



వెలికితీసిన వైట్ క్వాట్జ్

నిషేధిత భూముల్లో మైనింగ్

కురిచేడు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని పడమర వీరాయపాలెం పంచాయతీ పరిధి 8వ సర్వే నంబరులో పెద్ద మొత్తంలో భూమి ఉంది. ఇందులో చాలామంది పాగావేసి సాగు చేసుకుంటున్నారు. రెవెన్యూ అధికారులు ఎవరూ ఈ భూమిలో సాగు చేయవద్దని బోర్డు కూడా పెట్టారు. అయినా సాగు, మైనింగ్ ఆగడం లేదు. ఈసర్వే నంబరులో 528.20 ఎకరాల భూమి ఉంది. అది ప్రభుత్వ భూమి అని, ఎవరూ ఆక్రమించి వద్దని బోర్డు పెట్టారు. కొద్ది నెలల క్రితం అక్రమంగా మైనింగ్ చేసి వైట్ క్వాట్జ్ బయటకు తీశారు. తహసీల్దార్ దాడులు చేసి నిలిపివేశారు. మరలా రెండు రోజుల క్రితం గుర్తుతెలియని వ్యక్తులు అక్రమంగా గతంలో తీసిన దానికి దగ్గరగా గుంతలు తీసి వైట్ క్వాట్జ్‌ను బయటకు తీశారు. రాళ్లను అయితే బయటకు తీశారు కాని వాటిని తీసుకెళ్ళలేదు. గతంలో పెద్దవరం, దేకనకొండ పంచాయతీలలో అక్రమంగా మైనింగ్ జరిగింది. అధికారులు దాడులు చేసి వారిని పట్టుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. అక్రమ మైనింగ్ ఆపాలని స్థానికులు కోరుతున్నారు.

తాళ్లూరులో ముమ్మరంగా పారిశుధ్య పనులు

తాళ్లూరు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మండలంలో తాళ్లూరు, రజానగరం, దోసకాలయపాడు సచివాలయాల పరిధిలోని అన్నివీధుల్లో పారిశుధ్య పనులను వేగవంతం చేశారు. తాళ్లూరులో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించారు. ఎంపీడీవో దారా హనుమంతరావు, ఈవోఆర్‌డీ సుందరరామయ్య ఆదేశంతో సర్పంచ్ చార్లెస్‌సర్జన్, పంచాయతీ కార్యదర్శి ఐ.రమణారెడ్డిలు గత నాలుగు రోజులుగా పారిశుధ్య పనులు చేయిస్తున్నారు. ఎస్సీ కాలనీల్లోని మురుగు కాలువలు, రాములవారిమేడ సమీపాన, ముండ్లమూరు రోడ్డు, తూర్పుగంగవరం వెళ్లే మార్గం, కొత్తపాలెం గ్రామ సాయిబాబా గుడి నుంచి పూడిపోయిన మురుగు కాలువలను ఎక్స్‌కవేటర్ సాయంతో తీయించి మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టారు. తాళ్లూరులో రోడ్డుపై అడ్డుగావుండి వాహన రాకపోకలకు ఇబ్బందిగా ఉన్న పలు స్తంభాలను తీయించారు.

దోసకాయలపాడు పంచాయతీ కార్యదర్శి శ్రీవల్లి ఆధ్వర్యంలో ఎస్సీ కాలనీల్లోని మురుగు కాలువ పూడికతీత పనులు చేపట్టారు. రజానగరం సర్పంచ్ కాలేషావలి ఆధ్వర్యంలో గ్రామంలోని వీధుల్లో మురుగు కాల్వలపూడిక తీత పనులు చేపట్టారు.

గత వారం రోజులుగా గ్రామాల్లో పారిశుధ్య పనులు ఊపందుకున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో గ్రామపంచాయతీలకు నిధుల విడుదల కాకపోవటంతో నాలుగేళ్లలో ఏనాడు పారిశుధ్య పనులు చేపట్టిన పాపాన పోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పంచాయతీలకు నిధులు విడుదల కావటంతో సర్పంచ్‌లు, పంచాయతీ అధికారులు గ్రామపంచాయతీల్లో పారిశుధ్య పనులు చేపట్టడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కనిగిరిలో తాగునీటి సమస్యకు చెక్!

- ఎమ్మెల్యే చొరవతో దర్శి నుంచి కనిగిరికి కొత్తపైపులు ఏర్పాటు

కనిగిరి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి చొరవతో ప్రజలు తాగునీటి సమస్య పరిష్కారమైంది. దర్శి నుంచి కనిగిరి వచ్చే తాగునీటి సాగర్ పైపులైను తరచూ మరమ్మతులకు గురవుతుంది. వేసవికాలం వచ్చిందంటే నీటి వెక్కిళ్ళు తప్పేవి కావు. గత పదేళ్ళుగా దర్శి నుంచి కనిగిరికి వచ్చే తాగునీటి పైపులు మరమ్మతులకు గురవుతూ ప్రజలు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకొనేవారేలేరు. ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి చొరవతో దర్శి నుంచి కనిగిరి వరకు నాణ్యమైన అధునాతన పైపులను ప్రత్యేకంగా తెప్పించి వేయించారు. దీంతో కనిగిరి ప్రాంతంలోని పునుగోడు హెడ్ రెగ్యులేటర్ ట్యాంకుకు శనివారం సాగర్‌నీరు చేరింది. దీంతో కనిగిరి ప్రాంత ప్రజలకు నీటి కష్టాలు తీరినట్టే. కనిగిరి పట్టణంతో పాటు 190 గ్రామాల ప్రజలకు నీటి సరఫరా లో సమస్యలు తొలగిపోయాయి.



పునుగోడు హెడ్ రెగ్యులేటర్ ట్యాంకుకు చేరిన నీరు

విద్యుత్ సమస్యలను పరిష్కరించాలి

కనిగిరి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సమస్యను పరిష్కరించాలని ఐటీడీపీ రాష్ట్ర కార్యదర్శి జంషీర్ సీజీఆర్ఎఫ్ ఛైర్మన్ ఎస్.విక్టర్ ఇమ్మానియేలును కోరారు. స్థానిక విద్యుత్ డీఈఈ కార్యలయంలో శనివారం డివిజన్ స్థాయి విద్యుత్ లోక్ అదాలత్ జరిగింది. ఈసందర్భంగా ఛైర్మన్‌కు పట్టణంలోని ముగ్గుబావి వీధిలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను వివరించారు. 9వ వార్డు ముగ్గుబావి వీధిలో పది కుటుంబాలకు చెందిన విద్యుత్ సర్వీస్ వైర్లు వ్రేలాడుతున్నాయని తెలిపారు. గాలుల వచ్చిన సమయంలో వైర్లు తెగి ఇళ్లపై పడుతున్నాయి. సర్వీస్ వైర్లు వ్రేలాడుతున్న క్రమంలో కండక్టర్ వైర్లు తెగి లోఓల్టేజి సమస్య ఏర్పడుతుందన్నారు. ఈ సమస్యపై ఆయా ప్రాంత ప్రజలు పలుమార్లు విద్యుత్ అధికారులు, సిబ్బందికి చెప్పినా ఫలితం లేకుండా పోయిందన్నారు.



విద్యుత్ సమస్యలపై ఛైర్మన్‌కు వివరిస్తున్న ఐటీడీపీ రాష్ట్ర కార్యదర్శి జంషీర్ అహ్మద్

సీజీఆర్ఎఫ్ ఛైర్మన్ ఇమ్మానియేలు మాట్లాడుతూ విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఆప్రాంతాన్ని అధికారులు పరిశీలించి అవసరమైనచోట విద్యుత్ స్తంభాలు వేయాలని ఆదేశించారు. లోక్‌అదాలత్‌లో 15 మంది తమ సమస్యలపై ఫిర్యాదు చేశారు. ఇందులో ఏడుగురు వినియోగదారుల సమస్యలను పరిష్కరించారు. కార్యక్రమంలో విద్యుత్ అధికారులు ఎస్.శ్రీనివాసులు, శ్రీనివాసరావు, సునీత, కట్టా వెంకటేశ్వర్లు, ఉమాకాంత్, పవన్‌కుమార్, కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తి మృతి

ముండ్లమూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తి మృతిచెందాడు. ఈఘటన శుక్రవారం అర్ధరాత్రి వేంపాడు- పోలవరం గ్రామాల మధ్య చోటుచేసుకుంది. దర్శి మండలం సామంతపూడి గ్రామానికి చెందిన షేక్ మస్తాన్‌వలి(52) తన అత్తగారి ఊరైన పల్నాడు జిల్లా శావల్యాపురం మండలం కారుమంచికి ద్విచక్ర వాహనంపై వెళుతున్నాడు. ఈ క్రమంలో వేంపాడు వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడటంతో తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందాడు.

మృతుడు ఫోన్ నెంబరు ఆధారంగా బంధువులకు సమాచారం అందటంతో వారువచ్చి మృత దేహాన్ని చూసి కన్నీరుమున్నీరుగా విలపించారు. మస్తాన్‌వలి కొన్ని సంవత్సరా లుగా శావల్యాపురంలో ఉంటూ సంతమాగులూరు అడ్డరోడ్డు వద్ద మెకానిక్ షెడ్డు నిర్వహిస్తున్నాడు. శనివారం స్వగ్రామమైన సామంతపూడి వెళ్ళి బం ధువులతో మాట్లాడి తిరిగి కారుమంచి వెళ్తూ ప్రమాదానికి గురై మృతి చెం దాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు ముండ్లమూరు ఏఎస్ఐ హనుమంతరావు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి అద్దంకి ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వ హించి బంధువులకు అప్పగించారు.

గ్రామ సభల్లో ఆమోదించిన పనులనే చేయించాలి

ముండ్లమూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): గ్రామ సభల్లో ఆమోదించిన పనులను మాత్రమే ఉపాధి హామీ పథకంలో చేయాలని ఏపీవో పి.వెంకటరావు అన్నారు. శనివారం మండలంలోని తూర్పుకంభంపాడు, నూజెండ్లపల్లి గ్రామాల్లో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీలో రెండు వందల నుంచి ఐదు వందల వరకు కూలీలు పనులకు వచ్చే విధంగా చూడాలన్నారు. కూలీలు వడదెబ్బకు గురి కాకుండా ఫీల్డ్ అసిస్టెంట్‌లు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పని ప్రదేశంలో మాత్రమే హాజరు తీసుకోవాలన్నారు. జాబ్ కార్డులు ఉన్న వారు మాత్రమే పనికి వచ్చే విధంగా చూడాలన్నారు. బోగస్ మస్టర్లు వేస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ నాగార్జున, ఫీల్డ్ అసిస్టెంట్‌లు రామలక్ష్మయ్య, విక్రమ్ పాల్గొన్నారు.

స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేయాలి

ముండ్లమూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాల బలోపేతానికి వీవోఏలు కృషిచేయాలని దర్శి క్లస్టర్ ఏరియా కోఆర్డినేటర్ వసుంధరాదేవి అన్నారు. శనివారం వెంకాయమ్మ అధ్యక్షతన జరిగిన మండల మహిళా సమాఖ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. సంఘాలు బలోపేతం ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందుతారన్నారు. ఆగిపోయిన ప్రతి పొదుపు సంఘాన్ని తిరిగి పునరుద్ధరించాలన్నారు. తీసుకున్న రుణాలను తిరిగి సకాలంలో చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి సంఘానికి రూ.5 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు రుణాలు ఇస్తున్నట్టు చెప్పారు. సమావేశంలో ఏపీఎం హనుమంతరావు, సీసీ కోటేశ్వరరావు, రత్న కుమారి, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులను వేగవంతం చేయాలి

ముండ్లమూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో ఉపాధి హామి పథకం పనులను ముమ్మరం చేయాలని ఎంపీడీవో ఆర్.జనార్దన్ అన్నారు. ఉన్నతాధికారులు ఇచ్చిన లక్ష్యాలను పూర్తిచేయకుంటే ఫీల్డ్ అసిస్టెంట్‌లపై చర్యలు తప్పవని హెచ్చరించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఫీల్ అసిస్టెంట్‌లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి పంచాయతీలో ఐదు వందల మంది కూలీలు తగ్గకుండా పనికి వచ్చేవిధంగా చూడాలన్నారు. జిల్లాలో వెనుకబడిన మండలంగా ముండ్లమూరు ఉందన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్‌లు గ్రామాల్లో దండోరా వేయించి ప్రతిరోజు పనికి వచ్చేవిధంగా చూడాలన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్‌లు, సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. పని ప్రదేశంలోనే కూలీల మస్టర్లు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఏపీవో టి.వెంకటరావు, శివరామకృష్ణ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

విఠలాపురం సచివాలయం పరిశుభ్రం



పరిశుభ్రం చేసిన సిబ్బంది గది

తాళ్లూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): అపరిశుభ్రంగా ఉన్న విఠలాపురం గ్రామ సచివాలయాన్ని అధికారుల ఆదేశానుసారం గ్రామపంచాయతీ కార్యదర్శి అజయ్‌కీర్తి శనివారం పరిశుభ్రం చేయించారు. 'అపరిశుభ్రంగా విఠలాపురం సచివాలయం' శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గ్రామకార్యదర్శి అజయ్‌కీర్తి పక్కగ్రామం నుంచి పంచాయతీ కార్మికులను పిలిపించి అన్ని గదులను శుభ్రం చేయించారు. ఎంతో కాలంగా ఉన్న అపరిశుభ్రత తొలగి సచివాలయం శుభ్రంగా తయారయింది. సచివాలయాలను అప్పుడప్పుడు శుభ్రం చేయిస్తూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా సచివాలయ సిబ్బంది చూడాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

ప్రతిభచాటిన ముండ్లమూరు విద్యార్థి

ముండ్లమూరు, ఏప్రిల్ 26 (ఆంధ్ర జ్యోతి): ముండ్లమూరు పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న బి.ప్రేమ్ నిధి కుమారుడు మణిరత్నపాల్ నిధి గిన్నిస్ బుక్‌లో ఎక్కి వరల్డ్ రికార్డు సాధించాడు. శనివారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో అవార్డు అందుకున్నారు. విజయవాడలోని హలేల్ మ్యూజిక్ స్కూల్ ద్వారా సంగీతం నేర్చుకొని అగస్టీన్ ఆధ్వర్యంలో గత డిసెంబరు 1న 18 దేశాల్లోని 1046 మంది చిన్నారులు స్వరాలు ఆలపించి గిన్నిస్ వరల్డ్ రికార్డు సొంతం చేసుకున్నాడు.



అవార్డు అందుకుంటున్న మణిరత్నపాల్ నిధి

వరల్డ్ రికార్డు సాధించిన మణిరత్నపాల్ నిధి తాళ్ళూరులోని సరస్వతి స్కూల్‌లో 6వ తరగతి చదివారు. మణిరత్నపాల్‌ను, కానిస్టేబుల్ ప్రేమానిధిని ఎస్ఐ కె.కమలాకర్, ఏఎస్ఐలు పి.హనుమంతరావు, వెంకటేశ్వరరెడ్డి, స్టేషన్ సిబ్బంది అభినందించారు.

ఉగ్రవాదాన్ని నిర్మూలించాలి

దర్శి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదాన్ని పూర్తిగా నిర్మూలించాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కైపు వెంకటకృష్ణారెడ్డి అన్నారు. కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ శనివారం రాత్రి పట్టణంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తీవ్రవాదాన్ని అణచివేయటంతో బీజేపీ ప్రభుత్వం విఫలమైందన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీరామ్‌రెడ్డి, కె.వీరబ్రహ్మం, వెంకటరమణారెడ్డి, ప్రశాంత్, షేక్ బుజ్జీ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ పటిష్టతకు కృషిచేయాలి

దర్శి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): బీజేపీ పటిష్టతకు కృషిచేయాలని ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు సెగ్గం శ్రీనివాసులు అన్నారు. శనివారం దర్శిలో జరిగిన నియోజకవర్గస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. బూత్ కమిటీల ఎంపిక త్వరగా పూర్తిచేయాలన్నారు. తొలుత తీవ్రవాద కాల్పుల్లో మృతి చెందిన పర్యాటకుల ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు.

కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ కన్వీనర్ మాడపాకుల శ్రీనివాసులు, టి.నారాయణరెడ్డి, కూకట్ల నాగేశ్వరరావు, అమరేశ్వరరావు, నాగసాయి, కొరంగి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉష్ణోగ్రత (అంచనా)

27-4-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	40	25
తెనాలి	39	25
నరసరావుపేట	40	26
బాపట్ల	36	26
రెంటచింతల	40	27

sunday s.p.e.c.i.a.l

అల్లరి మాయం సెల్ మయం



స్క్రీన్ టైమ్‌లోనే 10 గంటలు

ఒక రోజులో టీవీలు, మొబైల్, ట్యాబ్ లు, కంప్యూటర్లు వంటి వాటిని చూస్తూ గడపడాన్ని స్క్రీన్ టైమ్స్ అం టారు. ఒక రోజులో సగ టు మనిషికి 4 నుంచి 5 గంటల మాత్రమే స్క్రీన్ టైమ్‌లో ఉండాలి. కానీ పిల్లలే రోజుకు దాదాపు 10 గంటల వరకు స్క్రీన్ టైమ్‌కు కేటా యిస్తున్నారు. మూడు నుంచి ఆరేళ్ల లోని ప్రతి 10 మంది పిల్లల్లో 8 మంది అధికంగా స్క్రీన్ టైమ్స్ లో గడ పటం వల్ల తీవ్ర మానసిక ఒత్తిడికి లోన వుతున్నారు.



> డిజిటల్ బేబీలుగా పుడుతున్న ప్రస్తుత తరానికి ఊహ రాగానే వారి చేతికి ఫోను అందించి వారి జీవితాల్ని మొగ్గ దశలోనే నాశనం చేస్తున్నారు.
>
> - డాక్టర్ ప్రియాంక్‌జైన్, ఢిల్లీకి చెందిన పిల్లల వైద్య నిపుణులు

అల్లరితోనే.. ఆయుష్షు

ఏ కదలిక లేకుండా పిల్లలు కూర్చోవడం వల్ల తల్లిదం డ్రులకు సౌకర్యంగా ఉంటుదేమోగాని చిన్నారుల్లో శారీ రక, మానసిక ఎదుగుదల ఉండదు. పిల్లల్లో అల్లరే వారికి ఆయుష్షు అని తెలుసుకోవాలి. అల్లరి చేష్టలే వారికి ఆరోగ్యం అని ప్రస్తుత తరం తల్లిదండ్రులు గుర్తించుకోవాలి. ఏడేళ్లు కాపాడితే మొక్క కూడా మహా వృక్షమై తరతరాలకు నీడనిస్తుంది అని మహాత్మా గాంధీ చెప్పిన మాటలు పిల్లల కు కూడా అనువ దించా ల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉంది. అల్లరి చేయడం లేదనే విషయాన్ని మానసిక లోపంగా గుర్తించాలే తప్ప గొప్పగా భావించకూడదు.

అమ్మో గడుగ్గాయి.. ఒక్కక్షణం ఊరకే ఉండడు.. అల్లరితో ఆగమాగం చేస్తాడు.. ఇల్లు పీకి పంది రేస్తాడు.. పిల్లలు ఉండే ఇళ్లు.. వీధులు.. కాలనీ లు వారి అల్లరిచిల్లర పనులతో సందడిగా ఉం డేవి.. అయితే ఇదంతా గతం. అలాంటి పరి స్థితులు ప్రస్తుతం నగరాలు కాదు కదా.. పట్ట ణాలు.. పల్లెల్లో కూడా కాన రావడంలేదు. పెద్దల తో పాటు పిల్లలు కూడా సెల్‌ఫోన్లతో కాలం గడుపుతున్నారు. కాలక్షేపం చేస్తున్నారు. ఊయ లలో ఉండే చిన్నారులకు కూడా తల్లులు సెల్ ఫోన్ చూపిస్తూ వారి అల్లరిని కట్టడి చేస్తు న్నారు. దీంతో ప్రస్తుత తరం డిజిటల్ బేబీలుగా మారుతున్నారు. చందమామా రావే.. జాబిల్లి రావే అంటూ పెద్దలు చిన్నారులకు గోరుముద్దలు తినిపించే రోజులు మాయమై పోయా యి. ఇప్పుడంతా సెల్‌మయమే. ఏడు స్తున్నా.. అల్లరి చేస్తున్నా.. తినిపిం చాలన్నా.. సెల్‌ఫోన్ ఇచ్చేస్తు న్నారు. సెల్‌ఫోన్‌లో వచ్చే బొమ్మలు చూస్తూ అదే లోకంగా ఉండిపోతున్నారు. స్క్రీన్ మాయ లో పిల్లలు సర్వసాధారణ లక్షణాలైన ముద్దు ముద్దు మాటలు.. అల్లరి.. నవ్వడం.. ఏడవడం.. తదితర లక్షణాలను కోల్పోతున్నారు.

- కనుమరుగవుతోన్న గడుగ్గాయిలు
- డిజిటల్ బేబీలుగా మారుతోన్న చిన్నారులు
- ఎక్కువ సమయం స్క్రీన్ టైమ్‌తో పిల్లలు
- భావితరం భవిష్యత్‌కు ముప్పంటున్న వైద్యులు
- రక్షించాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే అంటూ సూచన



1 పిల్లలో సమస్యలు..

పిల్లలు అదేపనిగా స్క్రీన్‌టైమ్‌లో గడపటం వల్ల ఆయా స్క్రీన్లలో చూసిన విషయాలు మినహా వారి మెదళ్లలో ఇంకేమి ఉండటం లేదు. తలనొప్పి, వెన్నుముక నిటారుగా లేకపోవడం, స్వచ్ఛంగా మాట్లడలేక పోవడం, కంటికి ఇబ్బందులు వంటి ఆరోగ్యపరమైన సమస్యలతో భావి తరమైన నేటి పిల్లలు అల్లాడుతు న్నారు. రానున్న రోజుల్లో పెద్దలకు దూరంగా ఉండటం, ఎలక్ట్రానిక్ గాడ్జె ట్లు ఇచ్చిన వారి పట్ల కృతజ్ఞతా భా వం, ఊబకాయం, ఫోన్‌లో ఆడే గేము ల్లో రివార్డులు వస్తే అమితంగా సంతోషప డటం, ఒంటరిగా గడపాలనే ఆలోచన.. వంటి మానసిక సమస్యలు పిల్లల్లో వస్తాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు.



గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): చేతికి దొరి కింది నోట్లో పెట్టుకోవడం లేక పోతే పగల గొట్టడం.. వస్తు వులను చిందరవందరగా పడేయడం.. బొమ్మలు పగ లగొట్టడం.. గాయాలు చేసు కోవడం.. ఏడవడం.. నవ్వ డం.. ఇదంతా చిన్న పిల్లల లక్షణాలు. అయితే ఈ అల్లరి చేష్టలు మధుర జ్ఞాపకాలుగా మిగి లిపోతాయా అంటే ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు చూస్తే అవునంటున్నారు.. మానసిక వైద్యనిపుణులు. యాంత్రిక జీవితా నికి తల్లిదండ్రులు అలవాటు పడిపోగా.. అపురూపంగా పెంచాల్సిన పిల్లలను కూడా ఆ మాయలో పడేస్తున్నారు. కౌమార, యవ్వన దశలో ఉన్న వారిపై స్మార్ట్ ఫోన్లు ప్రభావం చూపుతున్నాయని ఇప్పటి వరకు విన్నాం. కానీ వాటి ప్రభావం చిన్నారులపై కూడా పడిందనే కఠోర సత్యం తాజా పరి శోధనల్లో తేలింది. దీంతో చిన్నారుల ప్రవ ర్తన, నడవడికల్లో తీవ్ర మార్పులు వచ్చాయి. పిల్లలు ఏడ్చినా.. మారం చేసినా వారి చేతికి ఫోను ఇవ్వడం వల్ల ఇటువంటి ఉపద్రవం వచ్చిందని (మిగతా 6వ పేజీలో)

వేగవంతంగా మోదీ పర్యటన ఏర్పాట్లు

- వీవీఐపీలు 100, ఎంఐపీలు 15 మంది రాక
- ఎవరూ ఇబ్బంది పడకుండా ఏర్పాట్లు చేయాలి
- ప్రధాన మంత్రి కార్యక్రమ నోడల్ అధికారి వీరపాండియన్
- సభా ప్రాంగణంలో అధికారులతో సమీక్షలు

తుళ్లూరు(వెలగపూడి), ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): రాజ ధాని అమరావతిలో శుక్రవారం ప్రధాని మోదీ పర్యటన నేపథ్యంలో శరవేగంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రధాని సభకు 100 మందికి పైగా వీవీఐపీలు, 15 మంది వరకు ఎంఐపీలు, 5 వేల మంది వరకు వీఐపీలు రానున్నారు. ఈ క్రమంలో ఆ స్థాయిలో అధికారులు వెలగపూడి సచివాల యం సమీపంలో చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. రాజధాని నిర్మాణ పనుల ను పునర్ ప్రారంభించేందుకు అమరావతికి రానున్న నరేంద్ర మోదీ పర్యటనని విజయవంతం చేయాలని ప్రధానమంత్రి కార్యక్రమ నోడల్ అధికారి, సీనియర్ ఐఏఎస్ వీరపాండియన్ ఆదేశించారు. సచివాలయం వెనుక వేదిక ప్రాంగణంలో జరు గుతున్న ఏర్పాట్లను సంబంధిత నోడల్ అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా వీరపాండియన్ మాట్లాడుతూ మోదీ శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు గన్నవరం విమా నాశ్రయానికి చేరుకుని అక్కడ నుంచి ప్రత్యేక హెలికాప్టర్లో సచివాలయానికి చేరుకుంటారన్నారు. అనంతరం 1.4 కిలో మీటర్ల మేర రోడ్డు షో ద్వారా సభా ప్రాంగణానికి చేరుకుం టారని తెలిపారు. సభ అనంతరం సాయంత్రం ఐదు గంట లకు హెలికాప్టర్లో గన్నవరం చేరుకుని ఢిల్లీ వెళ్తారని చెప్పారు. ప్రధాని సభకు వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు ప్రముఖులు చేరుకునేలా 8 రూట్లను సిద్ధం చేస్తున్నామని, వాహనాలు పా ర్కింగ్ కోసం 9 స్థలాలను గుర్తించి అక్కడ తాగునీరు, ఆహా రం, మరుగుదొడ్లు వంటి వసతులు కల్పించడం జరుగు తుందన్నారు. సభకు వచ్చే ప్రజలందరికీ పూర్తి స్థాయిలో ఆహారం అందించడం జరుగుతుందని, ఆయా పార్కింగ్ ప్రాం తాల్లో సరిపడా కౌంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలతో పాటు ప్రముఖులు కూడా ఇబ్బందులు పడకుండా సంబంధిత అధికారులు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఈ నెల 30న రిహార్సల్ ఉంటుందని, తదుపరి ఎస్పీజీ రిహార్సల్స్ ఉంటుందన్నారు. ప్రధాని వచ్చే సమయానికి పూర్తిస్థాయిలో ప్రజలందరికీ ఆహారం అందించటం జరుగుతుందని ఇందుకు సంబంధించి ఆయా పార్కింగ్ ప్రాంతాల్లో సరిపడా కౌంటర్లు ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అదనపు డీజీపీ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ పార్కింగ్ ప్రాంతంలో నిరం తరం మైక్ అనౌన్స్‌మెంట్ చేసే ఏర్పాట్లు చేయాలని సూచిం చారు. గుంటూరు కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ డ్యూటీ పాస్‌లకు సంబంధించి ఆయా శాఖలు వెంటనే జాబితా ఇవ్వాలని కోరారు. సమావేశంలో ఐజీలు శ్రీకాంత్, సర్వశ్రేష్ఠ త్రిపాఠి, సీయూఎం త్రివిక్రమవర్మ తదితరులు పాల్గొన్నారు.



వెలగపూడిలో ప్రధాని మోదీ బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్



సమీక్షలో మాట్లాడుతున్న సీనియర్ ఐఏఎస్ అధికారి వీరపాండియన్, కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్‌కుమార్

రైతులను గౌరవించుకునే సభ : మంత్రి మనోహర్

ప్రధాని మోదీ సభ ద్వారా రాజధాని నిర్మాణానికి భూము లు ఇచ్చిన రైతులను గౌరవించుకునే కార్యక్రమం అని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. వెలగపూడిలో ప్రధాని మోదీ సభ ఏర్పాట్లను అధికారులతో కలిసి మంత్రి నాదెండ్ల మనో హర్ పరిశీలించారు. ఐదు, ఆరు జిల్లాల నుంచి నాలుగు లక్షల నుంచి ఆరు లక్షల వరకు రావడానికి ప్రజలు ఆసక్తి చూపుతున్నారన్నారు. సోమవారం ఎస్పీజీ సిబ్బంది వచ్చి సభా ప్రాంగణాన్ని పరిశీలించిన తర్వాత వారి సూచనలకు అనుగుణంగా ఏమైనా ఏర్పాట్లు అవసరమో పునర్ పరిశీలి స్తామన్నారు. సీడ్ యాక్సెస్ రోడ్డుని పూర్తిగా ఉపయోగించు కుంటామన్నారు. అవసరమైతే పశ్చిమ బైపాస్ రోడ్డుని కూడా ఉపయోగించుకోవాలని చూస్తున్నామన్నారు. ప్రజలకు ఇబ్బం దులు కలగకుండా అన్ని సౌకర్యాలు ఉండాలని సీఆర్‌డీఏ అధి కారులకు మంత్రి పలు సూచనలు చేశారు. సభా వేదిక వద్ద కు దారితీసే రోడ్లను మంత్రి పరిశీలించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో కలెక్టర్ నాగలక్ష్మి, ప్రధాన మంత్రి పర్యటన ఏర్పాట్ల పర్యవేక్షణ నోడల్ అధికారి వీర పాండ్యన్ , గుం టూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, ఎస్పీ సతీష్ కుమార్ జిల్లా సంయుక్త కలెక్టర్ ఏ.భార్గవ తేజ, ఆర్డీవో కె. శ్రీనివాస రావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

12,671 మందికి రూ.25.34 కోట్ల భృతి

- ఎన్నికల హామీని అమలు చేసిన ప్రభుత్వం
- నిజాంపట్నం హార్బర్‌లో త్వరలో అన్నక్యాంటిన్ ఏర్పాటు
- మత్స్యకారుల సేవ సభలో మంత్రి అనగాని

రేపల్లె, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 12,671 మంది మత్స్యకారులకు వేట విరామ భృతి కింద రూ.25.34 కోట్లు పంపిణీ చేసినట్లు మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. శని వారం మండలంలోని కొత్తపాలెం గ్రామంలో మత్స్యకారుల సేవ పథకం ద్వారా జిల్లాలోని గంగపుత్రులకు వేట విరామ భృతి చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్ర భుత్వం మత్స్యకారులకు ఇచ్చిన హామీని అమలు చేసిందన్నారు. మత్స్యకారుల కుటుంబాలకు రూ.20 వేలు చొప్పున వేట విరామ భృతిగా ఆర్థిక సాయం అందిస్తుందన్నారు. గత ప్రభుత్వంలో రూ.10 వేలే అందించిందని కూటమిప్రభుత్వం దాన్ని రెట్టింపు చేసిందన్నారు. మత్స్యకారులకు కూటమి ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. ఆక్వారంగాన్ని అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుం టుందన్నారు. నిజాంపట్నం మండలం దిండి ప్రాం తాన్ని టూరిజం కేంద్రంగా అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. నిజాంపట్నంలో కొండ పోరంబోకు స్థలాల్లో ఇళ్లు కట్టుకున్న పేదలకు త్వరలో పట్టాలు అందజేస్తామన్నారు. మత్స్యకారుల ఆకలిని తీర్చేందుకు హార్బర్‌లో అన్నక్యాంటిన్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. గతంలో చంద్రబాబు విజన్ 2020 అంటే చాలామంది నవ్వారని కానీ ఆ ఫలితాలను ఇప్పుడు ప్రతీ కుటుంబం అనుభవిస్తుందని చెప్పారు. పీ4 పథకం పేదల బతుకుల్లో మార్పులు తీసుకువ స్తుందన్నారు. కలెక్టర్ వెంకటమురళి మాట్లాడుతూ మత్స్యకారులకు వలలు, బోట్లు అందింజేస్తామన్నారు. హార్బర్ అభివృద్ధి పనులు వేగవంతం చేస్తామన్నారు. మడ అడవులను పర్యాటక కేంద్రంగా తయారు చే స్తున్నామన్నారు. కార్యక్రమంలో కృష్ణా పశ్చిమ డెల్టా పీసీ చైర్మన్ పంతాని మురళీధరరావు, మత్స్యశాఖాధి కారి శ్రీనివాస్‌నాయక్, డీపీవో ప్రభాకర్, పౌరసరఫరా ల శాఖాధికారి విలియమ్స్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ పీడీ శ్రీనివాసరావు, జడ్పీటీసీ నర్రా సుబ్బయ్య, టీడీపీ నాయకులు దండుప్రోలు వెంకటేశ్వరరావు, బొమ్మిడి రామకృష్ణ, జనసేన నియోజకవర్గ సమన్వ యకర్త మత్తి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



మత్స్యకారులకు నగదు చెక్కును అందిస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్, కలెక్టర్ వెంకటమురళి

ఎట్టకేలకు సీసీబీకి టెండర్

- రూ.18.09 కోట్లతో 75 పడకల ఆస్పత్రి
- పీఎం ఆయుష్మాన్ భారత్ కింద నిధులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి) నరసరావుపేటలోని ఏరియా ఆస్పత్రి ప్రాంగణంలో క్రిటికల్ కేర్ బ్లాక్(సీసీబీ) నిర్మాణానికి ఎట్టకేల కు ప్రభుత్వం టెండర్ పిలిచింది. ఈ ప్రొక్యూర్‌మెంట్ విధానంలో బిడ్ల స్వీకరణ శుక్రవారం నుంచి ప్రారంభమైంది. నెల రోజుల్లో టెం డర్ ప్రక్రియ పూర్తి చేసే దిశగా ప్ర భుత్వం చర్యలు చేపట్టింది. ప్రధా న మంత్రి ఆయుష్ మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రా మిషన్ కింద రూ.18.09 కోట్లు కేటాయించారు. పోలీసు, వైద్య ఆరోగ్య శాఖల మధ్య నెలకొన్న స్థల వివా దంతో సీసీబీ టెండర్ నిర్వహణలో ఆరు నెలలు జాప్యం జరిగింది. పోలీసుశాఖ ఆస్పత్రి స్థలాన్ని వదిలేయడంతో ఎట్టకేలకు ఏపీఎంఎస్ఐడీసీ టెండర్ ప్రక్రియ చేపట్టింది. దీంతో సీసీబీ నిర్మాణానికి మార్గం సుగమమైంది.



సీసీబీ నమూనా భవన చిత్రం

పేదలకు వరం..

కేంద్ర ప్రభుత్వం నరసరావుపేటకు మంజూ రు చేసిన క్రిటికల్ కేర్ బ్లాక్ పేదలకు వరం. అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయి. నరసరావుపేట ఏరియా ఆస్పత్రిలో సీసీబీ నిర్మిస్తుండటం పేదలకు వరమనే చెప్పా లి. 200 పడకల సామర్థ్యం ఉన్న ఏరి యా ఆస్పత్రికి సీసీబీలో 75 పడకలు కేటాయిం చింది. సీసీబీలో ఐసీయూ, ఐసో లేషన్ వార్డులు, ఓటీ, లేబర్.. డెలి వరీ.. రికవరీ గదులు (ఎల్‌డీఆర్స్) ఉంటాయి. 75 పడకల సీసీబీని 6,375 చదరపు మీటర్ల వైశాల్యంలో నిర్మిస్తారు. ఐసోలేషన్ వార్డులో 30 పడకలు ఉంటాయి. ఐసీయూలో 12 పడ కలు(రెండు చిన్నపిల్లలకు) ఉంటా యి. ఐసోలేషన్ రూమ్స్‌లో ఐదు పడకలు. డయాలసిస్‌లో నాలుగు, ఎంసీహెచ్ లో నాలుగు, ఎమర్జెన్సీలో నాలుగు రెడ్, నాలుగు ఎల్లో, మరో రెండు పడకలు మొత్తం 10 ఉంటా యి. భవన నిర్మాణం, బెడ్లు, అత్యాధునిక వైద్య పరికరాలను కేంద్ర ప్రభుత్వం సమకూరుస్తుంది. నిర్వహణ ఖర్చు 75 పడకలకు రూ.5.84 కోట్లుగా అంచనా వేశారు. భవన నిర్మాణానికి రూ.18.09 కోట్లు, పరికరాలకు రూ.11.40 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఆరుగురు స్పెషలిస్టు వైద్యులు, జీడీఎంలు 14 మంది, నర్సులు 90 మంది, హెల్త్ ప్రొఫెషనల్స్ 9 మంది, సపోర్టింగ్ స్టాఫ్ 9 మందిని నియమిస్తారు.



సీసీబీ ప్రతిపాదిత స్థలం

5000 లీటర్లు బెల్లం ఊట ధ్వంసం

- 33 ద్విచక్ర వాహనాలు, 6 ఆటోలు స్వాధీనం

రామనగర్(చీరాల), ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): చీరాల పరిధిలోని రామనగర్, న్యూ కాలనీ ప్రాంతాల్లో డీఎస్పీ ఎండీ మొయిన్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. సుమారు 150 మంది పోలీసులు ఆయా ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. సుమారు 5 వేల లీటర్లు బెల్లం ఊటను గుర్తించి ధ్వంసం చేశారు. సరైన పత్రాలు లేని 33 ద్విచక్ర వాహనాలు, 6 ఆటోలు స్వాధీనం చేసుకున్నారు. అనుమాని తుల వివరాలు సేకరించారు. కార్యక్రమంలో సీఐలు నాగభూషణం, శేషగిరిరావు, సుబ్బారావు, రమణయ్య, మల్లికార్జునరావు తదితరులు ఉన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలకు వారధిగా కళలు

నాటిక పోటీల ముగింపు సభలో ముత్తవరపు సురేష్‌బాబు

మార్టూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మన సంస్కృతి, సంప్రదాయాలను, ఆచారాలను, జీవనశై లిని భావితరాలకు కళ లు అందిస్తాయని వేదిక అధ్యక్షుడు ము త్తవరపు సురేష్‌బాబు తెలిపారు. శ్రీ కా రం, రోటరీ కళాపరిషత్‌ల ఆధ్వర్యంలో రెండు రోజుల నుంచి మార్టూరులో జరుగుతున్న 15వ తెలుగు రాష్ట్రాల నాటిక పోటీలు శనివారం రాత్రితో ముగిశాయి. అంతకముందు ముత్తవరపు అరుణకు మారి నటరాజ విగ్రహం వద్ద జ్యోతిప్ర జ్వలన చేసిన తర్వాత నాటిక పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాపరి షత్‌ల ద్వారా నాటికలతో జనం మనస్సుల్లో శాశ్వ తంగా గుర్తుండిపోయే విధంగా కళాకారులు ప్రద ర్శన చేశారన్నారు. కళలు, కళాకారులు ఒకే నాణేనికి ఉన్న బొమ్మ బొరుసు లాంటి వారన్నారు. ముగిం పురోజు మూడు నాటికలను ప్రదర్శించారు. తొలి ప్రదర్శనగా విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ హైదరాబాద్ ఆధ్వర్యంలో స్వేచ్ఛ నాటికను ప్రదర్శిం చారు. తాడేపల్లి అరవింద ఆర్ట్స్ ఆధ్వర్యంలో ద్వితీ య ప్రదర్శనగా 'విడాకులు కావాలి' నాటికను ప్రద ర్శించారు. చివరగా శ్రీమైత్రి కళానిలయం విజయ వాడ వారిచే బ్రహ్మ స్వరూపం నాటికను ప్రదర్శిం చారు. జేఎస్‌డబ్ల్యూ ఫౌండేషన్ సీనియర్ మేనే జర్ పొదిలి రాజశేఖరరాజు, కొలిపాక సురేష్‌లను రతన్‌టాటా అవార్డులతో సత్కరించారు. కార్యక్ర మంలో ఎఫర్ట్ సంస్థ డైరెక్టర్ జాష్టి వెంకటమోహన రావు, ఎం.ఈశ్వరప్రసాద్, మద్దుమాల కోటేశ్వరరా వు, షేక్ ఖాజాహుస్సేన్, శానంపూడి లక్ష్మయ్య, మా దాల సాంబ శివరావు, గుండవరపు వెంకటప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



స్వేచ్ఛ నాటికలోని సన్నివేశం

అవీ.. ఇవీ..

ఉగ్రదాడిని నిరసిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న హిందూసేన

పంగులూరు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రవాదుల దాడికి నిరసనగా మండల హిందూసేన ఆధ్వర్యంలో శనివారం రాత్రి పంగులూరులో కొవ్వొత్తులతో నిరసనర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అద్దంకి నియోజకవర్గ బీసీ సంఘం అధ్యక్షులు చేబ్రోలు రవిచంద్ర మాటాడుతూ పహల్గామ్‌లో లష్కరేతోయిబా ఉగ్రవాదుల దుశ్చర్యను ప్రతి భారతీయుడు ముక్త కంఠంతో ఖండించాలన్నారు. ఉగ్రవాదులను కాశ్మీర్ నుండి తరిమి వేయడంతో పాటు కాశ్మీర్‌లో శాంతిని నెలకొల్పాలన్నారు. కార్యక్రమంలో నందవరపు పీర్‌సాహెబ్, కందుకూరి మల్లికార్జునరావు, రత్తయ్య చౌదరి, కరీముల్లా, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు

చికిత్స పొందుతూ బాలుడు మృతి

అద్దంకి, ఏప్రిల్26(ఆంధ్రజ్యోతి): చెరువులో పడి చికిత్స పొందుతున్న బాలుడు కొడవటిగంటి భరత్(10) శనివారం ఒంగోలు రిమ్స్ లో మృతి చెందాడు. మండలంలోని వెంపరాల కు చెందిన స్వర్ణలత ను మార్కాపురం మండలం రాజుపాలెం చెందిన పుల్లారావు కు ఇచ్చి వివాహం చేశారు. స్వర్ణలత రెండవ కాన్పు కు పుట్టిల్లు అయిన వెంపరాల రావటంతో తల్లి తో పాటు భరత్ కూడా వచ్చాడు. ఈ నేపథ్యంలో శు క్రవారం ముగ్గురు పిల్లలు చెరువు వద్ద కు వెళ్లారు. భరత్ జారి చెరువులో పడటంతో గొ ర్రెల కాపరులు గమనించి బయటకు తీసి 108 వాహనం లో అద్దంకి వైద్యశాలకు తరలించి మెరుగైన చికిత్స నిమిత్తం ఒంగోలు రిమ్స్ కు తరలించారు. రిమ్స్ లో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు స్థానిక పోలీస్ స్టేషన్ కు సమాచారం వచ్చినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు.

వెంపరాలలో ఉపాధి కూలీ మృతి

అద్దంకి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంపరాలలో శనివారం ఉపాధి పనులకు వెళ్లిన కూలీ గరిగెల దాసు(గుండెపోటుతో మృతి చెందాడు. ఫారంఫాండ్ పనులకు వెళ్లిన దాసుకు గుండెల్లో నొప్పిగా ఉందని చెప్పడంతో తోటి కూలీలు 108 కు సమాచారం అందించారు. వైద్యచికిత్స నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మృతిచెందాడు. అనంతరం ప్రభుత్వ వైద్యశాలలో వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ విషయాన్ని మేట్ వజ్జా బ్రహ్మయ్య ఎంపీడీవో శింగయ్యకు సమాచారం అందించారు.

నేర నియంత్రణకు ప్రత్యేక చర్యలు

- వేటపాలెంలో డ్రోన్ కెమెరాతో పలు వాహనాల తనిఖీ



తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ శేషగిరిరావు, ఎస్సై వెంకటేశ్వర్లు

వేటపాలెం(చీరాల), ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : నేర నియం త్రణకు పోలీసులు ప్రత్యేక చర్యలు తీసు కుంటున్నారు. సాంకే తికపరంగా మరింత ముందుకు సాగుతూ డ్రోన్ కెమెరాతో వాహనాలు గుర్తిస్తు న్నారు. ఈ నేపథ్యం లోనే శనివారం వేటపాలెం - పాపూరు రోడ్డు జంక్షన్‌లో డ్రోన్ కెమెరా తో సీఐ శేషగిరిరావు, ఎస్సై వెంకటేశ్వర్లు పలు వాహనాలు తనిఖీలు చేశారు. అనుమానిత వాహనాలను స్టేషన్‌కు తరలించారు. నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. తనిఖీల్లో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

ఇంకొల్లు, ఏప్రిల్ 26,(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇడుపులపాడు గ్రామ పరిధిలో పేకాట శిబిరంపై ఇంకొల్లు ఎస్ఐ సురేష్ తమ సిబ్బందితో దాడులు నిర్వహించారు.పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు.వారి వద్ద నుండి రూ.1850లు నగదును స్వాధీన పరుచుకున్నారు.

1,326 బంగారు కుటుంబాల గుర్తింపు

అద్దంకి, ఏప్రిల్26 (ఆంధ్రజ్యోతి): మండలంలో 1326 బంగారు కుటుంబాలను గుర్తించినట్లు ఎంపీడీవో శింగయ్య తెలిపారు. ఆయా గ్రామాలలో సచివాలయ సిబ్బంది ద్వారా పీ-4 సర్వే ద్వారా 1,326 బంగారు కుటుంబాలు గుర్తించడం జరిగిందన్నారు. ప్రతి 5 నుండి 7 బంగారు కుటుంబాలకు ఒక మార్గదర్శిని ఎంపిక చేసినట్లు తెలిపారు. మార్గదర్శి కుటుంబాలకు అవగాహన కల్పించేందుకు గ్రామ, మండల, జిల్లా స్థాయిలో అవగాహన కల్పించేందుకు కమిటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మార్గదర్శి పనిచేసేందుకు వారికినచ్చిన కుటుంబాలను ఎంపిక చేసుకోవచ్చన్నారు.

నిబద్ధతతో విధులు నిర్వహించాలి



రికార్డులు పరిశీలిస్తున్న కమిషనర్ రవీంద్ర

అద్దంకిఏ ప్రిల్26 (ఆంధ్రజ్యోతి): సచివాలయ సిబ్బంది నిబద్ధతతో విధులు నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ రవీంద్ర అన్నారు. అద్దంకి పట్టణం లోని 8వ సచివాలయాన్ని శనివారం ఉదయం కమిషనర్ రవీంద్ర ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. అనంతరం మెయిన్ సైడ్ డ్రైన్‌లలో జరుగుతున్న పూడికతీత పనులు, కుట్టుశిక్షణ కేంద్రం, సీసీ రోడ్లు, సైడ్‌డ్రైన్ ల నిర్మాణ పనులు పరిశీలించారు.

రేపు పొగాకు రైతుల సదస్సు



సమావేశమైన రైతుసంఘం నాయకులు

ఇంకొల్లు, ఏప్రిల్ 26, (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం రైతులు వద్ద ఉన్న నల్లబర్లీ పొగాకును వెంటనే కొనుగోలు చేయాలని డిమాండు చేస్తూ ఇంకొల్లులో ఈ నెల 28న నిర్వహించనున్న సదస్సును జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా నాయకులు కందిమళ్ల రామ కోటేశ్వరరావు కోరారు. ఇంకొల్లు, సంతరావూరు రైతులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ ప్రాంతం లోని పొగాకు రైతులు అందరూ ఇంకొల్లులో జరగనున్న సదస్సుకు హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు, రైతులు పాల్గొన్నారు.

మాట ఇచ్చారు..నెరవేర్చారు

- మత్స్యకారులకు అందిన భరోసా
- ఆనందంలో గంగపుత్రుల కుటుంబాలు



మత్స్యసంపద ఇతర ప్రాంతాలకు లోడ్ చేస్తున్న మత్స్యకారులు(ఫైల్‌ఫోటో)

చీరాల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : గంగ పుత్రులకు టీడీపీ కూటమితో భరోసా లభించింది. గత ప్రభుత్వం హయాంలో మత్స్యకార భరోసా రూ.10 ప్రకటించి అందులోనూ అనేక కోతలు విధించారు. పైగా అర్హులకు సక్రమంగా భరోసా అందక నానాయాతన పడ్డారు. ఈ క్రమంలో అధికారం చేపట్టిన టీడీపీ ప్రభుత్వం గంగ పుత్రుల కుటుంబాలు కన్నీళ్లు తీరుస్తామని, వేట నిషేధిత సమయంలో అందాల్సిన భరోసాను రూ.20 వేలు చేస్తూ ప్రకటన చేసింది. మాట ఇచ్చిందే తడవుగా శనివారం శ్రీకాకుళం జిల్లాలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొని మత్స్యకారుల సేవలో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈనేపథ్యంలోనే మత్స్యకారుల బ్యాంకు ఖాతాల్లోకి రూ.20 వేలు జమ అయ్యాయి. దీంతో చీరాల పరిధిలోని మత్స్యకారులు ఆనందాలు విరభూశాయి. నియోజకవర్గంలో సుమారు 2వేల మంది అర్హులు ఉన్నారు. దీంతో 'మాట ఇచ్చారు. నెర వేర్చారు...థాంక్యూ సీఎం' అంటూ నినదించారు. అయితే గత ప్రభుత్వం హయాంలో భరోసా అందక అవస్థలు పడిన గంగపుత్రులకు శనివారం తీపి కబురు అందడంతో ఆనందాల్లో ఉన్నారు. జిల్లావ్యాప్తంగా 12,671 మంది మత్స్యకారులుండగా దీనికి సంబంధించి రూ.25.34 కోట్లు విడుదలయ్యాయి.



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మత్స్యకారులు

చినగంజాం : సూపర్‌సిక్స్‌లో ఇచ్చిన హామీలో భాగంగా మత్స్య కారులకు లబ్ధిచేకూరడంతో మండల పరిధిలోని టీడీపీ మత్స్యకార నాయకులు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక టీడీపీ కార్యాలయ ఆవరణలో మండల బీసీ సెల్ అధ్యక్షులు వాటుపల్లి ఏడుకొండలు అధ్యక్షత శనివారం సాయంత్రం నిర్వహించిన కార్యక్రమంలో చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. నాయకులకు, కార్యకర్తలకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏడుకొండలు మాట్లాడుతూ మండల పరిధిలో అత్యధికంగా మత్స్యకార గ్రామాలు ఉన్నట్లు తెలిపారు. మండల పరిధిలో 1090 మంది మత్స్యకారులకు సముద్ర వేట నిషేద సమయంలో ఇచ్చే భృతి రూ.20,000లు వారి బ్యాంకు ఖాతాలకు జమ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పొద వీరయ్య, అబ్దుల్‌కలాంఅజాద్, గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్ రాయని ఆత్మారావు, చెరుకూరి రాఘవయ్య, మత్స్యకార, బీ.సీ సెల్ నాయకులు, పలు గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇది మాకు చక్కని భరోసా



రెండేళ్లుగా భరోసా అందక మత్స్యకార కుటుంబాలు పరిస్థితి దయనీయంగా ఉన్నాయి. అయితే టీడీపీ కూటమి ప్రకటించిన మాదిరిగా శనివారం బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేశారు. ఇదిమాకు చక్కని భరోసా

కొండబాబు, సొసైటీ మాజీ అధ్యక్షులు

గ్రామాభివృద్ధే ధ్యేయంగా ప్రణాళిక

పారిశ్రామికవేత్త, లాయిడ్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఎండీ విక్రం నారాయణరావు



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న విక్రం నారాయణరావు, గ్రామస్థులు

చినగంజాం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి) : గొనసపూడి గ్రామంలోని ప్రతి ఇంటిని భాగస్వాములుగా చేసుకుంటూ గ్రామాన్ని ధనిక గ్రామంగా మార్చడమే తన లక్ష్యమని ప్రముఖ పారిశ్రామికవేత్త, లాయిడ్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఎండీ విక్రం నారాయణరావు అన్నారు. మండలంలోని గొనసపూడి గ్రామంలోని ఆంజనేయస్వామి విగ్రహ ఆవరణలో టీడీపీ మండల అధ్యక్షులు పొద వీరయ్య అధ్యక్షతన శనివారం జరిగిన కార్యక్రమంలో ఆయన గ్రామ ప్రజల అభివృద్ధి ప్రణాళిక బ్రోచర్‌ని గ్రామ పెద్దలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సభలో నారాయణరావు మాట్లాడుతూ తను పుట్టి పెరిగిన గ్రామం మీద అపరిమితం అయిన ఇష్టంతో గ్రామాన్ని అభివృద్ధి చేయాలన్న ఉద్దేశ్యంతో గత రెండు సంవత్సరాల నుంచి తోటి గ్రామస్తులతో అనేక సమాలోచనలు చేస్తున్నట్లు తెలిపారు. వ్యాపారాన్ని మిళితం చేస్తూ గ్రామంలో భూములున్న ప్రతి ఒక్కరిని వ్యాపార భాగస్వాములుగా చేసుకొని గ్రామాన్ని అభివృద్ధి చేయాలన్నదే ముఖ్యోద్దేశ్యమన్నారు. కొత్తకాలువ దిగువ పొలం, కొమ్మమూరు కాలువదిగువ పొలం, అప్పేరు వాగు, డ్రైనేజీ వాగుకి హద్య ఉన్న సూమారు 600 కుటుంబాలకు సంబంధించిన వెయ్యి ఎకరాల భూమిని సేకరించి, అందులో యూనివర్శిటీ, గ్రీన్‌ఫీల్డ్ రిసార్ట్స్, హోటల్స్, ఇండస్ట్రియల్ పార్క్, మినీ ఫిలింసిటీ, విల్లాలు, బహుళ అంతస్తుల భవన సముదాయ నిర్మాణాలు, మల్టీస్పెషాలటీ హాస్పిటల్స్, ఆర్గానిక్ వ్యవసాయంను మిళితం చేస్తూ కొన్ని వేల మందికి విద్యా, వైద్య, ఉద్యోగ, ఉపాధి, వ్యాపార అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ముందుకు పోతున్నట్లు తెలిపారు. భూమి ఇచ్చిన ప్రతి రైతుకి లబ్ధి చేకూరతుందని, వారిని వాటాదారులుగా తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఉగాది పురస్కార గ్రహీతలకు సన్మానం



అరుణను సన్మానిస్తున్న సృజన సభ్యులు

అద్దంకి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): విశ్వావసు ఉగాది పురస్కార గ్రహితలను సృజన ఆధ్వర్యంలో శనివారం రాత్రి ఘనం సత్కరించి సన్మానించారు. స్థానిక కాళికా సమేత కమతేశ్వరస్వామి దేవాలయం ఆవరణ లోని సృజన మండపంలో ముందుగా టెర్రరిస్టుల తూటాలకు బలైన యాత్రికులకు నివాళులు అర్పించారు. ఇటీవల మృతి చెందిన సాహిత్య వేత్తలు లక్ష్మణమూర్తి, ముంగర జాషువాలకు నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో కవయి త్రి తేళ్ల అరుణ, కవులు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, వదలి రాధాకృష్ణ, డాక్టర్ నూనె అంకమ్మరావులను సృజన ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సాహిత్యవేత్తలు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ, సందిరాజు విజయకుమార్, కొండారెడ్డి, చంద్రమోహన్, సృజన, రోటరీక్లబ్ శింగరకొండ, పలు ప్రజాసంఘాల బాధ్యులు దివాకరదత్, చప్పిడి వీరయ్య, వారణాసి రఘురామ శర్మ,పాలపర్తి జ్యోతిష్మతి, లక్కరాజు శ్రీనివాసరావు, వీరవల్లి సుబ్బారావు (రుద్రయ్య), డాక్టర్ దేవపాలన, నిమ్మరాజు నాగేశ్వరరావు, మారం కోటేశ్వరరావు, షేక్ మస్తాన్, పసుమర్తి కోటయ్య, నారాయణం బాలసు బ్రహ్మణ్యం,సందిరెడ్డి శ్రీనివాసరావు, మన్నం త్రిమూర్తులు, జాగర్లమూడి ప్రతాప్, ఆర్ రాఘవరెడ్డి, రాఘవరావు, రఫీ తదితరులు పాల్గొన్నారు.

కిరాయి హంతకులు హైదరాబాదీయులా?

- ఒంగోలులో వారంరోజులు మకాం
- బాయ్‌ని అదుపులోకి తీసుకున్న పోలీసులు

ఒంగోలుక్రైం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): వీరయ్యచౌదరిని హత్య చేసేందుకు కిరాయి హంతకులు ఒంగోలులో వారం రోజులు మకాం వేసినట్లు తెలుస్తోంది. నలుగురు వ్యక్తులు ఒంగోలులోని ఓ హాస్టల్‌లో వారంరోజులు పాటు ఉండి వీరయ్యచౌదరి హత్యకు రెక్కీ నిర్వహించారనే నిర్ధారణకు పోలీసులు వచ్చారు. అదేక్రమంలో ఇసుక వ్యాపారి ఆదేశాల మేరకు ఆ నలుగురికి అవసరమైన సదుపాయాలు ఓ యువకుడు చూశాడు. వారికి అవసరమైన భోజనం, టిఫిన్ ను అందజేశాడు. అతనిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. అంతేకాకుండా హత్య జరిగిన అనంతరం కూడా నిందితులకు ఫోన్ ద్వారా సమాచారం అందించినట్లు తెలుస్తోంది. వారి కోసం పోలీసు బృందాలు హైదరాబాద్ వెళ్లి గాలింపు చర్యలు చేపడుతున్నాయి. అంతేకాకుండా ఈ హత్యకు సంబంధించి కీలక సూత్రదారులు ఎవరు ఉన్నారు అనే కోణంలో పోలీసులు లోతుగా విచారణ చేస్తున్నారు. ఈ కేసులో కీలకంగా మారిన ఇసుక వ్యాపారి దొరికితే సూత్రధారులు ఎవరు పాత్రధారులు ఎంతమంది అనే సమాచారం తెలుస్తుంది.

పోలీసుల అదుపులో వైసీపీ నాయకుడు

నాగులుప్పలపాడు మండలానికి చెందిన కీలక వైసీపీ నాయకుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. గత ప్రభుత్వంలో మండలాన్ని శాసించిన సదరు నాయకుడు ఒంగోలు నివాసం ఉంటాడు. అయితే హత్యకు సంబంధించి కీలక అనుమానితుడైన రేషన్ మాఫియా డాన్‌కు ఆ నాయకుడికి మంచి సంబంధాలు ఉన్నాయి. దాంతో ఆ నాయకుడిపై అనుమానాలు రావడంతో అతనిని పోలీసులు విచారిస్తున్నట్లు తెలిసింది.

ఏడుగురు తహసీల్దార్ల బదిలీ



ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఏడుగురు తహసీల్దార్‌లకు పోస్టింగ్‌లు ఇస్తూ కలెక్టర్ తమీమ్ అన్సారియా శనివారం ఉత్తర్వులు జారీచేశారు. వారిలో నలుగురిని పరిపాలనా సౌలభ్యం కోసం బదిలీ చేశారు. డిప్యూటీ తహసీల్దార్లుగా పనిచేస్తున్న ఇరువురికి అడ్‌హక్ ఉద్యోగోన్నతులు కల్పించారు. మూడు నెలల క్రితం సస్పెండ్ అయిన కనిగిరి తహసీల్దార్‌కు తిరిగి పోస్టింగ్ ఇచ్చారు. సీఎస్‌పురం తహసీల్దార్‌గా పనిచేస్తున్న డి.మంజునాథరెడ్డిని ఎర్రగొండపాలెం, మార్కాపురం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఏవోగా పనిచేస్తున్న కె.రవీంద్రారెడ్డిని సీఎస్‌పురం తహసీల్దార్‌గా బదిలీ చేశారు. కలెక్టరేట్‌లో ల్యాండ్ సెక్షన్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఎస్ఎల్.నారాయణరెడ్డిని మద్దిపాడు తహసీల్దార్‌గా, దొనకొండలో పనిచేస్తున్న జగదీశ్వరరావును కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ జిల్లా ఆడిట్ సూపరింటెండెంట్‌గా నియమించారు. కనిగిరి తహసీల్దార్‌గా పనిచేస్తూ సస్పెన్షన్‌కు గురైన సిహెచ్.అశోక్‌కుమార్‌రెడ్డిని పెండింగ్ విచారణ కింద రాచర్ల తహసీల్దార్‌గా పోస్టింగ్ ఇచ్చారు. హెచ్‌ఎంపాడులో డీటీగా పనిచేస్తున్న కె.కిషోర్‌కుమార్‌ను అడ్‌హక్ ఉద్యోగోన్నతిపై తర్లుపాడు, పొన్నలూరు డీటీగా పనిచేస్తున్న కె.వెంకటేశ్వరరావును పుల్లలచెరువు తహసీల్దార్‌గా నియమించారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

- ఎస్పీ ఆదేశాలతో కదిలిన పోలీసు యంత్రాంగం
- అనుమానితులపై ప్రత్యేక దృష్టి



సూచనలు ఇస్తున్న సీఐ, ఎస్ఐ

పర్చూరు/కారంచేడు(పర్చూరు), ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు, కారంచేడు మండలాల్లో శనివారం పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు పోలీసు యంత్రాంగం ప్రత్యేక డ్రైవ్ చేపట్టింది. అందులో భాగంగా కారంచేడు, పర్చూరు మండలాల పరిధిలో పోలీసు సిబ్బంది ఆయా ప్రధాన రహదారుల్లో వాహనాలను తనిఖీచేశారు. వాహనాలకు సంబంధించిన ధృవీకరణ పత్రాలను పరిశీలించారు. సరైన పత్రాలు లేని వాహనాలను సీజ్‌చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో పర్చూరు, కారంచేడు పోలీసులు పాల్గొన్నారు.

వాహనదారులు సరైన పత్రాలు కలిగి ఉండాలి

ఇంకొల్లు : వాహదారులు సరైనపత్రాలు కలిగి ఉండాలని లేకుంటే వారిపై కేసులు నమోదు చేసి తగుచర్యలు తీసుకుంటామని ఇంకొల్లు సీఐ వై.వి రమణయ్య అన్నారు. బాపట్ల జిల్లా ఎస్పీ తుషారుడూడి ఆదేశాల మేరకు ఇంకొల్లు ప్రత్యేకంగా డ్రైవ్ నిర్వహించారు. బస్టాండు,ప్రధాన కూడళ్లలో వాహనాల తనిఖీ నిర్వహించి వాహనదారులకు సూచనలు చేశారు. వాహనాలకు వాహనం నడుపువారికి లైసెన్సులు తప్పకుండా పొంది ఉండాలని సూచించారు. ప్రయాణికులు దొంగల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. పర్చూరు రోడ్డు,కోణికి రోడ్డులో ఎస్ఐ సురేష్ తమ సిబ్బందితో వాహనాలను తనిఖీ చేశారు.

అలరించిన జాతీయ నాటకోత్సవాలు



నృత్యరూపకాన్ని ప్రదర్శిస్తున్న చిన్నారులు

చీరాల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : కళాంజలి మిత్రమండలి చీరాల వారి ఆధ్వర్యంలో శనివారం రాత్రి పట్టణంలోని కేజీఎం ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఉభయ తెలుగు రాష్ట్రాల జాతీయ నాటకోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సాంస్కృతిక మిత్ర మండలి ప్రతినిధులు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈక్రమంలో రాయని హనుమంతురావు కళావేదిక ఆధ్వర్యంలో శ్రీరామ పట్టాభిషేకం నిర్వహించారు. అనంతరం వర్క్ ఫ్రమ్ హోం హాస్య నాటిక ప్రదర్శించారు. ఆయా పాత్రల్లో కళాకారులు, చిన్నారులు విశేషంగా నటించి అందరిని అలరించారు. అలాగే ఈనెల 30వ తేదీ వరకు ప్రదర్శనలు ఉన్నట్లు ప్రతినిధులు వివరించారు.



శ్రీరామ పట్టాభిషేకంలో సీతారాములు

జేఈఈ కోచింగ్‌కు ఏకలవ్య విద్యార్థులు

పెద్దదోర్నాల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : ఏకలవ్య ఆదర్శ కళాశాలకు చెందిన గిరిజన విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్ ప్రత్యేక శిక్షణ శిబిరానికి ఢిల్లీ వెళ్తున్నట్లు ప్రిన్సిపాల్ ఈశ్వర్‌సింగ్ శనివారం తెలిపారు. కళాశాలకు చెందిన సీహెచ్ నాగలక్ష్మి, బీ మల్లీశ్వరిబాయి, ఎం.అనూబాయి, డీ అనూషబాయి కేంద్ర సంస్థ ఎన్ఈఎస్‌టీ న్యూఢిల్లీ నిర్వహిస్తున్న జేఈఈ అడ్వాన్స్‌డు ప్రత్యేక శిక్షణ శిబిరానికి ఎంపికైనట్లు ఆయన తెలిపారు.

అల్లరి మాయం.. సెల్ మయం

(5వ పేజీ తరువాయి)

మానసిక వైద్య నిపుణులు చెప్తున్నారు. పట్టణాల్లోనే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో ఉండే చిన్నారులు కూడా సెల్‌ఫోన్లకు బానిసలయ్యారు. పైగా తమ పిల్లవాడు అల్లరి చేయకుండా బుద్ధిగా ఉంటాడని వాడికి ఫోను ఉంటే చాలని తల్లిదండ్రులే గొప్పగా చెప్పుకుంటున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఏడిస్తే.. అన్నం తినకపోతేనే చేతికి ఫోన్లు ఇవ్వడం మానేసి ఎత్తుకు తిప్పుతూ బయట ప్రపంచాన్ని పరిచయం చేయాలి. ఖాళీ సమయాల్లో వారిని ఇతర పిల్లల మధ్యలో గడిపేలా చేయాలి. అల్లరి అనేది పిల్లల్లకు ఏది తినాలో, వేటితో ఆడుకోవాలో, చేతుల్లోనివి ఇతరులకు పంచడం, చిన్న వ్యూహాలు వంటి విషయాలను నేర్పుతుంది. ఇలాంటి చర్యల వల్ల మెదడులో అన్ని నాడీకణాలు చురుగ్గా పనిచేస్తాయి. మట్టిలో ఆడుకున్నా ఏ ప్రమాదం ఉండదని మన బాల్యం మనకు నేర్పిన సంగతులు పిల్లలకు అర్థమయ్యేలా చేయాలి.

ఇలా గుర్తించాలి..

ఒత్తిడికి లోనైన పిల్లల ప్రవర్తన వయస్సుల వారీగా విభిన్నంగా ఉంటుంది. స్క్రీన్‌టైమ్‌కు బానిసలై ఒత్తిడికి లోనైన మూడేళ్ల నుంచి ఆరేళ్ల మధ్యవయస్సు గలిగిన పిల్లలు తమకు బాగా దగ్గరివారిని, ఇష్టమైన వస్తువులను అలాగే పట్టుకుని కూర్చుంటారు. ఈ ప్రవర్తన సాధారణం కంటే భిన్నంగా ఉంటుంది. ఆహారం తీసుకోవడం, నిద్రపోయే సమయాల్లో కూడా వేళలు పాటించరు. ఒక్కోసారి నిద్రలో లేని కాసేపు నవ్వడమో.. ఎడవడమో చేసి ఆ తర్వాత తిరిగి నిద్రకు ఉపక్రమిస్తారు. ఎక్కువ భయపడటం, మారం చేయడం, పెద్దవారితో వాదించడం, ఆటలు ఆడకపోవడం వంటి లక్షణాలు కనబడితే జాగ్రత్త పడితే మంచిది.

పెద్దల్లో నెలకొన్న భయాలు

చిన్నారులపై జరుగుతున్న లైంగిక దాడులు, కిడ్నాప్‌లు వంటి భయాలతో చాలామంది తల్లిదండ్రులు పిల్లలను బయటకు తీసుకురావడానికి బయపడి ఇంటికే పరిమితం చేస్తున్నారు. బయటకు తీసుకెళ్లిన సమయంలో పిల్లల అల్లరి చూడటానికి కూర్చోగలం గాని వారిపై దాడి జరుగుతుందన్న భయంతో కూర్చోలేం గదా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జరుగుతున్న ఘటనలు చూసి అసలు వారికి ఏ వయస్సు నుంచి రక్షణ కల్పించాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. తమ పిల్లలు ఇతర పిల్లలతో కలసి ఆడుకోవాలని తమకు ఉంటుందని కానీ ఏ సమయంలో ఏం జరుగుతుందో అని అర్థం గాక ఇంట్లోనే ఉంచుకుంటున్నామని తల్లిదండ్రులు చెబుతున్నారు.

సమాజంతో మమేకం కావాలి

ఊహ తెలిసిన నాటి నుంచి పిల్లలకు సమాజంతో సంబంధాలు ఏర్పరచాలి. జ్ఞానాన్ని సంపాదించాలంటే సమాజంతో మమేకం తప్ప మరే మార్గంలేదు. టీవీలకు అతుక్కుపోతున్నారు అనుకునే లోపే జీవితాల్లోకి ఫోన్లు, ట్యాబ్‌లు వచ్చాయి. ఒక విధంగా చెప్పాలంటే ప్రస్తుత తరానికి ఇవి శాపంలా మారాయి. వీటి వల్ల అంత చిన్న పిల్లలకు పెద్దగా ఒరిగేది ఏమి లేకపోయినా శారీరక, మానసిక వ్యాధుల భారిన పడతారు. పెద్దలకు, సమాజానికి దూరంగా ఉంటారు. ఊబకాయం, తలనొప్పి, కంటి చూపు మందగించడం వంటి వాటి గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు.

డాక్టర్ జీ సతీష్‌కుమార్,
సివిల్ సర్జన్, ఆర్ఎమ్‌వో జీజీహెచ్ గుంటూరు

పెద్దలే కారణం

పిల్లల్లో నెలకొన్న సమస్యలకు పెద్దవారే కారణం. మానసిక, ఉద్వేగాత్మక సంతోషం, సత్సంబంధాలు కొరవడిన కుటుంబం జైలు లాంటిది. వస్తు సంపద కోసం వెచ్చించడం మాని పిల్లలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దే బాధ్యతను తీసుకోవాలి. చిన్న వయస్సులో ఆటలకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఎట్టి పరిస్థితుల్లో స్మార్ట్‌ఫోన్‌కు దూరం చేయాలి.

వి.వెంకటకిరణ్, మానసిక వైద్య నిపుణుడు,
అసిస్టెంట్ ప్రొఫెసర్, గుంటూరు వైద్య కళాశాల

అవీ..ఇవీ..

భూసార పరీక్షలతో పంట దిగుబడి అంచనా


మట్టి నామూనాలు సేకరిస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

తోటవారిపాలెం(చీరాల), ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) భూసార పరీక్షలతో పంట దిగుబడి అంచనా వేయవచ్చని ఏవో సుమతి పేర్కొన్నారు. శనివారం తోటవారిపాలెం గ్రామంలో సిబ్బందితో కలిసి భూసార పరీక్షలు నిర్వహించారు. అలాగే వేరుశనగ, మిర్చి పంటలను పరిశీలించి పచ్చ పురుగు నివారణ చర్యలను వివరించారు. అనంతరం రైతుసేవా కేంద్రాల్లో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ యాంత్రీకరణ పథకంతో 50 శాతం రాయితీతో పనిముట్లు అందుకోవచ్చని వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

చలివేంద్రాలతో ప్రయాణికులకు మేలు


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీఐ సుబ్బారావు

చీరాల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : ప్రధాన కూడళ్లు, బస్టాండ్లలో చలివేంద్రాల ఏర్పాటు ద్వారా ప్రయాణికులకు ఎంతో మేలు జరుగుతుందని వన్‌టౌన్ సీఐ సూరేపల్లి సుబ్బారావు పేర్కొన్నారు. శనివారం కేజీఎం స్కూల్ సమీపంలోని మహాలక్ష్మమ్మ చెట్టు సమీపంలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. మే 31 వరకు మజ్జిగ పంపిణీ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పోలుదాసు రామకృష్ణ, గురు ప్రసాద్, నారాయణమూర్తి, రమేష్, సుభాషిణి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పహల్గాంలో ఉగ్రదాడి అత్యంత హేయం



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు

చీరాల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : కశ్మీర్‌లోని పహల్గాంలో అమాయక ప్రజానీకాన్ని 28 మందిని హత మార్చిన దుర్ఘటన అత్యంత హేయమని చీరాల ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు పేర్కొన్నారు. దాడిని ముక్త కంఠంతో ఖండించారు. ఈ సందర్భంగా శనివారం స్వచ్ఛందంగా దుకాణాలు మూసి శాంతి ర్యాలీ నిర్వహించారు. ముందుగా ఎంజీసీ మార్కెట్‌లోని మహాత్మాగాంధీ విగ్రహానికి నివాళులు అర్పించారు. అనంతరం ర్యాలీగా గడియార స్తంభం కూడలికి చేరుకొని మానవహారం నిర్వహించారు. మధ్యాహ్నం యధావిధిగా దుకాణాలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు తులాబంధు సురేష్, చిన్ని లీలాధరరావు, వేముల చంద్రశేఖర్, శీరాం వేణుగోపాల్, శ్రీమన్నారాయణ, కిషోర్, శైలేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో...

అద్దంకి : జమ్ముకాశ్మీర్‌లోని పెహల్‌గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి చేయటం హేయనీయం అని ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్(ఏపీయూడబ్ల్యూజే) జిల్లా అధ్యక్షుడు చెన్నుపాటి రాంబాబు, అద్దంకి పట్టణ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మన్నం త్రిమూర్తులు అన్నారు. ఆంధ్ర ప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్(ఏపీయూడబ్ల్యూజే) అద్దంకి శాఖ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జమ్ముకాశ్మీర్‌లో యాత్రికులపై ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ శనివారం రాత్రి అద్దంకి పట్టణంలోని బంగ్లా రోడ్డులోని అంబేడ్కర్ బొమ్మ వద్ద నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు శాంతి ర్యాలీ, కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నేతలు ధర్మవరపు దుర్గాప్రసాద్, గడ్డమడుగు మురళీ, నరిశెట్టి నాగేశ్వరరావు, అడుసుమల్లి సోమా శ్రీనివాసరావు, సుభాష్‌చంద్రబోస్, చిక్కాల కొండలరావు, మందా వేణు, రావూరి శ్రీనివాసరావు,దూళిపాళ్ళ శివ, ఫణికుమార్, అనిల్, శింగయ్య, విష్ణు, హరికృష్ణ, శామ్యూల్, విజయ్, ప్రజా సంఘాల నేతలు శేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణాలకు అనుమతులు సులభతరం


చీరాల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరిలో జీవో నెం.20 ప్రకటించిందని తద్వారా సులభంగా, వేగంగా భవన నిర్మాణాలకు సంబంధించి అనుమతులు అందుకోవచ్చని మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్ ఒక ప్రకటనలో తెలిపారు. అనుమతులకు సంబంధించి, అలాగే ఐటిఐ, డిప్లమా, బీటెక్ అభ్యర్థులు ఇంజనీర్, సర్వేయర్‌లుగా లైసెన్సులు పొందేందుకు కార్యాలయంలోని హెల్ప్ డెస్క్ విభాగంలో సంప్రదించాలని కమిషనర్ తెలిపారు.

నేడు ఉచిత మెగా కంటి వైద్యశిబిరం

మార్టూరు,ఏప్రిల్26(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఏలూరి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శంకర కంటి ఆస్పత్రి సహకారంతో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం ఏర్పాటుచేసినట్లు క్యాంపు కార్యాలయ ప్రతినిధులు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మార్టూరు ప్రాంత ప్రజానీకం ఈ అవకాశాన్ని సద్వినియోగపరచుకోవాలని వారు తమ ప్రకటనలో కోరారు.

దళిత కాలనీల్లోని పాఠశాలలను కాపాడండి

● ఎంఈవోకు ఎస్సీకాలనీవాసుల వినతి


ఎంఈవోకు వినతిపత్రం ఇస్తున్న బొబ్బేపల్లి ఎస్సీకాలనీ వాసులు

మార్టూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): దళిత కాలనీల్లోని పాఠశాలలను నిర్వీర్యం చేయరాదని మండల మాదిగ ఉద్యోగుల సమాఖ్య కోరింది. శనివారం మండలంలోని బొబ్బేపల్లి గ్రామంలోని పడమర ఎస్సీకాలనీ వాసులు మార్టూరులో ఆ మేరకు ఎంఈవో వస్రాంనాయక్‌కు వినతిపత్రం అందజేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో వెలువడిన జీవో నంబరు 117ను అమలుచేయగా ప్రాథమిక పాఠశాలలోని 3, 4, 5 తరగతులను సమీపంలోని ఉన్నత పాఠశాలల్లో విలీనం చేశారన్నారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం 117 జీవోను సవరణ చేయగా ఉన్నతపాఠశాలల్లో కలిపిన 3, 4, 5 తరగతులను యధావిధిగా పూర్వస్థితి ప్రాథమిక పాఠశాలల్లోకి చేరాన్నారు. కానీ మండలంలోని బొబ్బేపల్లి ఎస్సీ ప్రాథమిక పాఠశాలకు ఉన్నత పాఠశాల నుండి రావలసిన3, 4, 5 తరగతులను రానివ్వకుండా చేస్తున్నారన్నారు. ఈ విషయమై పూర్తి స్థాయిలో విచారించి, దళితవాడల్లోని పాఠశాలలను బతికించాలని కోరారు.

పౌష్టికాహారంతోనే బంగారుబాల్యం

● అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషణ్ పక్వాడపై జోరుగా ప్రచారం ● పక్కాగా అమలు చేస్తే అన్నింటిలో మిన్న


అంగన్‌వాడీ కేంద్రంలో ఉన్న చిన్నారులు

చీరాల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : తల్లులు, పిల్లలు ఆరోగ్యమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోషణ్ పక్వాడ మాసోత్సవాలు ఈ నెల 8వ తేదీ నుండి 22 వరకు నిర్వహించారు. ఇందులో భాగంగా అంగన్‌వాడీల్లో ఉన్న పిల్లలకు ఆరోగ్యం అందించే విధంగా పోషకాలు ఇవ్వడమే కాకుండా, 5 సంవత్స రాలు పూర్తి చేసుకున్న చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించే విధంగా కృషి చేయాలని ఇప్పటికే అధికారులు సూచించారు.

జిల్లా 1,888 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఆయా అంగన్‌వాడీకేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యను పూర్తి చేసుకొన్న చిన్నారలను గుర్తించి పాఠశాలలో చేరే విధంగా అంగన్‌వాడీ కార్యకర్తలే పర్యవేక్షించాల్సి ఉంది. పూర్వ ప్రాథమిక విద్యను పూర్తి చేసుకొన్న చిన్నారులపై దృష్టిసారించి ఇప్పటికే సంబంధిత సిబ్బంది ఎలిమెంటరీ స్కూల్లో ప్రవేశాలకు ప్రచారాలు ప్రారంభించారు.

తల్లిదండ్రుల అయిష్టత

అయితే కొన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లి, బిడ్డల పట్ల పూర్తిస్థాయిలో నిర్లక్ష్యం ఉంటోంది.. వారి పర్యవేక్షణలో చిత్తశుద్ధి లేకపోవడంతో తల్లిదండ్రులు ప్రైవేటు విద్యాసంస్థలపై మక్కువ చూపుతున్నారు. దీంతో ఆటపాటలతో సాగాల్సిన చిన్నారుల బాల్యం ఒత్తిడితో సాగుతోంది. విద్యాభ్యాసంలో యాంత్రికత పిల్లలకు భవిష్యత్తులో మానసిక రుగ్మతలను తెచ్చిపెడుతోంది. తద్వారా ఆటపాటలు లేక సక్రమమైన ఆహారం అందక చిన్నతనంలో బాలలు అనారోగ్యం కొనితెచ్చుకుంటున్నారు. ఈక్రమంలో ఇటీవల అధికారులు ప్రజా ప్రయోజనాలపై ప్రత్యేక దృష్టి సారించారు. రెండు రకాల యాప్‌లను అందుబాటు లోకి తెచ్చారు. మహిళలు గర్భం దాల్చిన నాటి నుంచే తల్లి, బిడ్డల ఆరోగ్యంపై దృష్టిసారించారు. అలాగే ఐదేళ్ల పిల్లలను కూడా ప్రభుత్వ ఎలిమెంటరీ స్కూళ్లకు చేర్చి విద్యతో పాటు ఆరోగ్యం ఉండాలనే నినాదంతో ప్రభుత్వం ముందుకు సాగుతుంది.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆరోగ్య పరిరక్షణ



ప్రభుత్వం నుండి తల్లి, బిడ్డలకు బలమైన ఆహారం అందించే విధంగా ముందుకు సాగుతున్నాము. తద్వారా తల్లిబిడ్డల ఆరోగ్యాన్ని పర్యవేక్షిస్తున్నాము. గర్భిణులకు ఎస్పీ కిట్ ద్వారా రైద పిండి, అటుకులు, బెల్లం, ఖర్జూరం అందిస్తున్నాము. 25 గుడ్లు, రైస్, కందిపప్పు, వంటనూనె, పాలు అందిస్తున్నాము. ఏడు నెలల చిన్నారి నుండి మూడేళ్ల వరకు బాలామృతం, గుడ్లు సకాలంలో అందిస్తున్నాము. చిన్నారులు, తల్లులు ఉత్సాహంగా పాల్గొంటారు. **ఇంద్రాణి, అంగన్‌వాడీ టీచర్, చీరాల అర్బన్**

ఒత్తిడితో పెరిగిన పిల్లల్లో ఎదుగుదల లోపం



ప్రస్తుతం చిన్నారుల్లో అధికశాతం మంది రెడీమేడ్ ఆహారానికి చేరువ అవుతున్నారు. తల్లిదండ్రుల పని భారం, లేక ఇతర కారణాలతో చిరుతిండిపైనే దృష్టి సారిస్తున్నారు. తద్వారా శారీరక ధృడత్వం ఉండదు. పైగా చిన్న వయస్సులోనే అనారోగ్యం బారిన పడుతున్నారు. పిల్లలు మంచి భవిష్యత్తు ఉండాలంటే ప్రారంభం నుండే బలమైన ఆహారం అందాలి. ఆట పాటలు ఉండాలి. అప్పుడే చక్కటి శరీర సౌష్టవం ఉంటుంది. **తిరుమలశెట్టి ఝాన్సీ, సీడీపీవో, వేటపాలెం ప్రాజెక్టు**

అంగన్‌వాడీ కేంద్రాలపై నిత్యం పర్యవేక్షణ



గత పరిస్థితులను అధిగమించి ప్రస్తు తం జిల్లా పరిధిలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలను ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నాం. తల్లీబిడ్డను ఆరోగ్యంగా ఉంచేందుకు ఉన్నత అధికారుల నుంచి కచ్చితమైన ఆదేశాలు ఉన్నాయి. అలాగే పోషకాహారం అందించ డంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి. ఎక్కడయినా లోపాలు గుర్తిస్తే చర్యలు తీసుకుంటాము. **దొనకొండ రాధామాధవి, ఐసీడీఎస్ పీడీ, బాపట్ల**

ఆ రోడ్డులో ప్రయాణం భయానకం

గతుకుల దారితో కొత్తపేట వాసుల అవస్థలు


అధ్వానంగా ఉన్న రోడ్డు అంచులు

కొత్తపేట(చీరాల), ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : ఆ రోడ్డులో నిత్యం వేల సంఖ్యలో వాహనాలు ప్రయాణాలు సాగిస్తుంటాయి. అత్యవసర వైద్యం కోసం ఒంగోలుకు, చీరాల వైపుకు ప్రయాణించే 108 వాహనాలు సైతం పదులు సంఖ్యలో రవాణా సాగిస్తాయి. అయినా ఆ రోడ్డు మాత్రం అధ్వానంగా ఉంది. ఇది 216 జాతీయ రహదారి నుండి కొత్తపేట ప్రధాన రహదారి. దాదాపుగా చీరాల ఏరియా హాస్పిటల్ సమీపం నుంచి జాతీయ రహదారి వరకు కొత్తపేట పరిధిలోని ప్రధాన రహదారి దాదాపుగా శిథిలావస్థకు చేరుకొంది. అసలే సింగిల్ రోడ్డు, పైగా రోడ్డంతా గుంతల మయం, దీంతో రామాపురం. పాపాయిపాలెం ప్రాంతాలకు చెందిన ప్రజలు పట్టణానికి రాకపోకలు సాగించాలంటే విసుగు చెందాల్సిందే. అంతేకాకుండా జాతీయ రహదారితో పాటు, రామాపురం ఇతర ప్రాంతాల్లో యాక్సిడెంట్ కేసులు, వివిధ అత్యవసర వైద్య సేవలు పొందాల్సిన వారితో పాటు, ఒకవేళ చీరాల నుంచి అత్యవసరంగా మెరుగైన వైద్యం కోసం ఒంగోలుకు తరలాలన్నా నరకం అనుభవించాల్సిందే. దీంతో ప్రజలు తీవ్రయాతన పడుతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి రహదారి మరమ్మతులు చేపట్టాలని వేడుకుంటున్నారు.



తక్కువ వేగంతో ప్రయాణిస్తున్న అంబులెన్స్

కిశోర బాలికలకు వేసవి తరగతులు

బల్లికురవ. ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో 11 ఏళ్ల నుంచి 18 ఏళ్ల లోపు ఉన్న కిశోర బాలికలకు వేసవి తరగతులు నిర్వహించేలా ప్రభుత్వం చర్యలు తీసుకొంటోందని ఐసీడీఎస్ సూపర్ వైజర్లు సలోమి, మీరాబి, విజయనిర్మల తెలిపారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో కిశోర వికాసం కింద వేసవిలో ప్రత్యేక తరగతుల నిర్వహణపై సమావేశం నిర్వహించారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు అన్ని గ్రామాలలో బాలికలను గ్రుపులుగా విభజించి వారికి తరగతుల నిర్వహణతో పాటు బాల్య వివాహాల వలన కలుగు నష్టాల గురించి వివరించాలన్నారు. మే 2 వ తేది నుండి జూన్ 15 వరకు ఈ తరగతులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సచివాలయ మహిళ పోలీసు, అంగన్ వాడీ కార్యకర్త, ఏఎన్ఎంలు ఈ టీంలో ఉంటారని తెలిపారు. ఈ సమావేశంలో వైద్యాధికారి రవితేజ, తదితరులు పాల్గొన్నారు.

అర్బన్ హెల్త్ సెంటర్ పూర్తి

● త్వరలో ప్రారంభించనున్న మంత్రి రవికుమార్


పట్టణంలోని రేణింగవరం రోడ్డులో నిర్మాణం పూర్తయిన యూహెచ్‌సీ

అద్దంకి, ఏప్రిల్26 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వ సహకారంతో నిర్మిస్తున్న అర్బన్ హెల్త్‌సెంటర్ భవనం నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయి. అద్దంకి పట్టణంలోని రేణింగవరం రోడ్డులో సుమారు రూ.1.50 కోట్లలతో నిర్మిస్తున్న కాకానిపాలెం అర్బన్ హెల్త్ సెంటర్‌కు సంబంధించిన పనులు 95 శాతానికి పైగా పూర్తయ్యాయి. మే నెల మొదటి వారంలో విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చేతుల మీదగా, కాకానిపాలెం అర్బన్ హెల్త్‌సెంటర్ భవనం ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించేందుకు మున్సిపల్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో కొత్త భవనంలో అద్దంకి పట్టణ ప్రజలకు వైద్యసేవలు అందుబాటులోకి రానున్నాయి.

ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందన


విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న హెచ్‌ఎం

చినగంజాం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెదగంజాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షా ఫలితాలలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్.ఎం.డి.నారాయణరెడ్డి ఆధ్వర్యంలో శనివారం అభినందన సభ నిర్వహించారు. 500 మార్కులు పైగా సాధించిన 13 మంది బాలబాలికలకు పుష్ప గుచ్ఛాలు, స్వీట్స్, పెన్నులు అందజేసి అభినందనలు తెలిపారు. షేక్ షరీఫ్ 576/600, ఎం.హర్షిత 569, ఎం.రాజ్‌కుమార్-565, ఎం.సంతోష్-550, ఎం.చంద్రిక-536, జి.దుర్గభవాని-533, వి.శ్రీవల్లి -530, కే.శ్రీలత-517 మార్కులు సాధించినట్లు తెలిపారు. అభినందన కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం, ఉపాధ్యాయులు బి.నాగేశ్వరరావు, బి.చెంచారెడ్డి, పి.బ్రహ్మయ్య, ఎ.సుబ్బరాజు, ఎన్..రమణ మూర్తి, కమలహాసన్, వెంకటేశ్వర్లు, పీ.డీ. అనిల్‌కుమార్, ఎస్‌ఎంసీ చైర్మన్ ఎ.సుదర్శనరెడ్డి, బీమారెడ్డిలు పాల్గొన్నారు.

కష్టపడి చదివితేనే ఫలితం


షబానాను సత్కరిస్తున్న విద్యాశాఖాధికారులు

ఇంకొల్లు, ఏప్రిల్ 26, (ఆంధ్రజ్యోతి) విద్యార్థులు కష్టపడి చదివితే ఫలితం తధ్యమని ఎంఈవోలు అజయ్ కుమార్, శ్రీనివాసరావు అన్నారు. మండల విద్యావనరుల కేంద్రంలో ఈ ఏడాది పదిఫలితాల్లో మండలం ప్రథమ ర్యాంకు సాధించిన స్థానిక ఆదర్శహైస్కూల్ విద్యార్థిని షేక్ షబానాను, కరెస్పాండెంట్ తోటకూర విజయభాస్కర్‌ను శాలువాతో సత్కరించారు. కష్టపడి చదివి 593 మార్కులు సాధించడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో షబానా తండ్రి జానీబాష, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బస్ సౌకర్యం కల్పించండి

పంగులూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): తమ గ్రామాలకు బస్‌సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నామని, ప్రజా అవసరాలను గుర్తించి వెంటనే బస్ ఏర్పాటు చేయాలని చినమల్లవరం, కల్లంవారిపాలెం, బూదవాడ గ్రామాల ప్రజలు వేడుకుంటున్నారు. వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రమైన పంగులూరుకు చేరుకోవాలంటే ఆటోలకు అధిక మొత్తంలో చార్జీలు చెల్లించాల్సి వస్తోందన్నారు. వివిధ పనుల నిమిత్తం వెలుగు కార్యాలయానికి చేరుకునేందుకు, బ్యాంక్ కార్యకలాపాల నిమిత్తం డ్వాక్రా మహిళలు మండలానికి చేరుకునేందుకు వాహన వసతి లేక నడిచి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. నిత్యం మండల కేంద్రంతో పాటు అద్దంకి, ఇతర ప్రాంతాలకు విద్య, వైద్య అవసరాలతో పాటు ఇతర పనుల నిమిత్తం వెళ్లేందుకు జాతీయ రహదారికి చేరుకోవాలన్నా బస్‌వసతి లేక ఇబ్బంది పడుతున్నామని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ గ్రామాలకు బస్ వసతి విషయమై మంత్రివర్యులు గొట్టిపాటి రవికుమార్ తమ వినతిని స్వీకరించి ఆర్టీసీ అధికారులకు ఆదేశాలిచ్చినా అద్దంకి డిపో అధికారులు కాలయాపన చేస్తున్నారని బూదవాడ టీడీపీ నేత కొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మూడు గ్రామాల ప్రజా అవసరాలను గుర్తించి ఆర్టీసీ. అధికారులు తమ గ్రామాలకు వెంటనే బస్ సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

విశ్రాంత ఉద్యోగుల నూతన కార్యవర్గం ఎన్నిక


ప్రమాణం చేస్తున్న నూతన కార్యవర్గం

అద్దంకి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం అద్దంకి శాఖ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక గీతా మందిరంలో శనివారం షేక్ మస్తాన్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. అనంతరం యర్రగుంట కృష్ణమూర్తి, యు.వి. గోపాలరావు, తగిరిశ వీరాంజనేయులు పర్యవేక్షణలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడు గా అడుసుమల్లి అనంతకోటేశ్వరరావు, కార్యదర్శి గా నిమ్మరాజు నాగేశ్వరరావు, కోశాధికారిగా వారణాసి రఘురామశర్మ, అసోసియేట్ అధ్యక్షులుగా న ర్రా గోపాల రావు, పల్లపు ఆంజనేయులు, గౌరవ అధ్యక్షుడిగా కె.దేవ సహాయం, ఉపాధ్యక్షులు గా ఎ ప్రభాకరరావు, పొన్నపల్లి బ్రహ్మానందం, పల్నాటి జయ రాణి,ఆకుల చిన్నయోగయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శి గా పెండ్యాల అంకయ్య అవుల చినరామచంద్రారెడ్డి, చూకూరి మోహనరావులను ఏక గ్రీవంగా ఎన్నుకోగా ప్రమాణ స్వీకారం చేశారు. సమావేశంలో సందిరెడ్డి వెంకటేశ్వర్లు, డాక్టర్ యు.దేవపాలన, చెన్నుపాటి రామాంజనేయులు, జ్యోతి చంద్రమౌళి, మోపర్తి వెంకటరావు, తాతయ్య, వేణుగోపాలరావు, తదితరులు పాల్గొన్నారు.

30న మున్సిపల్ సాధారణ సమావేశం

అద్దంకి, ఏప్రిల్26 (ఆంధ్రజ్యోతి): అద్దంకి మున్సిపల్ సాధారణ సమావేశం బుధవారం ఉదయం 11 గంటలకు చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ అధ్యక్షతన కౌన్సిల్ హాల్‌లో జరుగుతుందని కమీషనర్ రవీం ద్ర తెలిపారు. 26 అంశాల అజెండా తో సమావేశం జరుగుతుందని తెలిపారు.

కనులపండువగా రంగనాథ కల్యాణం


రంగనాథస్వామి ఉత్సవమూర్తి, వీరాంజనేయస్వామికి ఆకుపూజ చేస్తున్న అర్చకులు, పొంగళ్లు వండుతున్న మహిళలు

మార్టూరు, ఏప్రిల్26(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇసుకదర్శి కూడలి సమీపంలోని జాతీయరహదారి ప్రక్కన ఉన్న శ్రీరంగనాధస్వామి దేవస్థానం 30వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం సుదర్శన వెంకట రంగనాథస్వామి శ్రీదేవి భూదేవి సమేత శాంతి కల్యాణం వైభవంగా నిర్వహించారు. దేవస్థానం ప్రధాన అర్చకులు శ్రీనివాస నరసింహ అయ్యవార్లు ఆధ్వర్యంలో స్వామి వారి శాంతి కళ్యాణాన్ని భక్తుల సమక్షంలో, భక్తులు కనులారా తిలకిస్తుండగా నిర్వహించారు. ఉదయం 9 గంటలకు జరిగిన స్వామి వారి కల్యాణాన్ని తిలకించేందుకు మార్టూరు, ఇసుకదర్శి, కోనంకి, జొన్నతాళి గ్రామాల నుంచి భక్తులు ముఖ్యంగా మహిళలు విశేషంగా తరలివచ్చారు. ఈ సందర్భంగా మహిళలు ధ్వజస్తంభం వద్ద కొబ్బరికాయలు కొట్టి, స్వామి వారిని శాంతి కళ్యాణాన్ని తిలకించారు. అనంతరం భక్తులకు భారీగా అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం దేవస్థానాన్ని విద్యుత్ దీపాలంకరణతో అందంగా తీర్చిదిద్దారు. కోలాటం, రంగులరాట్నాలతో వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. జాతీయరహదారి పక్కన దేవస్థానం ఉండడంతో రోడ్డుదాటే భక్తులు ఎలాంటి రోడ్డు ప్రమాదాలకు గురికాకుండా ఏఎస్ఐ భాషా ఆధ్వర్యంలో పోలీసులు ట్రాఫిక్‌ను పర్యవేక్షిస్తూ, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బందోబస్తు నిర్వహించారు.

ఈశాన్య రామాలయంలో 16 రోజుల పండుగ

పునఃప్రతిష్ట చేసిన మార్టూరు లోని ఈశాన్య రామాలయంలో శనివారం సీతారాముల కళ్యాణం 16 రోజుల పండుగను నిర్వహించారు. ఒంటిమెట్టలోని రామాలయంలో సీతారాముల కల్యాణం నిర్వహించిన రోజు ఈశాన్య రామాలయంలో స్వామి కల్యాణం నిర్వహించారు. దీంతో శనివారం 16 రోజుల పండుగను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. తరువాత భక్తులకు అన్నప్రసాదవితరణ చేశారు.

బల్లికురవ : మండలంలోని పెద అంబడిపూడి గ్రామంలోని వీరాంజనేయస్వామి వార్షిక తిరునాళ్ల శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుండి భక్తులు పెద్దఎత్తున వీరాంజనేయస్వామి వారిని దర్శించుకొని ఆకు పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ పూజారి గుడిమెళ్ల పవన్ శాస్త్రి స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరునాళ్ల సందర్భంగా మహిళ భక్తులు పొంగళ్ళు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. పెదఅంబడిపూడి, చిన అంబడిపూడి, కొమ్మినేనివారిపాలెం, గుంటుపల్లి, వల్లాపల్లి తదితర గ్రామాల నుండి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి తిరునాళ్లను వీక్షించారు. అనంతరం దేవాలయ కమిటీ తరపున అన్నదాన కార్యక్రమాన్ని రాత్రి వరకు నిర్వహించారు.

రెండు విద్యుత్ ప్రభల ఏర్పాటు

వీరాంజనేయస్వామి తిరునాళ్ల సందర్భంగా చిన అంబడిపూడి, పెదఅంబడిపూడి గ్రామాలకు చెందిన టీడీపీ నేతలు రెండు విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేశారు. దేవాలయ కమిటీ తరపున పాటకచేరీని ఏర్పాటు చేశారు. ప్రభలపై పాటకచేరీలు ప్రజలను అలరించాయి. గతంలో ఎన్నడూలేని విధంగా ఈసారి రెండు విద్యుత్ ప్రభలను తిరునాళ్లలో టీడీపీ నేతలు ఏర్పాటు చేయడంపై భక్తులు హర్షం వ్యక్తం చేశారు. ప్రభల ఏర్పాట్లను టీడీపీ నేతలు కిలారి వెంకట్రావు, దద్దాల అంజయ్య, విజయ్, నాయుడు, బొట్లగుంట వేణుబాబు, వైస్ సర్పంచ్ జాష్టి బ్రహ్మాలు దగ్గర ఉండి పర్యవేక్షించారు. సీఐ వెంకట్రావు, బల్లికురవ ఎస్ఐ నాగరాజులు భద్రతను పర్యవేక్షించారు.

రేపటి నుంచి వేసవి విజ్ఞాన శిబిరం

చినగంజాం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, రాష్ట్ర పౌర గ్రంథాలయశాఖవారి ఆధ్వర్యంలో శాఖ గ్రంథాలయంలో ఈ నెల 28వ తేదీ నుంచి జూన్ 6వ తేదీ వరకు వేసవి విజ్ఞాన శిక్షణా శిబిరం నిర్వహించనున్నట్లు గ్రంథపాలకులు ఎ.మోహనలక్ష్మీనరసింహాచార్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 28 నుంచి ప్రారంభమయ్యే వేసవి విజ్ఞాన శిబిరంలో 6వ తరగతి నుండి 10వ తరగతి విద్యార్థుల వరకు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. శిక్షణా కార్యక్రమంలో విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీషు, కంప్యూటర్స్, తెలుగు బోధనా పద్ధతులు, వివిధ సృజనాత్మక అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ కార్యక్రమం పూర్తిగా ఉచితమని, విద్యార్థులు ఈ సదవాకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని గ్రంథపాలకులు కోరారు.

ఉష్ణోగ్రత వివరాలు

కేంద్రం	గరిష్టం	కనిష్టం
నెల్లూరు	37.5	28
కావలి	37	28
ఆత్మకూరు	47	28
ఉదయగిరి	40	26
కందుకూరు	37	28

మైనార్టీ కార్పొరేషన్లకు
పూర్వ వైభవం

- ఉపాధి కల్పనకు రుణాల మంజూరు
- ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (హరనాధపురం) ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : మైనార్టీ కార్పొరేషన్లకు నిధులు మంజూరు చేసి, ఆయా వర్గాలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం పూనుకుంది. ఆయా కార్పొరేషన్లలో ముస్లిం, క్రిష్టియన్ మైనార్టీల ఆర్థిక అభివృద్ధి కోసం ప్రత్యేక రుణ పథకాలను ప్రవేశపెట్టింది. స్వయం ఉపాధిని ప్రోత్సహిం చడమే లక్ష్యంగా రుణాలు మంజూరు చేయనున్నట్లు ప్రకటించింది. 2011 జనాభా లెక్కల ప్రకారం జిల్లాలో 2,64,886 మంది ముస్లింలు, 21,373 మంది క్రిష్టియన్లు, 588 మంది సిక్కులు, 168 మంది బౌద్ధులు, 2,294 మంది జైనులు ఉన్నారు. అయితే 2011 తర్వాత వారి సంఖ్య మూడింతలుగా పెరిగినట్లు సమాచారం. వీరంతా ప్రభుత్వం అందించే ఉపాధి పథకాల కోసం ఎదురుచూస్తున్నారు.

● రుణాల వివరాలు..



జిల్లా మైనారిటీస్ కార్పొరేషన్ కార్యాలయం

ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీలకు ఇస్తున్న రుణాలు రూ.లక్ష నుంచి 8లక్షల వరకు ఉన్నాయి. రూ.1 లక్ష రుణంతో కిరాణా దుకాణాలు, చెప్పుల దుకాణాలు, బట్టల దుకాణాలు తదితరాలు ఏర్పాటు చేసుకునే వీలుంది. రూ.లక్ష నుంచి 5లక్షలలోపు రుణాలతో ఆటోలు, కార్లు ఇతర వాహనాలు కొనుగోలు చేసుకుని ఉపాధి పొందొచ్చు. రూ.5 లక్షల నుంచి 8లక్షలలోపు రుణాలతో మెడికల్ షాపులు, జిమ్ వంటి ఫిట్నెస్ సెంటర్లు తదితరాలు ఏర్పాటు చేసుకుని ఉపాధి పొందే అవకాశం ఉంది. స్లాబుల వారీగా ఈ రుణాలను మంజూరు చేస్తారు. రూ.లక్ష రుణాన్ని స్లాబ్ వన్ కింద అందజేస్తారు. ఇందులో యూనిట్ ఏర్పాటుకు 50 శాతం సబ్సిడీ ఉంటుంది. 2వ స్లాబ్‌లో రూ.లక్ష నుంచి రూ.3లక్షలలోపు రుణాలు ఇస్తారు. ఇందులో యూనిట్ కాస్ట్ మీద రూ.1.25 లక్షల సబ్సిడీ ఉంటుంది. రూ.3 లక్షల నుంచి 5లోల రుణాలకు యూనిట్ కాస్ట్ మీద రూ.2లక్షల సబ్సిడీ ఇస్తారు. రూ.5లక్షల నుంచి 8లక్షలలోపు రుణాలకు 50శాతం సబ్సిడీ ఉంటుంది. బీఫార్మశీ, డీఫార్మశీ చేసిన మైనార్టీ యువత ఈ రుణాలు వినియోగించుకోవచ్చు. పట్టణ ప్రాంతాల్లో రూ.2లక్షలలోపు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షల లోపు ఆదాయం ఉన్నవారు దరఖాస్తు చేసుకోనే అవకాశం ఉంది. సబ్సిడీ రుణాల కోసం ఏపీ ఓబీఎంఎంఎస్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునే ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. మైనార్టీలు అంటే ముస్లిం, క్రిష్టియన్లు, బౌద్ధులు, సిక్కులు, జైన్‌లు, పార్సీలు అని పేర్కొంది.

రుణాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలి



మైనార్టీ కార్పొరేషన్ ద్వారా మైనార్టీ యువత సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు రిజిస్టర్ చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది ఏపీ ఓబీఎం ఎంఎస్ వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలి. 21 నుంచి 50 సంవత్స రాల మధ్య వయసున్న అర్హులు దరఖాస్తు చేసుకోవాలి. స్లాబ్‌ల వారీగా ఎన్ని యూనిట్లు కేటాయిస్తారనేది త్వరలో తెలియజేస్తాం.

- షేక్.హైఫా, జిల్లా మైనార్టీస్, కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్



పోలీసులు అరెస్ట్ చేసిన సైబర్ నేరగాళ్లు వీరే!

మాటలే పెట్టుబడి..
చేసేదంతా బురిడీ!

'మీ స్తోమతను బట్టి నగదును పెట్టుబడిగా పెట్టండి. ఎక్కువ ఆదాయం పొందండి.' అంటూ ఫోన్‌లో అమాయకులను మాయ మాటలతో నమ్మిస్తారు. వీరిని నమ్మి నగదు జమ చేశాక.. ఇదిగో మీ పెట్టుబడికి ఇదీ లాభం అంటూ కొంత నగదును జమ చేసి మరీ ఖాతాలో చూపిస్తారు. ఇలా పలు మార్లు లావాదేవీలు నడిపాక పెద్దమొత్తంలో పెట్టుబడి పెడితే రూ.కోట్లు సంపాదించ వచ్చని నమ్మబలుకుతారు. నిజమే కదా అని.. రూ.లక్షలు జమచేశాక.. రూ.కోట్ల లాభం వచ్చినట్టు ఖాతాలో చూపిస్తారు. తీరా నగదు డ్రా చేసుకునేందుకు వెళితే రాదు. ఇలా ప్రజలను నమ్మించి రూ.కోట్లు దోచేస్తున్న ఓ అంతర్రాష్ట్ర సైబర్ నేరగాళ్ల ముఠాను నెల్లూరు పోలీసులు అరెస్ట్ చేశారు. కేసు పూర్వాప రాలను, నిందితుల వివరాలను శనివారం నగరంలోని ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ కృష్ణకాంత్ విలేకరులకు వెల్లడించారు.

- నెల్లూరు (క్రైం, ఆంధ్రజ్యోతి)

- సైబర్ నేరగాళ్ల గుట్టు రట్టు
- చిన్నబజారు స్టేషన్‌లో మహిళ ఫిర్యాదుతో వెలుగులోకి..
- ప్రత్యేక బృందాలతో కేసు దర్యాప్తు
- నకిలీ గుర్తింపుతో 236 బ్యాంకు ఖాతాలు
- 36 ఖాతాలపై 436 ఫిర్యాదులు
- ఏడుగురు నిందితుల అరెస్ట్.. నగదు, ఫోన్లు ఇతర సామగ్రి స్వాధీనం
- ప్రధాన సూత్రధారి రాజస్థాన్ వాసి

నెల్లూరులోని పొగతోటకు చెందిన లలితకు ఇన్‌స్టాగ్రామ్‌లో ఆన్‌లైన్ మార్కెటింగ్‌కు సంబంధించిన ఓ లింక్ రావడంతో ఆమె క్లిక్ చేసింది. వెంటనే లలిత వాట్సప్ నెంబర్‌కు నిషాబసు అనే మహిళ మెసేజ్ చేసి ఆన్‌లైన్ మార్కెటింగ్‌కు సంబంధించిన సూచనలు, సలహాలు ఇచ్చి లాభాలు వచ్చేలా చేస్తామని నమ్మించి ఓ యాప్‌ను ఇన్‌స్టాల్ చేయించింది. షేర్ కొనుగోలుకు కొంత నగదు వేయించుకొని ఆదాయం వచ్చిందని పలుమార్లు చెబుతూ నమ్మించింది. పెద్ద మొత్తంలో పెట్టుబడి పెడితే రెట్టింపు ఆదాయం వస్తుందని చెప్పడంతో లలిత అప్పుచేసి మరీ జనవరి 23 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు పలు దఫాలుగా రూ.2,46,30,396 డిపాజిట్ చేశారు. ఖాతాలో రూ.4,02,24,759 నగదు ఉన్నట్లు సైబర్ నేరగాళ్లు లలితకు చూపించారు. ఆ నగదు డ్రా చేసుకొనేందుకు ప్రయత్నించగా రాకపోవడంతో మోసపోయానని గ్రహించిన లలిత గత నెల 9వ తేదీన చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

● మూడు రాష్ట్రాల్లో శోధన

ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి దర్యాప్తును వేగవంతం చేశారు. రోజుల తరబడి ప్రత్యేక బృందాలు తమిళనాడులోని చెన్నై, తెలంగాణలోని హైదరాబాదు, రాజస్థాన్ ప్రాంతాల్లో దర్యాప్తు చేపట్టాయి. బాధిత మహిళ డిపాజిట్ చేసిన బ్యాంకు ఖాతాల ఆధారంగా నిందితులు రాజస్థాన్‌కు చెందిన రామారామ్, ఈయన అనుచరులైన గోగారామ్, హేమంత్‌కుమార్, కైలాష్, నాగారాం, తెలంగాణా రాష్ట్రానికి చెందిన వీరేశ్వరరావు, ఎం రవిలుగా గుర్తించి, ఈ నెల 25వ తేదీన ఐదుగురిని, శనివారం ఇద్దరిని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.2 లక్షల నగదు, 50 మొబైళ్లు, ఏటీఎం కార్డులు, ప్రింటర్ ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. నిందితుల బ్యాంకు ఖాతాల్లోని రూ.39 లక్షలు నగదు ఫ్రీజ్ చేయాలని బ్యాంకు అధికారులను ఆదేశించారు.

● అంతా నకిలీలతోనే..

రాజస్థాన్‌కు చెందిన ప్రధాన నిందితుడు రామారామ్ కొంతమంది యువకులకు వేతనంతోపాటు భారీగా కమీషన్లు ఇచ్చి నియమించుకున్నారు. వీరు నకిలీ ఆధార్, పాన్ కార్డులను సృష్టించి వాటి ద్వారా బ్యాంకు ఖాతాలను ఓపెన్ చేస్తారు. బయోమెట్రిక్ ధ్రువీకరణ అవసరం లేని రోడ్‌సైడ్ సేల్ పాయింట్ల నుంచి డీ-కేవైసీ ద్వారా సిమ్ కార్డులను పొందుతారు. బ్యాంకు అధికారులను సంప్రదించి ఈ నకలీ పత్రాలను ఉపయోగించి కరెంట్ ఖాతాలను ప్రారంభిస్తారు. బ్యాంక్ ఖాతా పాస్‌బుక్‌లను కొరియర్ ద్వారా రాజస్థాన్‌లోని రామారామ్‌కు పంపుతారు. ఎస్ఎంఎస్ ఏపీకే ఫైల్‌ను ఇన్‌స్టాల్ చేయడం ద్వారా బ్యాంకు లింక్ చేయబడిన ఫోన్ నెంబర్లను వేర్వేరు మొబైళ్లలో ఉంచి సులభంగా యాక్సెస్ చేయడానికి అన్నిటినీ ల్యాప్‌టాప్‌కు కనెక్ట్ చేశారు. ప్రధాన సూత్రదారి రామారామ్ నిందితులకు నెలకు రూ.15 వేల నుంచి 20 వేలు జీతం, కరెంట్ ఖాతా తెరవడానికి రూ.లక్ష కమీషన్, పొదుపు ఖాతా తెరవడానికి రూ.20 వేలు కమీషన్ ఇస్తాడు. ఇలా నాలుగు నెలల క్రితం చెన్నైలో శివమెటల్ కార్పొరేషన్, సూర్యా ఇన్‌ఫెక్స్ తదితర పేర్లతో సైబర్ సామ్రాజ్యాన్ని ఏర్పాటు చేశారు. షేర్ మార్కెట్‌లో నగదు పెడితే అధిక ఆదాయం వస్తుందని అమాయక ప్రజలకు ఫోన్లు చేసి నమ్మించి కరెంట్ అకౌంట్లలో నగదు వేయించుకొని మోసాలకు పాల్పడుతున్నారు. పోలీసుల విచారణలో ఇప్పటివరకు 236 బ్యాంక్ ఖాతాలలో 36 ఖాతాల మీద 436 ఫిర్యాదులు ఎస్సీఆర్పీ పోర్టల్‌లో నమోదైనట్లు ఎస్పీ కృష్ణకాంత్ తెలిపారు. ప్రపంచంలో ఎవరికీ ఏమీ ఊరికే రావని, ఎవరూ ఊరికే ఇవ్వరన్న విషయాన్ని ప్రజలు గ్రహించి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన చిన్నబజారు ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు, సైబర్ క్రైమ్ సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐలు అయ్యప్ప, శ్రీనివాసరెడ్డి, ఏఎస్ఐ జి శ్రీహరి, హెడ్‌కానిస్టేబుళ్లు, తదితరులను ఎస్పీ అభినందించి రివార్డులు అందించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ సీహెచ్ సౌజన్య, నగర డీఎస్పీ పి సింధుప్రియ తదితరులు పాల్గొన్నారు.



గిరిజనుల డబ్బులకు
లెక్కేది!?

- రాపూరులో భారీగా సబ్‌ప్లాన్ నిధులు పక్కదారి
- డీఆర్‌డీఏ ఉద్యోగులే తినేసినట్లు నిర్ధారణ
- నెల రోజుల క్రితం నోటీసులతో సరి
- థర్డ్ పార్టీ విచారణతోనే మరిన్ని వాస్తవాలు

గిరిజనుల నిధులు దుర్వినియోగం చేశారని తేలింది.. కానీ నెల రోజులు గడిచినా ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఇంటి దొంగలే ఈ అక్రమాలకు పాల్పడ్డారని నిర్ధారణ అయినా నోటీసులతో సరిపెట్టారు. తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోకపోవడం అటుంచితే కనీసం పక్కదారి పట్టిన నిధులను రికవరీ చేద్దామన్న ఆలోచన కూడా కనిపించడం లేదు. నోరు లేని గిరిజనులే కదా అన్న ధైర్యమా!? లేదా తమను అడిగే ధైర్యం ఎవరికి ఉందన్న ధీమానో తెలియదు కానీ డీఆర్‌డీఏ అధికారులు వ్యవహరిస్తున్న తీరు తీవ్ర విమర్శలకు తావిస్తోంది. రాపూరు మండలంలోని యానాదుల సమాఖ్యల్లో జరిగిన అక్రమాలు వెలుగులోకి వచ్చినా ఇంత వరకూ ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు.

8లో..

పాఠ్యపుస్తకాలు వచ్చేశాయోచ్!



నెల్లూరు (విద్య), ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే పాఠ్య పుస్తకాలు నెల్లూరులోని గోదా ముకు చేరుతున్నా యని డీఈఓ బాలాజీరావు ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి 1 నుంచి 10వతరగతి వరకు 10,23,718 పాఠ్యపుస్తకాలు వస్తున్నాయని పేర్కొన్నారు. శనివారం నుంచి ఆర్టీసీ బస్సుల ద్వారా మండల కేంద్రాలకు తరలిస్తున్నామని, పాఠశాలలు తెరిచే నాటికి పాఠ్యపుస్తకాలన్నీ ఇవ్వనున్నట్లు తెలిపారు.



మత్స్యకారులకు చెక్కు అందిస్తున్న మత్స్య శాఖ జేడీ నాగేశ్వరరావు తదితరులు

12,239 మంది మత్స్యకారులకు
రూ.24.47 కోట్ల జమ

నెల్లూరు (వ్యవసాయం), ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): 'మత్స్యకారుల సేవలో' పథకం ద్వారా జిల్లాలోని 12,239 మంది మత్స్యకారులకు రూ.24,47,80,000 నగదు జమ చేసినట్లు మత్స్య శాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ నాగేశ్వరరావు తెలిపారు. శనివారం శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెం నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు మత్స్యకార సేవలో పథకాన్ని ప్రారంభించారు. నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణం నుంచి జిల్లా అధికారులు, నేతలు, మత్స్యకారులు వర్చువల్‌గా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ సముద్రంలో వేట నిషేధం సందర్భంగా మత్స్యకారుల జీవన భృతికి రూ.20వేలు చొప్పున ప్రభుత్వం అందించిందని చెప్పారు. కావలిలో 4778 మందికి, కోవూరులో 3102, సర్వేపల్లిలో 1887, కందుకూరులో 2472 మందికి ఒక్కొక్కరికి రూ.20వేలు చొప్పున వారి బ్యాంకు ఖాతాల్లో జమచేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మత్స్య శాఖ అధికారులు చాన్ బాషా, శ్రీనివాసులు, మత్స్యకార సంఘ నేతలు కొండూరు పాలిశెట్టి, పామంజి శేషయ్య, కొమారి విజయమ్మ, రామాని నారాయణ, భక్తాని శ్రీను, ఆవల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అంచనాలు పెంచి..
నిధులు దోచేసి!

- పీఆర్‌లో ఎస్ఎస్ఆర్ రేట్ల మాయాజాలం
- క్వారీ చూపించేది చీమకుర్తి... తోలేది అన్నవరం
- భారీగా కాంట్రాక్టర్లకు ప్రయోజనం
- అధికారుల చేతివాటంతో ప్రభుత్వ ఖజానాకు గండి
- గ్రామీణ లింకురోడ్ల నిర్మాణంలోను నిబంధనలకు పాతర
- లింకురోడ్ల నిర్మాణంలో నిబంధనలకు తూట్లు

కందుకూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీరాజ్ శాఖలో ఎస్ఎస్ఆర్ రేట్లు మాయాజాలం నడుస్తోంది. ప్రభుత్వం ఏదైనా అధికారులు మాత్రం చేతివాటంతో కాంట్రాక్టర్లకు భారీగా లబ్ధి చేకూరుస్తున్నారన్న విమర్శలు వినవస్తున్నాయి. మెటీరియల్ వాస్తవ ధరకు నాలుగు రెట్లు అదనంగా చెల్లించడం ద్వారా కోట్లాది రూపాయల దుర్వినియోగానికి అధికారులు పాల్పడుతున్నారు. కందుకూరు ప్రాంతంలో ఎక్కడ రహదారి పనులు జరిగినా చీమకుర్తి నుంచే మెటల్ తోలాలని నిబంధనతో అక్కడి నుంచి తోలేందుకు అయ్యే ఖర్చును లెక్కించి యూనిట్‌కు రూ.12వేలకు పైగా అధికారులు చెల్లిస్తున్నారు. అయితే నిజంగా చీమకుర్తి నుంచే తోలినా యూనిట్ విలువ రూ.4వేలకు మించదు. పోనీ అభివృద్ధి పనులకు వాడే మెటల్, వెట్‌మిక్స్‌లను చీమకుర్తి నుంచి తోలుతున్నారా అంటే అదీనూలేదు. రాళ్లపాడు రిజర్వాయరుకు సమీపంలో ఉన్న కొండాపురం మండలం అన్నవరం క్వారీ నుంచే అధిక శాతం మెటీరియల్ తోలుతున్నారు. అతి కొద్దిశాతం కాంట్రాక్టర్లు మాత్రమే చీమకుర్తి నుంచి తోలుతుండటం విశేషం. చీమకుర్తి నుంచి తోలినా వాస్తవ ధరకన్నా మూడురెట్లు అదనంగా చెల్లిస్తున్నారు. ఇక అన్నవరం నుంచి తోలేవారికైతే యూనిట్ రూ.2500లోపే సైట్‌లోకి చేరుస్తుండటంతో వాస్తవధరకన్నా రమారమి 4రెట్లు అదనంగా చెల్లిస్తున్న పరిస్థితి. ఇదే రీతిలో వెట్‌మిక్స్‌లోను భారీగా నిధుల దోపిడీ జరుగుతోంది. ఇటీవల నిర్మించిన తిమ్మారెడ్డిపాలెం - అయ్యవారిపల్లి రోడ్డుకు దాదాపు 110 కిలోమీటర్ల దూరంలో ఉన్న చీమకుర్తి క్వారీని అధికారులు చూపించగా కాంట్రాక్టరు మాత్రం పనిప్రదేశం నుంచి కేవలం 20 కిలోమీటర్లలో ఉన్న అన్నవరం నుంచి మెటల్, వెట్‌మిక్స్ తోలి పనికానిచ్చేశారు. అన్నవరం క్వారీ మెటీరియల్ చీమకుర్తితో పోలిస్తే నాణ్యతగా ఉండదని కూడా చెబుతారు. అయినా అధికారులు ఇవన్నీ మామూలే అన్నట్లు పనులు కానిచ్చేయడంతో రూ.7 కోట్ల విలువైన ఆ ఒక్క పనిలోనే కాంట్రాక్టరుకు 2 కోట్లకుపైగా లబ్ధి చేకూరినట్లు సమాచారం. అలాగే ఇటీవల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో మంజూరైన గ్రామీణ లింకురోడ్లను సిమెంటు రోడ్లుగా అభివృద్ధి చేసే పనుల్లోనూ ఇదేతంతు నడిచింది.

ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద కందుకూరు నియోజకవర్గంలో నిర్మిస్తున్న గ్రామీణ లింకురోడ్ల నిర్మాణంలో నిర్దేశిత నాణ్యతాప్రమాణాలు పాటించటం లేదనే విమర్శలు ఉన్నాయి. ఇటీవల ఎన్‌హెచ్ 167బీ నుంచి మహదేవపురం, ఎన్‌హెచ్ 167బీనుంచి పలుకూరు, పోకూరు - శింగమనేనిపల్లి, కళవళ్ల - వీఆర్ కోట, ఎన్‌హెచ్ 167బీ నుంచి రోళ్లపాడు, ఎన్‌హెచ్ 167బీ నుంచి కొండసముద్రం గ్రామాలకు, కేజీటీ రోడ్డు నుంచి కేజీటీరోడ్డు వయా కొండముడుసుపాలెం ఎస్సీ కాలనీ రోడ్డును రమారమి రూ.11 కోట్ల వ్యయంతో పనులు చేయగా ఒక్క కొండసముద్రం రోడ్డు మినహా మిగిలిన రోడ్లన్నీ పూర్తయ్యాయని అధికారులు ఎం బుక్‌లు నమోదు చేశారు. అయితే ఈ రోడ్లలో ఏ ఒక్క రోడ్డులోను సైడ్‌బర్మ్‌లకు గ్రావెల్ తోలలేదు. రోడ్డు నిర్మాణం జరిగాక సైడు కాలువల్లోని మట్టిని ఎత్తి బర్మ్‌లలో పోసివదిలేశారు కానీ కనీసం రోలింగ్‌కూడా చేయలేదు. దీంతో రోడ్డు మార్జిన్ దిగితే ద్విచక్రవాహనదారులు స్కిడ్ అయి పడిపోతున్న దుస్థితి. భవిష్యత్తులో వర్షాలు కురిస్తే మరింత ఇబ్బంది అవుతుందని ఆయా గ్రామాల ప్రజలు విమర్శిస్తున్నారు. ఇక కొన్నిచోట్ల నిధులు కేటాయింపులోను అధికారులు కాంట్రాక్టర్ల ప్రభావంతో అధిక అంచనాలు వేసి అవసరం లేని పనులు చేయించిన పరిస్థితి. మహదేవపురం రోడ్డు కేవలం 1.5 కిలోమీటర్లు కాగా దానికి 1.5 కోట్లు కేటా యిస్తూ అంచనాలు రూపొందించిన అధికా రులు ప్రతిచేనుకు అప్రోచ్‌లు వేయించటం విశేషం. పోనీ అవి నిర్దేశిత ప్రమాణాలతో అన్నా వేయించారా అంటే తూతూమంత్రంగా వేసి కొలతలు నమోదుచేశారు.



మహదేవపురం రోడ్డులో పొలాల్లోకి నాసిరకంగా అప్రోచ్‌లు వేసిన దృశ్యం



తిమ్మారెడ్డిపాలెం - అయ్యవారిపల్లి రోడ్డుకు అన్నవరం క్వారీనుంచి తోలిన మెటల్, వెట్‌మిక్స్ (ఫైల్)

● ఇక కళవళ్ల నుంచి వీఆర్ కోటకు తారురోడ్డు నిర్మాణానికి రూ.2 కోట్లు ఖర్చవుతుందని అంచనాలు రూపొందించి టెండర్లు పిలిచిన అధికారులు తీరా సగందూరం మాత్రమే పనిచేయించి నిధులు ఖర్చయిపోయాయనిపించటం విమర్శలకు తావిస్తోంది.

● అలాగే పోకూరు - శింగమనేనిపల్లి రోడ్డుదీ ఇదే పరిస్థితి. పోకూరు నుంచి సింగమనేనిపల్లికి తారురోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు కాగా పోకూరు వైపు 300 మీటర్లు, శింగమనేనిపల్లి వైపు 700 మీటర్లు వదిలేసి నిధులు ఖర్చయిపోయాయని బిల్లులు చేసేయడం విశేషం. అలాగే ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో గ్రామాలలో నిర్మించిన సిమెంటు రోడ్లదీ ఇదే పరిస్థితి. ఎక్కడా బర్మ్‌లకు గ్రావెల్‌తోలిన దాఖలాలు లేకపోయినా అధికారులు ఆ బిల్లులు కూడా పూర్తిచేసేయటం విశేషం. ఉన్నతాధికారులు పరిస్థితిని పరిశీలించి బర్మ్‌ల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	112
స్కిన్ చికెన్	204
స్కిన్‌లెస్	224

కోడిగుడ్ల ధర (100): 425

7 నుంచి వేణుగోపాలుడి బ్రహ్మోత్సవాలు

ఉలవపాడు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఉలవపాడులో వెలసియున్న రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు మే 7 నుంచి 17వ తేదీ వరకు జరుగుతాయని దేవస్థానం కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీనివాసులు, ఆలయ ధర్మకర్త సుధీష్‌చంద్రారెడ్డిలు ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీవారు పుర వీధుల్లో ఊరేగింపు జరుగుతుందని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ ఏడాది రథోత్సవం నిర్వహించడం లేదని పేర్కొన్నారు. మిగిలిన వాహన సేవలు, సాంస్కృతిక కార్యక్రమాలు యధావిధిగా జరుగుతాయన్నారు. శతాబ్ధం కాలం పైబడిన స్వామివారి రథం కలప పూర్తిగా దెబ్బతిన్నందున ప్రమాద సంఘటనలు జరిగే అవకాశాలు ఉన్నాయని ఎండోమెంట్ విభాగం సాంకేతిక నిపుణులు రథం పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదించారని తెలిపారు. దీంతో దేవాదాయ ధర్మాదాయ శాఖ శ్రేయోభి నిధి నుంచి రూ.80 లక్షలు నిధులు నూతన రథం తయారీకి మంజూరు చేశారని పేర్కొన్నారు. ఆన్‌లైన్ టెండర్ ప్రక్రియ కూడా పూర్తి అయిందని, త్వరలోనే నూతన రథం నిర్మాణ పనులు మొదలు పెట్టనున్నట్లు తెలిపారు.

న్యూస్ బాక్స్

మాలకొండ ఆదాయం రూ.9,36,412

వలేటివారిపాలెం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామికి శనివారం భక్తుల నుంచి రూ.9,36,412 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ కే.వీ సాగర్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. అష్టోత్తరం టిక్కెట్‌లు రూ.6,300, కుంకుమార్చనకు రూ.16,280, వివాహములకు రూ.2 వేలు, తలనీలాలకు రూ. 55,825, వాహనపూజలకు రూ. 3,160, ప్రత్యేకదర్శనానికి రూ.3,51,400, స్థలపురాణం పుస్తకాలు విక్రయం ద్వారా రూ.280, రూముఅద్దెలు రూ.31,910, కవర్లుకు రూ.8,700, లడ్డూప్రసాదంకు రూ.2,02,195, అన్నదానానికి రూ.2,57,132, విరాళములు రూ.1,230 వచ్చిందని తెలిపారు.

పాలీసెట్ హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలి

కందుకూరు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశం కోసం ఈనెల 30న నిర్వహిస్తున్న పాలీసెట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థినీ విద్యార్థులు రాష్ట్రప్రభుత్వ అధికారిక పాలీసెట్ వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకుని పరీక్ష కేంద్రాలకు రావాలని స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ షేక్ రియాజుద్దీన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే పాలిటెక్నిక్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌ను సంప్రదించి పరిష్కరించుకోవాలని తెలిపారు. 30న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్ష జరుగుతుందని అభ్యర్థులు ఉదయం 9 గంటలకే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని పేర్కొన్నారు.

ఆలయాల్లో చోరీకి యత్నం

బిట్రగుంట, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ ఇబ్రహీంపేటలో శుక్రవారం రాత్రి లోకో రామాలయ ప్రాంగణంలోని పరమేశ్వరుడు, పార్వతి దేవి ఆలయాల గ్రిల్‌కు వేసి ఉన్న తాళాలను విరుగకొట్టి చోరీకి యత్నం చేశారు. అలికిడి వినిన ఆలయ పూజారి నరేష్ ఆచార్యులు బయటకు రావడంతో దొంగలు పరార్ అయ్యారు. అలాగే బోగోలు పాత ఆంధ్రాబ్యాంక్ సమీపంలో ఉంచిన బైక్‌ను చోరీ చేశారు. ఈ విషయమై ఎస్‌ఐ భోజ్యను వివరాలు కోరగా బైక్ చోరీపై ఫిర్యాదు వచ్చిందని, విచారణ చేస్తున్నామని తెలిపారు.

పశువుల నీటితొట్టె నిర్మాణం పూర్తి

కొండాపురం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని గానుగపెంట పంచాయతీ ఆదిమూర్తిపురంలో వేసవిలో పశువుల దాహార్తిని తీర్చేందుకు ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం ద్వారా చేపట్టిన నీటితొట్టె నిర్మాణం పూర్తయింది. ఈసందర్భంగా గ్రామ టీడీపీ నాయకుడు జాగర్లమూడి శ్రీనివాసులు మాట్లాడుతూ మూగజీవాలు, పశువులు వేసవిలో నీటి కోసం ఎలాంటి ఇబ్బంది ఉండకూడదనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం నీటి తొట్టెలను ఏర్పాటు చేస్తుందన్నారు. ఇందులో భాగంగా ఆదిమూర్తిపురంలో రూ.30 వేలతో నీటితొట్టెను నిర్మించి శనివారం అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో ఐతా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రేపు పుస్తకావిష్కరణ

కందుకూరు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఇండియాలో ఇప్పుడేం చేయాలి అన్న పుస్తకావిష్కరణ సభ ఈనెల 28న పట్టణంలోని స్వర్ణ ప్యాలెస్‌లో జరుగుతుందని సాహిత్యాభిమానులు, చరిత్రాభిమానులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ఏపీడీ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు గేరా చిరంజీవి కోరారు. స్థానిక అంబేద్కర్ విగ్రహం సెంటర్‌లో పుస్తకావిష్కరణ కరపత్రాలను శనివారం ఆయన ఆవిష్కరించారు.

తండ్రి మందలించాడని బాలిక ఆత్మహత్య

● ఆలస్యంగా వెలుగులోకి...

కొండాపురం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): కొండాపురం ఎస్సీ కాలనీలో తండ్రి మందలించాడని మనస్తాపానికి గురైన రావూరి సుప్రియ(11) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. కాలనీకి చెందిన రావూరి ఆనంద్, భార్య మాధవి కుటుంబ కలహాల నేపథ్యంలో 5 ఏళ్ల నుంచి వేర్వేరుగా ఉంటున్నారు. వీరికి ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. తల్లివద్ద ఉంటున్న కుమార్తె సెలవులకు బుధవారం తండ్రి వద్దకు వచ్చింది. గురువారం ఆనంద్ ఆధార్ సెంటర్‌కు వెళుతుండగా తాను వస్తానని కుమార్తె పట్టుబట్టింది. దీంతో తండ్రి మందలించాడు. అతను తిరిగి ఇంటికివచ్చేసరికి సుప్రియ ఇంట్లో రాడ్డుకు చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషయం తెలుసుకున్న తల్లి మాధవి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కలిగిరి సీఐ వెంకట నారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులు తవ్వేస్తున్నారు..!

లింగసముద్రం మండలంలోని సాగునీటి చెరువులను మట్టి, గ్రావెల్ మాఫియా, రియల్టర్లు కుళ్ల బొడిసేస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా రేయింబవళ్లు ఎక్స్‌కవేటర్లతో తవ్వి ట్రాక్టర్లతో యథేచ్ఛగా అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. ఇక్కడ తవ్విన మట్టి, గ్రావెల్‌ను లేఅవుట్లకు తరలిస్తూ లక్షలు గడిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. దీంతో చెరువుల్లో ఎక్కడ పడితే అక్కడ పెద్ద పెద్ద గోతులు ఏర్పడుతుండడంతో సాగునీటికి ఇబ్బందులు తప్పవని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా మామూళ్ల మత్తులో పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

- లింగసముద్రం,(ఆంధ్రజ్యోతి)



పెదపవని చెరువులో ఎక్స్‌కవేటర్‌తో మట్టి తవ్వడంతో ఏర్పడిన గుంతలు

- యథేచ్ఛగా మట్టి, గ్రావెల్ అక్రమ రవాణా
- లేఅవుట్లకు తరలిస్తున్న వైనం
- పెద్ద పెద్ద గోతులతో మారుతున్న రూపురేఖలు
- సాగునీటి ఇబ్బందులు తప్పవని రైతుల ఆందోళన
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

మండలంలోని పెదపవని, చినపవని, లింగసముద్రం, మొగిలిచెర్ల, మాలకొండ రాయునిపాలెం తదితర గ్రామాల్లోని చెరువుల్లో మట్టి, గ్రావెల్‌ను అక్రమార్కులు జోరుగా తరలిస్తున్నారు. ముఖ్యంగా పెదపవని, లింగసముద్రం గ్రామాల్లోని చెరువుల్లో గ్రావెల్‌ను ఎక్స్‌కవేటర్‌లతో తవ్వి, ట్రాక్టర్‌ల ద్వారా వెంచర్లకు తరలిస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్ గ్రావెల్‌ను రూ.500 నుంచి రూ.600 విక్రయిస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా పెదపవనిలో పగలు రాత్రి కూడా చెరువులోని గ్రావెల్‌ను జోరుగా వెంచర్లకు తరలిస్తున్నారు. లింగసముద్రంలోని కొత్త చెరువులో సెలవు దినాలు, ఆదివారాల్లో గ్రావెల్‌ను తవ్వి వెంచర్లకు, ఇళ్ల వద్ద మెరక పేరుతో తరలిస్తున్నారు. చెరువుల్లోని మట్టి, గ్రావెల్‌ను ఎలాంటి అనుమతులు లేకుండా తవ్వి తరలిస్తూ అక్రమార్కులు సొమ్ము చేసుకుంటూ ప్రభుత్వానికి సీనరేజ్ కూడా చెల్లించకుండా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. ఈ విషయమై మైనర్ ఇరిగేషన్ ఏఈ త్రివిక్రమ్‌ను వివరణ కోరగా అనుమతులు లేకుండా చెరువుల్లో మట్టి, గ్రావెల్ తవ్వి తరలిస్తే కేసులు నమోదు చేయించి, వాహనాలు సీజ్ చేయిస్తామని హెచ్చరించారు.

శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు

● ఎం.నారాయణ, ఎస్‌ఐ, లింగసముద్రం



లింగసముద్రం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. తాను వచ్చి నెల రోజుల్లో మండలంలోని అన్ని గ్రామాలను సందర్శించాను. అన్ని రాజకీయ పార్టీల నాయకులకు పోలీసులతో మమేకమై శాంతిభద్రతలకు సహకరించాలని కోరాను. నేరాల నియంత్రణకు, నేరస్థులను పట్టుకొనేందుకు ఇప్పటికే కొన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం.

? శాంతిభద్రతల పరిరక్షణ, జూదాల నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

! గ్రామాల్లో పర్యటించి స్థానిక రాజకీయ పార్టీల నాయకులతో శాంతిభద్రతలపై చర్చించాను. పోలీసులకు సహరించకుండా శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. పేకాట, కోడి పందేలపై నిఘా పెట్టాం. పేకాట స్థావరాలపై దాడులు చేసి 17 మందిని అరెస్ట్ చేశాం. అసాంఘిక కార్యకలాపాలపై పూర్తిగా నిఘా ఉంచాం.

? నేరాల నియంత్రణకు తీసుకున్న చర్యలు ఏమిటి.

! నేరాల నియంత్రణకు గ్రామ నాయకుల సహకారంతో కొన్ని గ్రామాల్లో 53 సీసీ కెమెరా లు ఏర్పాటు చేశాం. మరికొన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుకు కృషి చేస్తున్నాం. ఒక్కో కానిస్టేబుల్‌కు కొన్ని గ్రామాలను కేటాయించి సమగ్ర సమాచారం సేకరిస్తున్నాం.

? డ్రంక్ అండ్ డ్రైవ్, మైనర్లు వాహనాలు నడపడంపై చర్యలు తీసుకుంటారా.

! డ్రంక్ అండ్ డ్రైవ్‌పై కఠిన చర్యలు తీసుకుంటున్నాం. నిత్యం దాడులు చేపడం ద్వారా ఈ నెల రోజుల్లో 15 మందిపై కేసులు నమోదు చేశాం. మైనర్లు వాహనాలు నడపడాన్ని గుర్తించాం. అందుకు ముందుగా వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చాం. అదే మళ్లీ మళ్లీ కొనసాగితే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

? లింగసముద్రం బస్టాండ్ సెంటర్‌లో ట్రాఫిక్ సమస్యపై చర్యలేమిటి.

! బస్టాండ్ సెంటర్‌లో రోడ్డుకు ఆనించి వాహనాలు నిలిపితే వారిపై జరిమానాలు విధిస్తున్నాము. ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. దీనికి ప్రజలు, వ్యాపారులు సహకరించాలి.

పేకాట స్థావరంపై దాడి

కావలి రూరల్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణంలోని బాలకృష్ణారెడ్డి నగర్ శివారులో పేకాట స్థావరంపై శనివారం రూరల్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.1650 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తిరుమలరెడ్డి తెలిపారు.

ఉగ్రవాదుల దాడులు బాధాకరం



కావలిలో అంబేద్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న సీపీఎం, ప్రజాసంఘాల నేతలు

కావలి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదుల దాడులు బాధాకరమని పలువురు నాయకులు పేర్కొన్నారు. కశ్మీర్ ఉగ్రవాద చర్యలను ఖండిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం ట్రంకు రోడ్డులో ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులు వెలిగించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ ఉగ్రవాదులు 28 మంది పర్యాటకులను కాల్చి చంపటాన్ని సీపీఎం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఈ కాల్పులలో కావలి పట్టణానికి చెందిన సోమిశెట్టి మధుసూదనరావు చనిపోవటం చాలా బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు కరువది భాస్కర్, సీపీఎం నాయకులు వై.కృష్ణమోహన్, బీ.రమణయ్య, ప్రజాసంఘాల నాయకులు పీ.వెంకటేశ్వర్లు, మేడ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రదాడికి నిరసనగా ప్రదర్శన

కందుకూరు : పహల్గాంలో జరిగిన ఉగ్రదాడికి నిరసనగా శనివారం సాయంత్రం కందుకూరులో యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన వీధులలో జరిగిన ఈ ర్యాలీలో యూటీఎఫ్ కార్యకర్తలకు సంఘీభావంగా సీఐటీయూ, ఐద్వా ప్రతినిధులు, పెన్షనర్లు ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ సీనియర్ నాయకులు వెంకటేశ్వరరెడ్డి, ముప్పరాజు కోటేశ్వరరావు, సీఐటీయూ నాయకులు మున్వర్‌సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకులపై ఉగ్రమూకల దాడి హేయం

పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రమూకల దాడులు చేసి అమాయకుల ప్రాణాలు తీయటం హేయమైన చర్య అని, మతం పేరుతో ఇలాంటి దాడులు చేయటం అమానవీయం, పిరికిపందల చర్య అని జైభారత్ ముస్లిం రెవల్యూషనరీ ఫోరం కో కన్వీనర్ ఖదిజ్నాసి అబ్దుల్ రహిమాన్ శనివారం ఒక ప్రకటనలో ఖండించారు. మతాన్ని అడ్డుపెట్టుకుని అమాయక ప్రజల మీద చేస్తున్న దాడులను అందరం కలిసి కట్టుగా ఎదుర్కోవాలని, ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా తుదముట్టించటమే భారతీయుల లక్ష్యంకావాలని ఆయన పేర్కొన్నారు. పహల్గాంలో పర్యాటకుల ప్రాణాలను కాపాడేక్రమంలో తన ప్రాణాన్ని సైతం లెక్కచేయకుండా పోరాడిన సయ్యద్ ఆదిల్‌హుస్సేన్ షాకు, ఉగ్రమూకల చేతిలో ప్రాణాలు కోల్పోయిన అమాయక ప్రజలకు ఆయన నివాళులర్పించారు.

కొవ్వొత్తులతో శాంతియుత ర్యాలీ



వలేటివారిపాలెంలో కొవ్వొత్తులతో ర్యాలీ చేస్తున్న విశ్వహిందూ పరిషత్ నాయకులు



కందుకూరులో నిర్వహించిన నిరసన ప్రదర్శనలో పాల్గొన్న యూటీఎఫ్, ఐద్వా నాయకులు, మహిళలు

వలేటివారిపాలెం : కశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడికి నిరసనగా వలేటివారిపాలెంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు ఉప్పుటూరి కొండపనాయుడు ఆధ్వర్యంలో శనివారం శాంతియుత కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కొండపనాయుడు మాట్లాడుతూ ఉగ్రదాడిలో మృతి చెందిన వాళ్లకు నివాళులర్పిస్తున్నట్లు తెలిపారు. దేశసార్వభౌమాధికారం దెబ్బతీసే ఇలాంటి దాడులకు భయపడకుండా ప్రతిఘటించాలని కోరారు. ఉగ్రదాడిలో మృతి చెందిన కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తునట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ ప్రఖండ కార్యదర్శి ప్రభాపతి గోపాల్, భజరంగదల్ సుబ్రహ్మణ్యం, మాతృశక్తి అరుణ, న్యాయవాది ప్రగడ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

బోగోలులో...

బిట్రగుంట : బోగోలులో శనివారం టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు కశ్మీర్‌లో ఉగ్ర దాడులను ఖండిస్తూ కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. బోగోలు కూడల్లో ప్రారంభమైన ర్యాలీ బీజేపీ కార్యాలయం మీదుగా రైల్వే ఎల్సీగేట్ 144 నుంచి టీడీపీ కార్యాలయం వరకు సాగింది. ఇలాంటి ఘటనలను తీవ్రంగా ఖండించాలని నినదించారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ, బీజేపీ మండల అధ్యక్షులు నాగేశ్వరరావు, వీరాల శ్రీనివాసులు యాదవ్, నాయకులు ఎల్.సుధీర్‌బాబు, ఎన్ఎస్‌యాదవ్, పీ.సుధాకర్, బీ.ప్రభాకర్, అహ్మద్‌బాషా, డీ.తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టండి

● డీఏవో సత్యవాణి



రైతులకు భూసార పరీక్ష పత్రాలు అందజేస్తున్న డీఏవో సత్యవాణి

అల్లూరు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్, రబీ సీజన్లకు అత్యధికంగా వరిపైనే ఆధారపడిన రైతులు వీటికి ప్రత్యామ్నాయంగా ఖరీఫ్‌లో జనుము, జీలుగ, పిల్లిపెసర పంటలను వేసుకోవడం ఉపయోగకరమని జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి అన్నారు. మండ లంలోని బీరంగుంటలో శనివారం నిర్వహిస్తు న్న భూసార పరీక్ష నమూనాల సేకరణ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయమంటే కేవలం వరి మాత్రమే కాదని ఇతర పంటల సాగుపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. అదేవిధంగా భూసార పరీక్షలు చేయించుకోవడం ద్వారా రైతుల పొలంలో ఉన్న సూక్ష్మధాతువుల వివరాలు తెలుస్తాయని తద్వారా ఎరువుల వినియోగం, యాజమాన్య పద్ధతుల సులభతరంగా ఉంటాయని పేర్కొన్నారు. అనంతరం రైతులకు భూసార పరీక్ష పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆధార్ శిబిరాలను వినియోగించుకోవాలి



మండల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ జిహారిక

బిట్రగుంట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): అందరికీ ఆధార్ ఉండాలన్న లక్ష్యంతో జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ చొరవతో ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు ప్రత్యేక క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు సురేష్ బాబు కోరారు. శనివారం బోగోలు ఎంపీడీవో కార్యాలయ సమావేశం హాల్‌లో ఎంపీపీ సుజాత అధ్యక్షతన జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ వారసత్వం, చుక్కల భూముల నోషన్ ఖాతా నెంబర్లను సరిచేయించుకునేందుకు వీఆర్వోలను సంప్రదించాలన్నారు. రైతులు నీటి పన్ను చెల్లింపులో ప్రజాప్రతినిధులు కూడా అధికారులకు సహకారం అందించాలని కోరారు. కోవూరుపల్లి వైద్య అధికారిని జిహారిక మాట్లాడుతూ పెరుగుతున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పీహెసీలు, సబ్‌సెంటర్లు, సచివాలయాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. తాగునీటి సమస్య తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు చేపట్టామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రవీంద్ర అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ కీర్తన, మండల ఉపాధ్యక్షుడు మాధవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వీఎస్‌యూ పీజీ కళాశాల ప్రిన్సిపాల్‌గా శ్రీనివాసరావు



బాధ్యతలు చేపడుతున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు

కావలిటౌన్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి) : విక్రమ సింహపురి యూనివర్సిటీ కావలి పీజీ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఆచార్య చిలుమూరి శ్రీనివాసరావు శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో పీజీ సెంటర్ స్పెషల్ ఆఫీసర్‌గా, ప్రిన్సిపాల్‌గా, డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్‌గా, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్‌గా వీఎస్‌యూలో అనేక బాధ్యతలు చేపట్టారు. బోధన, పరిశోధన విభాగాల్లో 30 ఏళ్ల అనుభవం కలిగిని ఈయన 14 పుస్తకాలు రచించడమేకాక వివిధ జాతీయ అంతర్జాతీయ పత్రికల్లో 39 పరిశోధన పత్రాలు ప్రచురితమయ్యాయి. 3 జాతీయస్థాయి సెమినార్‌లు నిర్వహించారు. అనేక ప్రాజెక్టులు పూర్తి చేశారు. బాధ్యతలు స్వీకరించిన ఆయనకు అధ్యాపకులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు, జ్ఞాపికలు అందజేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. కాగా ఇటీవల కళాశాలలో అనేక వివాదాలు చోటు చేసుకోవడంతో పెద్దఎత్తున మీడియాలో దుమారం లేసి యూనివర్శిటీ పెద్దలకు తలనొప్పిగా మారిన నేపథ్యంలో ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టిన చిలుమూరి ఈ సవాళ్లను ఎలా ఎదుర్కొంటారో వేచి చూడాల్సిందే.


కొత్త వ్యక్తుల సమాచారమివ్వాలి : డీఎస్పీ



తనిఖీల్లో స్వాధీనం చేసుకున్న సరైన పత్రాలు లేని బైక్‌లు, ఆటోలు

కావలి రూరల్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తుంటే పోలీస్ డయిల్ 112కు సమాచారం ఇవ్వాలని డీఎస్పీ శ్రీధర్ పేర్కొన్నారు. కావలి పట్టణంలోని పెంకులఫ్యాక్టరీ గిరిజన కాలనీలో శనివారం పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో సరైన పత్రాలు లేని 55 బైక్‌లు, 3 ఆటోలు స్వాధీనం చేసుకున్నారు. 45 మంది వేలిముద్రలు స్వీకరించి వారిలో అనుమానితులుగా ఉన్న ఇద్దరు పాత నేరస్తులను అదుపులోకి తీసుకుని విచారించి పంపించారు. ఈ తనిఖీల్లో డీఎస్పీతో పాటు 1వ, 2వ పట్టణ, రూరల్, సర్కిల్ సీఐలు ఫిరోజ్, గిరిబాబు, రాజేశ్వరరావు, పాపారావు, 10 మంది ఎస్ఐలు, 50 మంది సిబ్బంది పాల్గొన్నారు.

వేసవిలో రక్తం కొరత నివారణకు రక్తదానం



రక్తదానం చేస్తున్న డాక్టర్ ఉమాచంద్, తదితరులు

కావలి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): వేసవి కాలంలో రక్తం కొరత నివారించేందుకు తమ ఆసుపత్రి డాక్టర్లు, సిబ్బంది రక్తదానం చేయడానికి ముందుకు వచ్చారని డాక్టర్ ఉమాచంద్ తెలిపారు. కావలి పట్టణ డాక్టర్ ఉమాచంద్ ఆసుపత్రిలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. 44 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ఉపాధ్యక్షుడు డాక్టర్ బెజవాడ రవికుమార్, డాక్టర్ మేఘనాథ్, కోశాధికారి అరికట్ల మధుసూదనరావు, డాక్టర్ ఫయాజ్, పీఆర్వో వేణుగోపాల్‌రెడ్డి, రెడ్‌క్రాస్ చైర్మన్ రవిప్రకాష్, వైస్‌చైర్మన్ కే. హరినారపరెడ్డి పాల్గొన్నారు.

కావలిటౌన్ : హ్యాపీ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం రెడ్‌క్రాస్ రక్తనిధిలో పలువురు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. సంస్థ క్రియాశీలక సభ్యులు మారుబోయిన నాగరాజు, నీలిమ దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భగా ఈ రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. సంస్థ అధ్యక్షుడు సయ్యద్ ఘనీబాషా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు ఖాదర్‌బాషా, జాగో సంస్థ అధ్యక్షుడు జమీర్, పూల చాన, భరత్‌కుమార్, స్టాఫ్‌నర్స్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎలక్ట్రిక్ ట్రై సైకిళ్ల పంపిణీ

కావలి : నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా నియోజకవర్గంలోని దివ్యాంగులకు ఆదివారం పంపిణీ చేసేందుకు ఎలక్ట్రిక్ ట్రైసైకిళ్లు సిద్ధం చేశారు. పట్టణంలోని ఉదయగిరి రోడ్డు మినీ స్టేడియంలో పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేపట్టారు. అనంతరం నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశం జరుగుతోంది. ఈ కార్యక్రమంలో ఎంపీ ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, కావలి ఎమ్మెల్యే వెంకటకృష్ణారెడ్డి పాల్గొంటారని టీడీపీ వర్గాలు తెలిపాయి.

బిట్రగుంట రైల్వే అభివృద్ధిపై దృష్టి పెట్టాలి

బిట్రగుంట, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): బిట్రగుంట రైల్వే అభివృద్ధిపై ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు దృష్టి పెట్టాలని రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ బిట్రగుంట బ్రాంచ్ అధ్యక్షుడు పీ.చెంచయ్య, కార్యదర్శి పీ.గోవిందరాజులు కోరారు. బోగోలులోని అసోసియేషన్ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ బిట్రగుంట పరిధిలో 1200 మందికిపైగా రైల్వే విశ్రాంత ఉద్యోగులు ఉన్నారన్నారు. రైల్వేకు సంబంధించిన వందలాది ఎకరాలు నిరుపయోగంగా ఉన్నాయని, వందేభారత్ రైలుకు సంబంధించిన యూనిట్ ఏర్పాటు చేస్తే మంచిదన్నారు. ఈ విషయాన్ని ఇప్పటికే బిట్రగుంట రైల్వే అభివృద్ధికి కృషి చేస్తున్న నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వేస్ జనరల్ సెక్రటరీ మర్రి రాఘవయ్య దృష్టి తీసుకెళుతామన్నారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ చైర్మన్ నూకసాని శ్రీనివాసులు, కోశాధికారి ఎస్.శ్రీనివాసులు, సహాయ కార్యదర్శులు బి.రాజన్న, విజయకుమార్, ఉపాధ్యక్షులు సీహ్.రమణయ్య, జే.యలమందయ్య, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల డబ్బులకు లెక్కేది!?

నెల్లూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : గిరిజనుల అభివృద్ధికి తీసుకొచ్చిన ఎస్టీ సబ్‌ప్లాన్‌ను కొందరు డీఆర్‌డీఏ ఉద్యోగులు కల్పతరువుగా మార్చుకున్నారు. గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని వారికి చెందాల్సిన నిధులను దిగమింగారు. ఒక్క రాపూరు మండలంలోనే రూ.71 లక్షలుతినేసినట్లు తెలింది. ఈ లెక్కన చూస్తే ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు ఏ స్థాయిలో పక్కదారి పట్టాయోనన్న అనుమానాలు కలుగుతున్నాయి. రాపూరు యానాది మండల సమాఖ్య పరిధిలో 14 యానాది గ్రామ సంఘాలు(వీవో) ఉన్నాయి. వీటి పరిధిలోని యానాది పొదుపు మహిళల కోసం రూ.2.47 కోట్లు ఎస్టీ సబ్‌ప్లాన్ కింద మంజూరయ్యాయి. అయితే ఈ నిధులను డీఆర్‌డీఏ క్షేత్రస్థాయి సిబ్బంది పక్కదారి పట్టించినట్లు చాలా కాలం నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో పనిచేసిన మండల, క్లస్టర్, జిల్లా స్థాయి అధికారులు ఈ ఆరోపణలు పట్టించుకోకుండా అక్రమాలతో చేతులు కలిపారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గిరిజనుల నిధులు పక్కదారి పట్టడంపై కలెక్టర్ ఆనంద్‌కు ఫిర్యాదులు అందాయి. ఒక్క సబ్‌ప్లాన్ నిధులే కాకుండా సీఐఎఫ్ వంటి ఇతర పథకాల నిధులు కూడా తినేసినట్లు ఫిర్యాదుల్లో పేర్కొన్నారు. ఒక్క రాపూరు మండలంలోనే సుమారు రూ.2 కోట్లకుపైగా పొదుపు మహిళల డబ్బులను తినేసినట్లు లెక్కలతో సహా ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాలతో 9 మందితో డీఆర్‌డీఏ పీడీ కమిటీని ఏర్పాటు చేసి విచారణ జరిపించారు. యానాదులకు వాస్తవంగా రూ.1.76 కోట్లు మాత్రమే రుణాలుగా అందించారని, మిగిలిన రూ.71 లక్షలను వెలుగు సిబ్బంది పక్కదారి పట్టించారని విచారణలో తేలింది. అలానే సున్నా వడ్డీతో ఇచ్చిన ఈ సబ్‌ప్లాన్ రుణాలకు గిరిజనుల నుంచి వడ్డీలు కూడా వసూలు చేసినట్లు బయటపడింది.



● నాడు విచారణ.. నేడు చర్యలు ఆలస్యం

ఒక్క సబ్‌ప్లాన్ నిధుల్లోనే రూ.71 లక్షలు తినేశారంటే ఇక మిగిలిన పథకాల్లో ఎంత మేర తినేసి ఉంటారో ఊహించుకోవచ్చు. అయితే ఈ నివేదికను చూసిన కలెక్టర్ కూడా తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేసినట్లు సమాచారం. అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవడంతోపాటు రికవరీ చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ మేరకు డీఆర్‌డీఏ అధికారులు పలువురు సీసీలు, ఏపీఎంలను బాధ్యులుగా చేస్తూ నోటీసులు జారీ చేశారు. ఇది జరిగి నెల రోజులు గడిచినా ఇంతవరకూ ఎటువంటి తదుపరి చర్యలు తీసుకోలేదు. పేదల డబ్బులు తినేసిన అక్రమార్కులు రాజకీయ నాయకుల ద్వారా ఒత్తిడి తీసుకొస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. అసలు విచారణ కమిటీని ఏర్పాటు చేసినప్పటి నుంచే స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తూ కలెక్టర్‌కు ఫిర్యాదుల చేశారు. డీఆర్‌డీఏ అధికారులతో కమిటీ వద్దని, థర్డ్ పార్టీతో విచారణ జరిపిస్తేనే వాస్తవాలు తెలుస్తాయని వారు కోరారు. అయితే వారి అనుమానాలకు బలం చేకూరుస్తూ విచారణ కమిటీ విచారణను చాలా ఆలస్యం చేసింది. కలెక్టర్ ఆదేశించి ఆయన పలుమార్లు అడిగాక ఎట్టకేలకు మూడు నెలల తర్వాత నివేదికను అందజేశారు. అదే మాదిరిగా ఇప్పుడు చర్యలు కూడా ఆలస్యమవుతున్నాయి. నిధులు సక్రమంగా సభ్యులకు చెందుతున్నాయో లేదో చూడాల్సిన అధికారుల బాధ్యతలను స్థానికులు నిర్వర్తించి అవకతవకలను గుర్తించారు. ఆ తర్వాత కూడా అధికారులు సక్రమంగా స్పందించకపోతుం డడంతో మళ్లీ స్థానికులే గత సోమవారం గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం గమనార్హం.

- ● రాపూరులో భారీగా సబ్‌ప్లాన్ నిధులు పక్కదారి
- ● డీఆర్‌డీఏ ఉద్యోగులే తినేసినట్లు నిర్ధారణ
- ● నెల రోజుల క్రితం నోటీసులతో సరి
- ● ఇప్పటికీ చర్యల్లేవు.. రికవరీ ఆలోచన లేదు!
- ● థర్డ్ పార్టీ విచారణతోనే మరిన్ని వాస్తవాలు

నోటీసులకు సమాధానం ఇచ్చారు

రాపూరు మండలంలో జరిగిన నిధుల దుర్వినియోగంపై బాధ్యులకు నోటీసులు ఇచ్చాం. వారు సమాధానాలు ఇచ్చారు. తదుపరి చర్యలకు ఫైల్ సర్క్యులేట్ చేస్తున్నాం.

- నాగరాజకుమారి, డీఆర్‌డీఏ పీడీ



కోడి.. దాహంతో వెంపర్లాడి!

మండుతున్న ఎండలకు మనుషులే కాదు.. మూగ ప్రాణులూ అల్లాడిపోతున్నాయి. తిండి గింజలు లేక.. దాహం తీర్చుకోలేక వెంపర్లాడుతున్నాయి. నగరంలోని ఓ వ్యాపారి విక్రయానికి తీసుకొచ్చిన కోళ్లు దాహంతో విలవిల్లాడాయి. దీంతో వెంటనే ఓ సీసా నీటిని కొనుగోలు చేసి వాటి దాహం తీర్చాడు. ఈ దృశ్యాన్ని 'ఆంధ్రజ్యోతి' తన కెమెరాలో బంధించింది.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్ (ఆంధ్రజ్యోతి, నెల్లూరు)

పశువైద్యులు అంకితభావంతో పనిచేయాలి

● పశుసంవర్ధకశాఖ జేడీ రమేష్‌నాయక్ ● ఘనంగా ప్రపంచ పశువైద్య దినోత్సవం



రక్తదానం చేస్తున్న పశువైద్యులు

నెల్లూరు(వ్యవసాయం), ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మూగజీవుల ఆరోగ్యం కోసం పశువైద్యులు, సిబ్బంది అంకిత భావంతో పనిచేయాలని పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కే. రమేష్‌నాయక్ పేర్కొన్నారు. ప్రపంచ పశువైద్య దినోత్సవాన్ని శనివారం నగరంలోని ఓ కల్యాణ మండపంలో పశువైద్యులు, వారి కుటుంబ సభ్యులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ దేశ జీడీపీని పెంచేందుకు పశుజాతులు, గొర్రెలు, కోళ్ల ఉత్పత్తి ఎంతో అవసరమని, ఆదిశగా ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. వెట్ ఫార్మా కంపెనీ లిమిటెడ్ చైర్మన్ డాక్టర్ టీ.చలమయ్య మాట్లాడుతూ పాడి రైతుల సంక్షేమం కోసం, వారి ఆర్థికాభివృద్ధికి సమిష్టిగా పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విశ్రాంత పశువైద్యులు బ్రహ్మారెడ్డి, వేణుగోపాల్, నాగేశ్వరమ్మ, మురళీనాథ్‌ను సన్మానించారు. క్రీడల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ సంబరాల్లో డీడీలు సోమయ్య, నాగమణి, మల్లారెడ్డి, శ్రీధర్‌రావు, ఏడీలు డాక్టర్ చైతన్యకిషోర్, మాలకొండయ్య, మాధవీలత, కృష్ణమౌర్యలతోపాటు పలువురు పశువైద్యులు, సిబ్బంది, ఆయా సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై నివేదిక సిద్ధం చేయండి

ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన నేపథ్యంలో కలెక్టర్‌తో మంత్రి ఆనం

నెల్లూరు (వైద్యం) ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మే 1న ఆత్మకూరు నియోజకవర్గంలో పర్యటనపై కలెక్టర్ ఆనంద్‌తో శనివారం దేవదాయ శాఖామంత్రి ఆనం రామ నారాయణరెడ్డి చర్చించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ భేటీలో రూట్ మ్యాప్, బందోబస్తు తదితర అంశాలపై చర్చించారు. ఆత్మకూరు మండలం నారంపేటలో ఎంఎస్ఎంఈ పార్కు ప్రారంభోత్సవం ఉంటుందని మంత్రి ఆనం పేర్కొన్నారు. మేడే సందర్భంగా ఆటో, గృహ నిర్మాణ, ఇతర కార్మికులతో సీఎం ముఖాముఖి నిర్వహిస్తారన్నారు. నెల్లూరు పాళెం ఎస్టీ కాలనీలో పింఛన్ల పంపిణీ, ఏఎంసీ గ్రౌండ్‌లో ప్రజా వేదిక, పార్టీ కార్యకర్తల సమావేశం ఉంటాయని వివరించారు. ప్రజా వేదిక ఏర్పాట్లును మార్గదర్శకంగా చేయాలని సూచించారు. ఆత్మకూరు అభివృద్ధి, సమస్యలపై నివేదిక తయారు చేయాలన్నారు. శుక్రవారం రాత్రి నెల్లూరుపాళెం ఎస్టీ కాలనీని తాను సందర్శించానని, అక్కడ చాలామందికి ఇళ్లు లేవని, వెంటనే వారికి ఇళ్లు నిర్మించి ఇచ్చేందుకు తగిన చర్యలు తీసుకోవాలని మంత్రి కలెక్టరును కోరారు. యువతకు స్వయం ఉపాధిపై చర్యలు తీసుకోవాలన్నారు. సోమశిల జలాశయ మరమ్మతు పనులు, హైలెవల్ కెనాల్, తెలుగు గంగ పనులను సీఎం దృష్టికి తీసుకు వెళ్లేలా నివేదిక రూపొందించాలని సూచించారు. నగరంలో కలెక్టర్ భవనం, అధునాతన అతిథి గృహం, ఆత్మకూరులో బీసీ బాలికల రెసిడెన్సియల్ పాఠశాల ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. ఆదూరుపల్లి రెసిడెన్షియల్ పాఠశాలను ఇంటర్ వరకు అప్‌గ్రేడ్ చేయాలని, సంగంలో ఐటీఐ ఈ ఏడాది నుంచే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్పీ కృష్ణకాంత్ పాల్గొన్నారు.

ఒకటి నుంచి క్రికెట్ వేసవి శిబిరం

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ సహకారంతో మే 1 నుంచి నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో క్రికెట్ వేసవి శిబిరాన్ని నిర్వహించనున్నామని అసోసియేషన్ కార్యదర్శి కే.శ్రీనివాసరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు స్టేడియంలోని క్రికెట్ కార్యాలయంలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన తెలిపారు.

సోమశిలలో 51.342 టీఎంసీల నీరు

అనంతసాగరం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, శనివారం నాటికి 51.342 టీఎంసీలు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఉత్తర కాలువకు 200, దక్షిణ కాలువకు 50, డెల్టాకు 30 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

ఫారెన్ సర్వీసెస్ నియామకాలకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : సమగ్రశిక్షలో ఫారెన్‌సర్వీసెస్‌కు డిప్యుటేషన్ పద్ధతిలో పనిచేసేందుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏపీసీ వెంకట సుబ్బయ్య ఒక ప్రకటనలో తెలిపారు. సెక్టోరియల్ ఆఫీసర్స్ విభాగంలో ప్లానింగ్, ఎంఐఎస్ కోఆర్డినేటర్, అసిస్టెంట్ సెక్టోరియల్ ఆఫీసర్స్ విభాగంలో అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ (ఏఎస్‌వో), అసిస్టెంట్ అకడమిక్ మానటరింగ్ ఆఫీసర్(ఉర్దూ ఏఏఎంవో), అసిస్టెంట్ ఆల్టర్నేటివ్ స్కూలింగ్ కోఆర్డినేటర్(ఏఎల్ఎస్‌సీవో), అసిస్టెంట్ ఇంక్లూసివ్ ఎడ్యుకేషన్ కోఆర్డినేటర్ (ఐఈసీవో) పోస్టులు భర్తీ చేస్తున్నామని వివరించారు. ఆసక్తి, అర్హత కలిగిన స్కూల్ అసిస్టెంట్, ఎస్‌జీటీలు ఈనెల 26 నాటికి 55 ఏళ్ల లోపల ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 30వతేదీ సాయంత్రం ఐదు గంటలలోగా విద్యార్హత సర్టిఫికెట్‌లు, మార్కుల జాబితాలు, అనుభవం, ఇతర సర్టిఫికెట్‌లతో గజిటెడ్ సంతకం చేయించి, నేరుగా ఎస్ఎస్ఏ కార్యాలయంలో అందచేయాలని ఆయన తెలిపారు. మరిన్ని వివరాలకు www. deo nellore50 webs.com అనే వెబ్‌సైట్‌లో పరిశీలించాలని తెలిపారు.

విద్యుత్ వృథాను తగ్గించండి

● ఎస్పీడీసీఎల్ సీజీఎం ఆదిశేషయ్య



సమావేశంలో మాట్లాడుతున్న ఆదిశేషయ్య

నెల్లూరు (జడ్పీ), ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎక్కువగా లైన్‌లాస్ ఉందని, దీన్ని తగ్గించాలని విద్యుత్ శాఖ అధికారులను ఎస్పీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ (సీజీఎం) ఆదిశేషయ్య ఆదేశించారు. జిల్లాకు వచ్చిన ఆయన శనివారం విద్యుత్ భవన్‌లో అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లైన్‌లాస్ వల్ల సంస్థకు ఎక్కువగా నష్టం వస్తున్నదని, దీన్ని తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో 8వేల డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్‌లు ఉండగా, ఒక్క సర్వీసుకు కూడా మ్యాపింగ్ చేయలేదని, మే 31లోగా అన్నీ సర్వీసులకు మ్యాపింగ్ చేయాలన్నారు. ప్రతి ఫీడర్‌కు ఎనర్జీఆడిట్‌ను కచ్చితంగా నిర్వహించాలన్నారు. ఎనర్జీఆడిట్‌ను నిర్లక్ష్యంచేస్తే సంస్థ మనుగడకే ప్రమాదమవు తుందని తెలిపారు. జిల్లాలో విద్యుత్ చౌర్యం జరగకుండా ఆకస్మిక తనిఖీలు నిర్వహించుకుంటూ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వేసవిలో విద్యుత్ అంతరాయాలు ఏర్పడకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ఎస్ఈ విజయన్ మాట్లాడుతూ వ్యవసాయ సర్వీసులకు ట్రాన్స్‌ఫార్మర్లు, కండక్టర్లు, ఇతర పరికరాలను ఎండీ మంజూరు చేశారని, వీటిని వినియోగించి, పెండింగ్‌లో ఉన్న సర్వీసులన్నింటిని మంజూరు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సూర్యఘర్ నోడల్ అధికారి శేషాద్రి బాలచంద్ర, ఈఈలు లక్ష్మీనారాయణ, శ్రీధర్, బెనర్జీ, డీఈలు, జేఈలు తదితరులు పాల్గొన్నారు.

వేదగిరిలో భక్తులకు ఏ లోటూ రానీయొద్దు

- ● భద్రత, పారిశుధ్యం, తాగునీరు ముఖ్యం
- ● బ్రహ్మోత్సవ సమన్వయ కమిటీ సమావేశంలో వక్తలు



సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో అనూష

నెల్లూరురూరల్, ఏప్రిల్ 26,(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేదగిరి లక్ష్మీనరసింహ స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భక్తులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించేందుకు అన్నీ శాఖల అధికారులు తోడ్పాటునందించాలని వక్తలు పేర్కొన్నారు. శనివారం వేదగిరిక్షేత్రం లో ఆర్డీవో అనూష, బ్రహ్మోత్సవ కమిటీ చైర్మన్ ఈ. అచ్యుత శంకర్‌రెడ్డి, టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. వారు మాట్లాడుతూ వేదగిరి క్షేత్రంలో మే 6 నుంచి జరిగే బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు భద్రత, పారిశుధ్యం, తాగునీరు, ప్రయాణ సౌకర్యం, మెరుగైన వైద్యం కల్పించాలని కోరారు. వీఐపీ, వీవీఐపీల దర్శనాలను బాగా తగ్గించి సామాన్యులకు ఇబ్బందులు లేకుండా స్వామివార్ల దర్శనం కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గరుడసేవ, కల్యాణం, రథోత్సవాలకు భక్తులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్నందున, ఏడు కోనేర్ల వద్ద అగ్నిమాపక దళ సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అలాగే భద్రతపై నిఘా పెట్టాలని తెలిపారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అత్యవసర సర్వీసులు అందుబాటులో ఉంచాలన్నారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ మాజీ చైర్మన్లు వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి, ఈవో గోపి, తదితరులు పాల్గొన్నారు.

దేవుడి మాన్యం వేలంలో అవకతవకలు

● చిత్తలూరు గ్రామస్థుల ఆరోపణ

నెల్లూరు (సాంస్కృతికం) ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): చేజర్ల మండలం చిత్తలూరులోని చెన్నకేశవస్వామి, వీరభద్రస్వామి ఆలయాల భూములకు నిర్వహించిన వేలంలో అవకతవకలు జరిగాయని గ్రామస్థులు కూరపాటి భక్తవత్సలబాబు, టీ.వెంకటకృష్ణ, కే.మల్లికార్జున్‌నాయుడు, మరి కొందరు ఆరోపించారు. శనివారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. ఆయా ఆలయాలకు చిత్తలూరు, ఆదురుపల్లి, దొరువుపాడు, వావిలేరు గ్రామాల్లో భూములు ఉన్నాయని తెలిపారు. వాటికి వేలం గడువు 2023 మే నెలతో తీరిపోయిందన్నారు. ఆయా దేవస్థానాల్లో పనిచేస్తున్న పూజారికి ఆలయ అధికారి జీతాలు ఇవ్వడంలేదన్నారు. ఈ విషయమై గ్రీవెన్స్‌లో జేసీకి విన్నవించుకున్నామని తెలిపారు. 15రోజుల్లో పూజారికి జీతం చెల్లించాలని, దేవుడి మాన్యాలకు కూడా వేలం వేయాలని జేసీ ఆదేశించారని వారు వివరించారు. ఆలయ అధికారులు, స్థానిక అధికార పార్టీ నాయకులతో కుమ్మక్కై దేవుడి మాన్యాల వేలం గురించి గ్రామంలో దండోరా కూడా వేయకుండా హడావుడిగా వేలంనిర్వహించారని పేర్కొన్నారు. వేలం పాడిన రైతుల నుంచి పాట మొత్తం నగదును డిపాజిట్లుగా తీసుకోకుండా, 15రోజులు గడువు ఇచ్చారని, ఇది ఎంత వరకు న్యాయమని వారు ప్రశ్నించారు. ఇప్పటికీ పూజారికి జీతాలు చెల్లించలేదన్నారు. మాన్యాల వేలం రద్దు చేసి తిరిగి నిర్వహించాలని వారు కోరారు. అధికార పార్టీ నేతలతో చేతులు కలిపి ఏకపక్షంగా వ్యవహరిస్తున్న దేవదాయ శాఖ అధికారులపై విచారణ చేపట్టాలని వారు ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

● తిరుపతిలో ఘటన



కొంగుముడుసు నాగరాజు (ఫైల్)

కొండాపురం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఓ వివాహిత కుటుంబ సభ్యులు, పోలీసులు అకారణంగా దాడి చేశారన్న మనస్తాపంతో ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తిరుపతిలో శుక్రవారం అర్ధరాత్రి జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలు కుటుంబ సభ్యుల కథనం మేరకు ఇలా ఉన్నాయి. సాయిపేట పంచాయతీ కొమ్ము పాలెంకు చెందిన కొంగు ముడుసు నాగరాజు (28) కొంత కాలంగా బేల్దారు పనులు చేసుకుంటూ భార్య సాయిప్రియ, 5 ఏళ్లలోపు ఇద్దరు పిల్లలతో కలిసి తిరుపతిలోని మంగళం బీటీఆర్ కాలనీలో నివాసం ఉంటున్నారు. ఇటీవల నాగరాజు తమ్ముడు పోతురాజు దగదర్తి మండలం అనంతవరం గ్రామానికి చెందిన ఓ వివాహితతో వివాహేతర సంబంధం పెట్టుకుని ఆమెను ఇంటి నుంచి తీసుకెళ్లాడు. తిరుపతిలో ఉన్న అతని అన్న నాగ రాజు ఇంటికి వెళ్లాడన్న సమాచారంతో ఆ వివాహిత కుటుంబసభ్యులు, పోలీసులు శుక్రవారం అక్కడకు చేరుకున్నారు. అక్కడ పోతురాజు, ఆ మహిళ లేకపోవడంతో వారి ఆచూకి కోసం నాగరాజును ప్రశ్నించారు. ఆ విషయం తనకు తెలియదని చెప్పడంతో అతనిపై వివాహిత కుటుంబసభ్యులు, పోలీ సులు దాడి చేశారు. దీంతో మనస్తాపానికి గురైన నాగరాజు అదేరోజు రాత్రి భార్య, పిల్లలు నిద్రపోతున్న సమయంలో ఉరి వేసు కొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విష యాన్ని భార్య సాయిప్రియ ఫోను ద్వారా కుటుంబ సభ్యులకు తెలియ చేయడంతో వారు అక్కడకు చేరుకొని నాగరాజు మృతికి కారణమైన పోలీసులు, మహిళ కుటుంబ సభ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

నెల్లూరులో వివాహిత బలవన్మరణం

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బాలాజీనగర్‌లో శనివారం ఓ వివాహిత ఆత్మహత్య చేసుకొని మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు, బాలాజీనగర్ లోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు సమీపాన కృష్ణ, గోమతి(31) దంపతులు ఉం టున్నారు. వారికి ఇద్దరు కుమారులు. కృష్ణ నగరంలోని ఓ పెట్రోలు బంకులో పని చేస్తుండేవాడు. మనస్పర్థల కారణంగా ఆయన తన స్వగ్రామమైన దగదర్తిలో ఉంటూ అప్పుడ ప్పుడు భార్యాపిల్లల వద్దకు వచ్చి వెళ్లేవాడు. గోమతి ఓ క్యాటరింగ్‌లో పని చేస్తూ పిల్లలను పోషించుకునేది. కొంతకాలంగా ఆమె అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ క్రమంలో శనివారం ఆమె తన ఇంట్లో ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. గమనించిన చుట్టుపక్క లవారు చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు ఆమెను తరలిం చారు. అనంతరం భర్త కృష్ణకు, పుట్టింటి వారికి సమా చారం అందించారు. వైద్యశాలలో చికిత్స పొందుతూ ఆమె మృతిచెందింది. సమా చారం అందుకున్న బాలాజీనగర్ ఎస్ఐ విజయశ్రీనివాస్ వైద్యశాలకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళలను పారిశ్రామికవేత్తలుగా చేయాలన్నదే లక్ష్యం

● పురపాలక శాఖ మంత్రి నారాయణ



శిక్షణ ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి నారాయణ

నెల్లూరు (హరనాథపురం) ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మహిళలను పారిశ్రామికవేత్తలుగా చేయాలనే లక్ష్యంతో పని చేస్తున్నామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ చెప్పారు. నగరపాలక సంస్థ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో మెప్మా ఆధ్వర్యంలో జిల్లాలోని స్మార్ట్ స్ట్రీట్ వ్యాపారులకు నిర్వహించిన మూడు రోజుల శిక్షణ శనివారం ముగిసింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మహిళలు సాధారణంగా చేసే చిన్నచిన్న వృత్తులు కాకుండా, పెద్దపెద్ద వ్యాపారాలు చేసే స్థాయికి ఎదగాలన్నదే తన అభిమతమన్నారు. వ్యాపారం విజయవంతంగా నిర్వహించాలంటే కంప్యూటర్‌పై కనీస అవగాహన ఉండాలని తెలిపారు. గతంలో తాము అధికారంలో ఉన్నప్పుడు డ్వాక్రా మహిళలకు రూ.2500 కోట్లు విలువ చేసే ఇసుక వ్యాపారాన్ని అందించామని గుర్తు చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు నగరంలోని నిరుపేదలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దుతానని, వేయిమందితో దుకాణాలు ఏర్పాటు చేస్తామని మంత్రి చెప్పారు. ఇందులో భాగంగా మొదటిదశలో 163 మంది వీధివ్యాపారులను ఎంపిక చేసి, వారితో దేశంలో ఎక్కడా లేనివిధంగా స్మార్ట్ బజార్లను నిర్వహించచేస్తామని వివరించారు. వ్యాపారుల కోసం అవసరమైన సబ్సిడీలు, రుణాలు, సోలార్ పవర్ అందజేయడమే కాకుండా, వారికి వ్యాపారంలో మెలకువలు తెలియజెప్పేందుకు మూడు రోజులపాటు శిక్షణ ఇచ్చామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నగర కమిషనర్ వైవో నందన్, మెప్మా పీడీ రాధమ్మ, మెప్మా అడిషనల్ మిషన్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు, స్టేట్ మిషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, సుధీర్ వర్మ, తదితరులు పాల్గొన్నారు.



సినిమాలో ఓ సన్నివేశాన్ని చిత్రీకరిస్తున్న చిత్ర యూనిట్

అల్లూరులో సినిమా సందడి

అల్లూరు మండలంలోని పలు ప్రాంతాల్లో హైదరాబాద్ నుంచి వచ్చిన చిత్ర పరిశ్రమ యూనిట్‌తో సినీ సందడి నెలకొంది. ఈ ప్రాంతంలో మూడు రోజులుగా చేపట్టిన సినిమా షూటింగ్ శనివారం ఇందుపూరులో చిత్రీకరించారు. ఎంఎంఆర్ ఆర్ట్స్ క్రియేషన్ పతాకంపై రూపుదిద్దుకుంటున్న 'ఈమె సుబ్బమ్మ.. ఇదియే ఈమె కథ' సినిమాకు శ్యామ్‌సెల్వన్ కథా నాయకుడుగా, ఇష కథానాయికగా, ఏఎన్‌కె కిరణ్ దర్శకత్వం వహిస్తుండగా మంద మల్లికార్జునరెడ్డి నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. డైరెక్టర్ మాట్లాడుతూ సహజత్వానికి అల్లూరు మండలంలోని పలు ప్రాంతాలు సినిమా వాతావరణానికి అనుకూలంగా ఉన్న కారణంగా ఈ ప్రాంతాలల్లో సినిమా రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. స్థానిక నాయకుడు ఎండేటి హరికృష్ణ యాదవ్ సహకారంతో ఈ సినిమా షూటింగ్ ఎటువంటి ఆటంకం లేకుండా కొనసాగుతోందన్నారు.

- అల్లూరు,(ఆంధ్రజ్యోతి)

ఉగ్రవాద చర్యలను ప్రతి ఒక్కరూ ఖండించాలి : బీజేపీ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : ప్రశాంతంగా ఉన్న కశ్మీర్‌లో అక్రమంగా చొరబడి మారణ హోమం సృష్టించిన ఉగ్రవాదుల చర్యలను ప్రతి ఒక్కరూ ఖండించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్‌సింగ్ పేర్కొన్నారు. నగరంలోని కోటమిట్ట మహాలక్ష్మి గుడి నుంచి పాత మున్సిపల్ బస్టాండ్‌లోని వివేకానంద విగ్రహం వరకు శనివారం బీజేపీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రవాద చర్యను దేశంలోని ప్రతి ఒక్కరూ ఖండిస్తున్నారని తెలిపారు. ఇప్పటికే ప్రధాని నరేంద్ర మోదీ పాకిస్థాన్‌కు సింధూ జలాల తరలింపు నిషేధం, పాక్ పౌరుల వీసా రద్దు వంటి నిర్ణయాలు తీసుకోవడం అభినందనీయమన్నారు. పహల్గాం ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారందరికీ అంజలి ఘటిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో హేమంత్, బాలాజీ, పెంచలయ్య, సత్య, మురళి, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.



కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు